SAPTHAGIRI (TELUGU)
ILLUSTRATED MONTHLY
Volume: 52, Issue: 6
November-2021, Price Rs.5/-

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

సచిత్రమాసపత్రిక

నవంబరు 2021
వెల రూ.5/-
పుటలు-56



## తిరుమల శ్రీవారి పుష్పయాగమహోత్సవం

(11-11-2021)



తిరుచానూరు

# శ్రీ పద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాలు

2021 నవంబరు
29 నుండి డిసెంబరు 08 వరకు

**29-11-2021 సోమవారం**
పగలు: లక్షకుంకుమార్చన
రాత్రి: సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ

**30-11-2021 మంగళవారం**
పగలు: తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం
రాత్రి: చిన్నశేషవాహనం

**01-12-2021 బుధవారం**
పగలు: పెద్ద శేషవాహనం
రాత్రి: హంసవాహనం

**02-12-2021 గురువారం**
పగలు: ముత్యపుపందిరి వాహనం
రాత్రి: సింహ వాహనం

**03-12-2021 శుక్రవారం**
పగలు: కల్పవృక్ష వాహనం
రాత్రి: హనుమద్వాహనం


**04-12-2021 శనివారం**
పగలు: పల్లకీ ఉత్సవం, సా. వసంతోత్సవం
రాత్రి: గజవాహనం

**05-12-2021 ఆదివారం**
పగలు: సర్వభూపాలవాహనం
రాత్రి: గరుడవాహనం

**06-12-2021 సోమవారం**
పగలు: సూర్యప్రభ వాహనం
రాత్రి: చంద్రప్రభ వాహనం

**07-12-2021 మంగళవారం**
పగలు: రథోత్సవం
రాత్రి: అశ్వవాహనం

**08-12-2021 బుధవారం**
పగలు: పల్లకీ తిరుచ్చి ఉత్సవం, తీర్థవారీ అవబృథోత్సవం, చక్రస్నానం, పంచమీ తీర్థం
రాత్రి: తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణం



# గీతాశ్లోకార్థసారం

**శ్లో :** దృష్ట్వేమం స్వజనం కృష్ణ యుయుత్సుం సముపస్థితమ్॥ 28 ॥
సీదంతి మమ గాత్రాణి ముఖం చ పరిశుష్యతి
వేపథుశ్చ శరీరే మే రోమహర్షశ్చ జాయతే ॥ 29 ॥

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం- 28/29)

**ప్రతిపదార్థం:** కృష్ణ!= ఓ కృష్ణా!; సముపస్థితమ్=(సమరభూమికి) చేరియున్న; యుయుత్సుమ్= యుద్ధాభిలాషతో నున్న; ఇమమ్ స్వజనమ్= ఈ స్వజన సముదాయమును; దృష్ట్వా= చూచి; మమ= నాయొక్క; గాత్రాణి = అంగములు; సీదంతి= పట్టుతప్పు చున్నవి; చ= మఱియు; ముఖమ్= నోరు; పరిశుష్యతి= ఎండిపోవుచున్నది; చ= ఇంకను; మే= నాయొక్క; శరీరే= శరీరమునందు; వేపథుః= కంపము, రోమహర్షః చ= గగుర్పాటు గూడ; జాయతే= కలుగు చున్నది.

**భావం:** అర్జునుడు పలికెను– "ఓ కృష్ణా! సమరోత్సాహముతో రణరంగమున నిలిచియున్న ఈ స్వజన సమూహమును జూచి, నా అవయవములు శిథిలములగుచున్నవి. నోరు ఎండిపోవుచున్నది. శరీరమునందు వణుకు, గగుర్పాటు కలుగుచున్నవి."

## కలియుగ మెటులైనాఁ గలదుగా నీకరుణ...


కలియుగ మెటులైనాఁ- గలదుగా నీ కరుణ
జలజాక్ష! హరి హరీ! - సర్వేశ్వరా!

పాపమెంత గలిగినఁ- బరిహరించే యందుకు
నా పాలఁగలదుగా నీ - నామము,
కోపమెంత గలిగిన- కొచ్చి శాంత మిచ్చుటకు
చేపట్టి కలవుగా నా - చిత్తములో నీవు.

ధర నింద్రియా లెంత- తరముకాడిన నన్ను
సరిఁగావఁ గద్దుగా నీ - శరణాగతి,
గరిమఁ గర్మబంధాలు- గట్టిన తాళ్లు వూడించ
నిరతిఁ గలదుగా - నీ భక్తి నాకు.

హితమైన యిహపరా- లిష్టమైన వెల్లా నియ్య
సతమై కలదుగా నీ- సంకీర్తన,
తతి శ్రీవేంకటేశ నా- తపము ఫలియింపించ
గతి గలదుగా నీ - కమలాదేవి.

(అధ్యాత్మ సంకీర్తన, సంపుటము: 2 - 430)



*'కమలములబోలు కన్నులు గలవాడా! హరిహరీ! సర్వమునకు ప్రభువైన వాడా! దోషభూయిష్ఠమైన కలియుగమెట్లున్నను నన్ను కాపాడుటకు నీ కృప కలదు కదా! ఇక నాకేమి భయము?*

*నా యెడల నెన్ని పాపములు గల్గినను, వాటిని సమూలముగా తుద ముట్టించుటకు నీ నామ మున్నదిగదా! నాకెంత కోపము గల్గినను నశింపజేసి శాంతమును ప్రసాదించుటకు నామనస్సులో నీవు నెలకొనియున్నావు గదా!*

*ఇంద్రియములు ఎంతగా తరుముకొని వచ్చినను నన్ను వాటి బారినుండి తప్పించుటకు నీ శరణాగతి గలదుగదా! ఘనమైన కర్మబంధము లనెడు త్రాళ్ళనుండి నన్ను విడిపించుటకు నాకు నీయెడల నున్న భక్తి కలదు కదా!*



*నా కిష్టము లైనవి, హితకరము లైనవియు అగు ఇహమునకు పరమునకు సంబంధించిన వాటినెల్ల ఇచ్చుటకు శాశ్వతమైన నీ సంకీర్తన కలదు కదా! తగిన కాలమున నాతపస్సు ఫలింపజేయుటకు నీ లక్ష్మీదేవియే నాకు గతియై యున్నది గదా!' అని అన్నమయ్య ఆ శ్రీవేంకటేశ్వరుని కీర్తిస్తున్నాడు.*



# శ్రీవేంకటేశ్వర గోసంరక్షణ ట్రస్టు













గోజాతిని సంరక్షించి, హిందూ మత వ్యవస్థలో వానికి గల విశిష్టతను తేటతెల్లం చేసే సత్సంకల్పంతో తి.తి.దే. 1956లో గోసంరక్షణశాలను నెలకొల్పింది. దీనికి అనుబంధంగానే 2002 సంవత్సరంలో **'శ్రీవేంకటేశ్వర గోసంరక్షణ ట్రస్టు'** ఏర్పాటు చేయబడింది. ఈ ట్రస్టుకు విరివిగా విరాళాలిచ్చి, పశుసంవర్ధనకు మీ సహాయ సహకారాలను అందించండి.

మీ అభీష్టం మేరకు గోశాలలోని మూగజీవులను దత్తత తీసుకుని వాటి పోషణ బాధ్యతను వహించడానికి కదలిరండి.

**అధికరణం 80 (జి) క్రింద ఆదాయపు పన్ను మినహాయింపు వర్తిస్తుంది**

**: డిమాండు డ్రాఫ్ట్ / చెక్కులు పంపవలసిన చిరునామా :**


ది డైరెక్టర్, ఎస్.వి. గోసంరక్షణ ట్రస్టు, ఎస్.వి. డైరీ ఫారం, తి.తి.దే., తిరుపతి - 517 502

ఫోన్ నెం. 0877- 2264570

50 వసంతాల
1970-2020
తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 52 నవంబరు, 2021 సంచిక : 06



వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి ॥

**గౌరవ సంపాదకులు**
డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
డా॥ కె.రాధారమణ
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకురాలు**
డా॥ అల్లాడి సంధ్య
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి., పి.జి.డిప్లొమా ఇన్ జర్నలిజం

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (ప్రచురణలు & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

సప్తగిరి మాస పత్రిక

ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ.500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-

## ఈ నెలలో....

| | | |
|---|---|---|
| వెలుగుల రవళి 'దీపావళి' | శ్రీ బి.సుబ్రహ్మణ్యం | 07 |
| శ్రీమద్భగవద్గీత | విద్వాన్, డా॥ ఈ.జి. హేమంత కుమార్ | 09 |
| 'హితబోధకాలు' - పురాణాలు | ఆచార్య జానమద్ది రామకృష్ణ | 11 |
| బకదాల్భ్య మహర్షి | శ్రీ సద్గురు డా॥ కె. శివానందమూర్తి | 14 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 17 |
| 'నరకుని'వధ- రహస్యాలు | శ్రీ జయదేవానంద | 19 |
| రామాయణంలో 'నవీన శాస్త్ర విజ్ఞానము' | ఆచార్య కె.పి.ఆర్. విఠల్‌మూర్తి | 21 |
| నాగులచవితి భక్తులకు ప్రగతి | శ్రీ కె. మల్లికార్జున | 25 |
| అరుదైన 'సప్త స్వరా'లయం | కీ.శే. డా॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రి | 31 |
| ధర్మానికి పునాది - దాంపత్యం | బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ | 33 |
| శ్రీమద్భగవద్గీత | ఆచార్య కుప్పా విశ్వనాథశర్మ | 35 |
| పాప పుణ్యాల విచక్షణ | డా॥ లక్ష్మీనారాయణమూర్తి | 37 |
| హరిదాసవాఙ్మయంలో... శ్రీవేంకటాచలాధీశుడు | శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు | 39 |
| 'భగినీ హస్త భోజనం' సప్తజన్మకృత పాపహరం | శ్రీమతి కె.నాగవేణి | 42 |
| వేదవాఙ్మయం - వైజ్ఞానికభూమిక | కీ.శే.ఆచార్య హెచ్.ఎస్.బ్రహ్మానంద | 44 |
| శ్రీకృష్ణామృతం | "అనంత" (కృష్ణసుందరి సత్తిరాజు) | 47 |
| ఆహార ఔషధం 'కాకర' | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 48 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 50 |
| సత్య మహిమ | డా॥ కె. రెడ్డప్ప | 51 |
| తిరుప్పాణి ఆళ్వార్ (చిత్రకథ) | కథ : శ్రీ డి.శ్రీనివాస దీక్షితులు<br>చిత్రాలు : శ్రీ కె.తులసీప్రసాద్ | 52 |
| బాలవినోదం | నిర్వహణ: డా॥ అల్లాడి సంధ్య | 54 |

ముఖచిత్రం : తిరుమల శ్రీవారి పుష్పయాగమహోత్సవం
వెనుక చిత్రం : తిరుమల శ్రీవారి ఆలయంలో 'దీపావళి'

ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

24 గంటలూ పనిచేసే
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777
2233333



వెబ్‌సైట్- www.tirumala.org;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
sapthagiri.helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

# జ్ఞానచైతన్య దీప్తి 'దీపావళి'

**భా**రతీయ సనాతన సంస్కృతిలో కీలకమైనవి పర్వదినాలు. అవి ఆధ్యాత్మిక, తాత్త్విక, లౌకిక అంశాలను తెలియజేసే త్రివేణీసంగమాలు. దుర్గతులను దూరం చేయడం, భావసమైక్యత సాధించడం, సమస్త ఐశ్వర్యాలను పొందడం అనే ముచ్చటైన మూడు ప్రయోజనాల ముప్పేటల మణిహారం 'దీపావళి'.

భారతదేశంలో కొన్ని ప్రాంతాలలో మూడురోజుల పండుగగా, మరికొన్ని ప్రాంతాలలో ఐదురోజుల పండుగగా ప్రశస్తికెక్కిన దీపావళిని, భారతీయుల బృహత్ పర్వదినంలో ఒక్కటిగా చెప్పుకోవచ్చు.

ఆశ్వయుజ కృష్ణ అమావాస్య రోజున దీపావళి పండుగని జరుపుకుంటాం. దుఃఖం, దుర్మార్గం, క్రోధాది దుర్గుణాలు, పరస్పర వైషమ్యాలు, శారీరిక మానసిక రుగ్మతులు, అజ్ఞానం మొదలైన వాటి సమూహమే అలక్ష్మి లేదా దారిద్ర్యం. ఈ దారిద్ర్యాన్ని తొలగించడానికై దీపావళిన రెండు పుణ్యకార్యాలను చేస్తారు. ఒకటి 'ధనలక్ష్మి' ఆరాధన కాగా మరొకటి 'దీపలక్ష్మి' సమర్చన.

ఇహలోకంలో ఆనందాన్ని, పరలోకంలో కైవల్యాన్ని అనుగ్రహించే పర్వదినం దీపావళి.

నరకాసురవధ, బలిచక్రవర్తి పాతాళంలోకి అణగద్రొక్కబడటం, శ్రీరామపట్టాభిషేకం, విక్రమశక స్థాపకుడైన విక్రమార్కుని పట్టాభిషేకం, భగినీహస్త భోజనం వంటి పౌరాణిక, చారిత్ర, కౌటుంబిక విషయాలు దీపావళి పర్వదినాన్ని అల్లుకొని ఉన్నాయి.

దీపావళి రోజున ఉత్తమ ఐశ్వర్యప్రాప్తికై 'లక్ష్మీపూజ' విశేషంగా నిర్వహించబడుతుంది. దీపమాలికల్ని ఉంచడం ద్వారా మోక్షమార్గం సుగమమౌతుంది. ఇవి ఆధ్యాత్మిక పరమైన జ్ఞానగతవిషయాలు.

దీపావళినాడు కాల్చే బాణాసంచా (టపాకాయల) వల్ల, వెలిగించే దీపాల కాంతుల వలన క్రిమి కీటకాదులు నశిస్తాయి. దీపావళి నాడు మాషపత్ర (మినప ఆకులు)భక్షణ సంప్రదాయం ఉంది. మినప ఆకులు తినటం వలన ఓషధీగుణాలు అలవడతాయి. ఇలా దీపావళి పండుగలో విజ్ఞానగత అంశాలూ ఉన్నాయి.

మనిషి తనలోని 'అరిషడ్వర్గ'మనే అంధకారాన్ని తొలగించుకోవడం కోసం 'జ్ఞానదీపాన్ని' వెలిగించాలి. దీపావళి పర్వదినంలో జ్ఞాన-విజ్ఞానగత అంశాలు మేళవించబడ్డాయి. మన సనాతన సంస్కృతికి ప్రతీకలైన ప్రతీ పండుగా మహోన్నతమైన భావాన్ని బోధించే 'దివ్య స్వరూపమే'. పండుగ మనకు అండగా నిలిచే విషయాలను సాంకేతికంగా, సాంస్కృతికంగా ప్రోదిచేసి అందించే 'ఆధ్యాత్మిక దీపిక'.

సప్తగిరీశుని అక్షరప్రసాదమైన "సప్తగిరి"ని ఆదరిస్తున్న పాఠకలోకానికి ఆ శ్రీనివాసుడు 'జ్ఞానచైతన్యదీప్తి'ని అనుగ్రహించుగాక!

*గోవిందా.....గోవింద.....గోవింద....*

# వెలుగుల రవళి 'దీపావళి'

- శ్రీ బి. సుబ్రహ్మణ్యం

చిన్నాపెద్దా తారతమ్యం లేకుండా అనాదిగా ఆనందోత్సాహాలతో జరుపుకునే పండుగ 'దీపావళి'. ఈ దీపావళి పండుగ సంప్రదాయకంగా ఎలా వచ్చిందో తెలుసుకుంటాం.

వక్రతుండ మహాకాయ - కోటిసూర్య సమప్రభ
నిర్విఘ్నం కురు మే దేవ - సర్వకార్యేషు సర్వదా !!

నమస్తేஉస్తు మహామాయే - శ్రీ పీఠేసురపూజితే
శంఖచక్ర పద్మహస్తే - పద్మస్థిత మహాలక్ష్మి నమోஉస్తుతే !!

విఘ్నాధిపతి 'గణేశుడు' కోటి సూర్యకాంతులతో ప్రకాశిస్తాడు. శ్రీ పీఠ స్థిత సురపూజిత అయిన శ్రీమహాలక్ష్మి దివ్యమణి ప్రభావ ప్రకాశమానమై కాంతులు విరజిమ్ముతుంది. కాంతులు వెదజల్లుతూ ప్రభాసమానమైన దేవతలు మనచే పూజలందుకుని- మనల్ని కరుణించి కటాక్షిస్తారు. "కాంతి" అనగా వెలుగు, ప్రకాశం, ప్రభాసం, తేజం. ఈ కాంతులు వెలుగులు ఎక్కడ నుండి వస్తాయి?

దీపం అగ్ని, సూర్యుడు, చంద్రుడు మొదలైనవన్నీ కాంతిపుంజాలను వెదజల్లే శక్తివంతమైనవి. 'జ్యోతి' అనగా దీపం. మన హిందూసంప్రదాయంలో సమస్తమైన దేవతాపూజలను, శుభకార్యాలను ముందుగా దీపారాధన చేసి ప్రారంభిస్తారు. దీపాలను వెలిగించి దేవుణ్ణి ఆరాధిస్తారు. దీపానికి ఇంతటి ప్రాధాన్యత, ప్రాశస్త్యం ఉంది.

**'దీపావళి'** పండుగని హిందువులందరూ ఆనందోత్సాహాలతో వేడుకగా జరుపుకుంటారు. దీపావళి అంటే 'దీపోత్సవం'. ఈ రోజున దీపలక్ష్మి తన శతసహస్ర కిరణకాంతులతో అమావాస్యనాటి అజ్ఞానపు చీకట్లను పోగొట్టి, జగత్తును తేజోమయం చేసి- జ్ఞాన జ్యోతులను ప్రకాశింపచేస్తుంది.

దీపావళినాడు లక్ష్మీ పూజను చేస్తారు. శ్రీమహాలక్ష్మి ఎలా ఉంటుంది అంటే-

"శ్రీమహాలక్ష్మి పద్మసరోవరంలో- పద్మహస్తయై- పద్మమాలినియై- పద్మదళాయతాక్షిగా- సకలాభరణ సంశోభితగా- హిరణ్యరజితకాంతులు వెదజల్లుతూ- సువర్ణకాసుల భాండము హస్తమునందు ధరించి, ఇరుపార్శ్వములందు, ధవళకాంతులు వెదజల్లే మత్తగజాలు పసిడికుండలతో, ముత్యాల వంటి నీటి తుంపరతో తల్లికి అభిషేకం చేస్తుంటాయి.

అటువంటి జగన్మాత, శ్రీమహావిష్ణు వక్షస్థలాలయ- విష్ణుకుటుంబినికి- నేను సతతం నమస్సులర్పిస్తూ ఉంటాను" అని పండితులు స్తుతించారు. శాస్త్రోక్తంగా శ్రీ మహాలక్ష్మిని పూజించాలని పురాణాలూ చెబుతున్నాయి.

ప్రతి సంవత్సరము ఆశ్వయుజ బహుళ అమావాస్యని 'దీపావళి అమావాస్య' అంటాం. ఆశ్వయుజ బహుళచతుర్దశిని 'నరకచతుర్దశి' అంటాం. సత్యభామ చేతిలో నరకాసురుడనే రాక్షసుడి సంహారం జరిగింది, కాబట్టి ఈ చతుర్దశిని నరక చతుర్దశి అంటాం. శ్రీమహావిష్ణుపత్ని భూదేవి పుత్రుడు నరకాసురుడు. చెడు ప్రవర్తనలతో, దుష్టరాక్షసుడుగా దేవ, బ్రాహ్మణ, ప్రజాసంతతులను వేధించసాగాడు. సకల సృష్టిలోనూ ఎవరివల్లా తనకు మరణం కలుగకూడదనే వరంపొంది నరకాసురుడు దుష్టుడై విర్రవీగాడు. *"జాతస్యహి మరణం ధ్రువం"* పుట్టినవారు గిట్టక తప్పదు గనుక, అతనికి తన తల్లి చేతుల్లో తప్ప ఇంకెవరి వల్ల మరణం సంభవించదని వరం ఉంది. కన్నతల్లి తన బిడ్డను ఎలా చంపగలదు? అదే నరకుని అతి తెలివి. ఇక, తనకు తిరుగులేదని అనుకొని స్త్రీలను చెరబట్టడం, దేవ, బ్రాహ్మణ, తపోజనులను సర్వనాశనం చేయడం మొదలుపెట్టాడు. సమస్త జీవకోటి ఆక్రోశంతో,
ఆవేదనతో

అల్లాడిపోయి శ్రీమన్నారాయణుని వేడుకొని ప్రార్థించింది. అప్పుడు శ్రీమన్నారాయణుడు "తన లీలావతారమైన శ్రీకృష్ణావ తారంలో తన ప్రియసతి సాత్రాజితి భూదేవి అంశతో జన్మించిన సాధ్వీమణి చేతిలో హతుడవుతాడని" చెబుతాడు. అఖండ జగన్నాటక సూత్రధారి నరకాసురునిపై యుద్ధానికి వెళ్ళి, సత్యభామ చేత నరకుణ్ణి వధింపచేస్తాడు. దుష్టశిక్షణ- శిష్టజనసంరక్షణ ఈ విధంగా జరిగింది. దాంతో జగత్తు సంతోషంతో పరవశించి పర్వాన్ని చేసుకుంది. అదే దీపావళి పండుగ రోజు.

"ఆశ్వయుజ చతుర్దశ్యాం సూర్యోదయాత్పురా।"

నరకచతుర్దశినాడు సూర్యోదయానికి ముందు తెల్లవారుజామున నువ్వులనూనెతో అభ్యంగనస్నానం చేయాలి. నువ్వులనూనెలో ఆరోజున శ్రీమహాలక్ష్మి ఉండటం ప్రత్యేకత. నేయిలోనూ లక్ష్మి ఉంటుంది. సూర్యోదయానికి ముందే తైలాభ్యంగనస్నానం చేయాలి. వీలుకానిచో కనీసం ఆ తర్వాత రోజు అభ్యంగన స్నానం చేయడం అవసరం. నువ్వులనూనెతో, శ్రేష్ఠమైన జలంతో అభ్యంగనస్నానం లక్ష్మీప్రదం. స్నానానంతరం నువ్వులతో తిలోదకం వదులుతారు.

*యమత్రయోదశి, నరకచతుర్దశి, దీపావళి అమావాస్య*- ఈ మూడు రోజులు శ్రీకృష్ణుడు, సత్యభామలచే సంహరింపబడిన నరకాసునివధవల్ల కలిగిన ఆనందోత్సాహాలతో ప్రజలు ఆనాటినుండి నేటికీ, ఏనాటికీ దీపావళి పండుగగా జరుపుకుంటున్నారు.



# దీపావళి శుభాకాంక్షలు

పాఠకులకు, రచయిత(త్రు)లకు, ఏజెంట్లకు
అందరికీ... దేవదేవుడైన శ్రీవేంకటేశ్వరుని
కరుణాకటాక్షవీక్షణాలు అందరిపై
అనవరతం ప్రసరించాలనీ మరియు
ఆయురారోగ్య ఐశ్వర్యాలు
ప్రసాదించాలనీ
స్వామివారిని ప్రార్థిస్తూ.....



మీ
ప్రధానసంపాదకుడు

ఈ పర్వదినాన దక్షిణదిశగా నువ్వులనూనెతో దీపాలు వెలిగించి పెట్టాలి. మినప ఆకుకూరతో భుజించాలి. ఇవన్నీ ఋషి ప్రోక్తములైన శాస్త్రవచనాలు. ఇలా చేస్తే సమస్తపాపాలు పోయి పుణ్యం కలుగుతుంది. ఎంతో విశిష్టమైన ఈ దీపావళి పర్వ దినమున శిష్టాచారప్రకారం శ్రీమహాలక్ష్మిని పూజించాలి. దీపావళిరోజు సాయంత్రం నూతన వస్త్రాలు ధరించి శ్రీమహాలక్ష్మి పూజకుపక్రమించాలి.

"వందే పద్మకరాం ప్రసన్నవదనాం
సౌభాగ్యదాం భాగ్యదాం
హస్తాభ్యాం అభయప్రదాం- మణి
గణైః నానావిధైర్భూషితాం-
భక్తాభీష్టఫలప్రదాం
హరిహర బ్రహ్మాదిభిః సేవితాం
పార్శ్వే పంకజ శంఖపద్మనిధిభిః
యుక్తాం సదా శక్తిభిః"

అని భక్తితో శ్రీమహాలక్ష్మిని స్తుతిస్తూ పూజాకార్య క్రమాలు పూర్తిచేసి, నూనెతో దీపాలు వెలిగించి, ఇంటిని, పరిసరాలను అలంకరించి శోభాయమానం చేయాలి. అనేక రకాలైన మధురభక్ష్యాలను బంధుజనులతో భుజించాలి. దీపావళి రోజున దీపాలను ఎందుకు పెట్టాలి అంటే -

"త్వం జ్యోతిః శ్రీరవిశ్చంద్రో విద్యుత్సౌవర్ణ తారకాః।
సర్వేషాం జ్యోతిషాం జ్యోతిర్దీపః జ్యోతిః స్థితే నమః !!

అనగా శ్రీమహాలక్ష్మి దీపకాంతులలో, జ్యోతి తేజస్సుతో విరాజిల్లుతూ ఉంటుంది. సూర్యచంద్ర, నక్షత్ర, బుద్ధిమంతులు, ధర్మనిరతులయందు లక్ష్మి నివసిస్తుంది. గృహాలు, గృహ ప్రాంగణాలు, గోవులు, గోశాలలు, ఫల గృహాలు, పుష్పగుచ్ఛాలు, సువాసన ద్రవ్యాలు, సమస్త శుభప్రద, మంగళ ప్రదమైన వస్తువు లందు అష్టలక్ష్మీ సంభరితయైన శ్రీమహాలక్ష్మి నిండి ఉంటుంది. పరధనం కోరనివారియందు, అసత్యములాడని వారియందు, స్త్రీలు సకలసుఖాలను అనుభవించుచోట, ఎప్పుడూ దెబ్బలాడు కొననిచోట లక్ష్మీదేవి తాండవిస్తుంది. ఉదయసంధ్య వేళల్లో శ్రీమహావిష్ణువుని ధ్యానించి పూజించేచోట ముఖ్యంగా ఎల్లవేళలా శ్రీహరినామస్మరణ చేసేవారి యందు, శ్రీమన్నారా యణుని భక్తితో సేవించేవారి మనస్సులలో, గృహంలో నివసిస్తుంది.


*॥ ఓమ్ తత్ సత్ ॥*

ధారావాహిక

# శ్రీమద్భగవద్గీత

## 11వ-అధ్యాయం (సారసంగ్రహం)

విద్వాన్, డా॥ ఈ.జి. హేమంత కుమార్



### విశ్వరూపసందర్శనయోగం- అధ్యాయ నామౌచిత్యం

భగవంతుని యొక్క విశ్వరూపం లెస్సగా దర్శింపబడిన అధ్యాయమిది. దశమాధ్యాయంలో వివరింపబడిన విభూతులను విన్న అర్జునుడు వినయంతో విశ్వరూపాన్ని దర్శించాలని ఉంది- నాకు చూచే యోగ్యత ఉంటే చూపమని అడిగాడు. శ్రీకృష్ణుడు దయతో యుద్ధరంగంలో అర్జునుడికి తనయొక్క విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. విశ్వరూప వర్ణనలతోను, విశ్వరూపి అయిన భగవానుని అర్జునుడు దర్శించి, స్తుతించడమనే అంశాలు ఈ అధ్యాయంలో ఉండటం వల్ల దీనికి 'విశ్వరూప సందర్శన యోగం' అనే పేరు సర్వవిధాల సబబే.

విశ్వరూపయోగం అనిగానీ, భగవద్దర్శనం అనిగానీ, భగవత్సాక్షాత్కారం అనిగానీ చెప్పకుండా విశ్వరూపసందర్శనమని చెప్పటంలో గొప్పరహస్యం ఉంది. మాయచే కప్పబడిన అజ్ఞానం అర్జునుడిలో ప్రస్తుతం తొలగిపోయింది. ఆ తరువాతనే ఇప్పుడు ఈ భౌతికనేత్రాల స్థానంలో దివ్యనేత్రాల నిచ్చాడు భగవంతుడు. నిష్కళంకమైన భక్తే గదా భగవత్కృపకు కారణం. ఇంతవరకు చెప్పిన బోధ వల్ల అర్జునుడి అజ్ఞానం, మోహం నశించిపోయింది అని గుర్తించిన కృష్ణుడు దివ్యదృష్టిని ప్రసాదించి తన విశ్వరూపాన్ని సందర్శింపచేయడం ఈ అధ్యాయ విశేషం.

భగవంతుని యొక్క అనంతశక్తిని ప్రకాశింపజేసిన యోగం విశ్వరూపసందర్శనయోగం. భగవద్దర్శన సాక్షాత్కారం కల్గినవారంతా భవబంధాలనుండి విముక్తిని పొంది భగవంతుణ్ణి చేరగలుగుతారు. బాల్యం నుండి కూడా కృష్ణుడు అనేక సందర్భాల్లో తన విశ్వరూపాన్ని ప్రదర్శించి ఉన్నాడు. యశోదకు, అక్రూరునికి, బ్రహ్మకు, రాయబారఘట్టంలో భీష్మాదులకు విశ్వరూపం చూపించిన కృష్ణుడు, అర్జునుని వ్యామోహం తొలగించడానికి ఇక్కడ విస్తృతంగా తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. అందువలన 'విశ్వరూపసందర్శన' యోగమయింది. ఈ అధ్యాయంలోని శ్లోకాల్లో ఎన్నో బీజాక్షరాలున్నాయి. అర్జునుడు గావించిన చక్కని స్తోత్రం ఇందులో ఉంది. ఛందస్సు కూడా మార్చి, వ్రాయబడి ఉంది. ఈ అధ్యాయాన్ని భక్తులు విశేషంగా పుణ్యకాలాల్లో పారాయణ చేస్తూంటారు. సన్న్యాస స్వీకరణ శుభసమయాల్లో కూడా ఈ అధ్యాయం పఠించే ఆచారం ఉంది. ఈ అధ్యాయాన్ని పారాయణ చేస్తే చనిపోయిన వారు గూడా తిరిగి బ్రతుకుతారని ప్రాచీనుల విశ్వాసం.

### అర్జును డంటున్నాడు

"కృష్ణా! నీ బోధ వల్ల నా అజ్ఞానం, మోహం అంతరించాయి. సందేహం తొలగింది. మనస్సు నిర్మలంగా ఉంది. కానీ నీ నిజస్వరూపం చూడాలని ఉంది. చూచే యోగ్యత నా కుందని నీవు భావించేటట్లయితే ఆ విశ్వరూపం చూపించి నన్ను గ్రహించు" అని అర్జునుడు అర్థించాడు. కృష్ణుడిలా అంటున్నాడు.

"అర్జునా! నా విశ్వరూపాన్ని ఈ భౌతికనేత్రాలతో చూడలేవు. కనుక దివ్యనేత్రాల నిస్తున్నాను. నా అనంత మహిమను. రూపమును చూడుము" అని దివ్యనేత్రాలను ప్రసాదించాడు.

### సంజయుడు ధృతరాష్ట్రునకు చెబుతున్నాడు

"ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆ విధంగా దివ్యచక్షువు నిచ్చి యోగేశ్వరుడైన కృష్ణభగవానుడు అర్జునునకు తన అద్భుతైశ్వర్య రూపాన్ని చూపాడు. ఆ విశ్వరూపం ఎంత ఆశ్చర్యకరంగా ఉందంటే- అనేక రూపాలతో, పలురకాల దివ్యాభరణాలతో, అనేక ఆయుధాలతో కూడి, వేయి సూర్యులు ఒక్కసారి ఉదయిస్తే ఎంతకాంతి ఉద్భవిస్తుందో అంత కాంతితో ధగద్ధగాయమానంగా వెలుగుతున్నది. ఆ విశ్వరూపాన్ని అర్జునుడు పరమాశ్చర్యచకితుడై చూస్తూ ఒడలు పులకింపగా తలవంచి చేతులు జోడించి ఇలా ప్రార్థించాడు."

### అర్జును డంటున్నాడు

"దేవా! నీ దేహంలో నేను సకల దేవతలను, సృష్టికర్త అయిన బ్రహ్మను, ఋషులను, రుద్రులను, సర్పాలను చూస్తున్నాను. అంతం లేని నీ రూపమే అన్నిచోట్లా కనిపిస్తూ ఉంది. నీ నేత్రాలే సూర్యచంద్రులు. ఓ విశ్వరూపా! నీ రూపానికి మొదలు, తుది, మధ్యభాగం నాకు కనిపించడం లేదు."

అనేక బాహూదరవక్త్రనేత్రం
పశ్యామి త్వాం సర్వతోఽనంతరూపమ్ ।
నాంతం న మధ్యం న పునస్తవాదిం
పశ్యామి విశ్వేశ్వర ! విశ్వరూప ॥ 16

కిరీటినం గదినం చక్రిణం చ
తేజోరాశిం సర్వతో దీప్తిమంతమ్ ।
పశ్యామి త్వాం దుర్నిరీక్ష్యం సమంతాత్
దీప్తానలార్కద్యుతి మప్రమేయమ్ ॥ 17

"ఓ విశ్వేశ్వరా! విశ్వరూపా! నీవు అనంతమైన శక్తి కలవాడవు. తెలుసుకోదగిన సాక్షాత్ పరబ్రహ్మం నీవు. ఈ విశ్వానికి మూలాధారం నీవే. సత్యమై, నిత్యమైన సనాతన ధర్మరక్షకుడవు నీవని నేను భావిస్తున్నాను. నీ తేజస్సుతో లోకాల్ని తపింపజేస్తున్నావు. దేవతాబృందాలు నీలో ప్రకాశిస్తున్నాయి. కొందరు నిన్ను "శుభమగుగాక" అని స్తోత్రాలతో స్తుతిస్తున్నారు. సిద్ధులు, సాధ్యులు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు ఆశ్చర్యంతో చూస్తున్నారు. ధృతరాష్ట్రుని కుమారులందరూ, భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, దుర్యోధనాదులు భీకరంగా ఉన్న నీ నోటియందు వడివడిగా పడిపోతున్నారు. నీ పండ్ల సందులలో చిక్కుకొని చూర్ణమైన తలలతో కనిపిస్తున్నారు. దేవా! ఇటువంటి భయంకర ఆకృతిగల, ఉగ్రరూపుడవైన నీ వెవరో నాకు తెలియదు. ఇప్పుడు నా కంతా అయోమయంగా ఉంది. నీకు నమస్కారం. నాకు ప్రసన్నుడవు కమ్ము! నీ నిజరూపాన్ని చూపించు. నీ వెవరో తెలుసుకోగోరుతున్నాను. నన్ననుగ్రహించు" అని అర్జునుడు ప్రార్థించాడు. భగవంతు డంటున్నాడు–

కాలోఽస్మి లోకక్షయకృత్ప్రవృద్ధో
లోకాన్సమాహర్తు మిహ ప్రవృత్తః ।
ఋతేఽపి త్వాం న భవిష్యంతి సర్వే
యేఽవస్థితాః ప్రత్యనీకేషు యోధాః ॥ 32

"అర్జునా! నేను కాలుడను. ఈ శత్రుసేనాసమూహం నశించవలసిందే. నీవు యుద్ధము చేయకున్నా ఈ యోధు లెవరూ సజీవులై ఉండరు. కనుక నీవు లే! కీర్తిని గడించు. యుద్ధము సల్పు. జయమును పొందు. రాజ్యాన్ని అనుభవించు. ఇది వరకే నేను ఈ యోధులందర్నీ హతమార్చాను. నీవు నిమిత్తమాత్రంగా ఉండు" అని కృష్ణభగవానుడు పలికాడు.

## సంజయు డంటున్నాడు

"ఓ ధృతరాష్ట్ర మహారాజా! శ్రీకృష్ణుని మాటలు విన్న అర్జునుడు భయంతో వణకుతూ గద్గదస్వరంతో ప్రణామం చేస్తూ మళ్ళీ ఇలా అన్నాడు."–

## అర్జును డంటున్నాడు

"మహాత్మా! కృష్ణా! నీ నామోచ్చారణ చేత లోకాలు సంతోషిస్తున్నాయి. రాక్షసగణాలు బెదరి చెదరిపోతున్నాయి. సిద్ధులు నమస్కరిస్తున్నారు. నీవు ఆదిదేవుడవు. పురాణ పురుషుడవు. జగదాధారుడవు. తెలిసినవాడవు నీవే. తెలియదగిన వాడవు నీవే. నీవు సర్వుడవు. నీకు అనంత ప్రణామాలు. కృష్ణా! ఇట్టి నీ మహిమను తెలిసికొనక సఖుడవని భావించి చనువుతో, పొరబాటున, అగౌరవముగా ఒరే కృష్ణా! ఓ యాదవా! ఒరే మిత్రుడా! అని పిలిచాను. పరిహసించాను. నా అపరాధాలన్నిటినీ క్షమించు. దేవా! నీకు సాష్టాంగ నమస్కారం చేస్తున్నాను. అపరాధం చేసిన కొడుకును తండ్రి, స్నేహితుని స్నేహితుడు, ప్రియురాలిని ప్రియుడు క్షమించినట్లే నీవు నన్ను క్షమించు. ఇది వరకెన్నడూ చూడని నీ విశ్వరూపం చూచి సంతోషించాను. నీ దివ్యరూపాన్ని ఉపసంహరించి నీ పూర్వరూపమే నాకు చూపు. ప్రసన్నుడవు కమ్ము."

## భగవంతు డంటున్నాడు

"కురుశ్రేష్ఠా! వేదాలచేగానీ, యజ్ఞాలచేగానీ, దానాదులచే గానీ నా ఈ దివ్యరూపం దర్శించలేరు. మానవలోకంలో నీకొక్కడికే ఈ అదృష్టం కల్గించాను"– అని కృష్ణుడు తన సౌమ్యమగు పూర్వరూపాన్ని చూపి భీతిల్లిన అర్జునుణ్ణి ఓదార్చాడు. (అని సంజయుడు ధృతరాష్ట్రునికి కృష్ణార్జునుల సంభాషణను వినిపించాడు.)

భక్త్యా త్వనన్యయా శక్య అహమేవంవిధోఽర్జున ।
జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ పరంతప ॥ 54

"అర్జునా! ఈ నా విశ్వరూపం మహాదుర్లభమైంది. దేవతలు కూడా ఈ విశ్వరూపసందర్శనం కొరకు తాపత్రయ పడుతుంటారు. నా యందు అనన్యభక్తి పెంచుకున్నవారికి మాత్రమే నా దర్శనభాగ్యం, సాయుజ్యం లభిస్తుంది."

మత్కర్మకృన్మత్పరమో మద్భక్తః సంగవర్జితః ।
నిర్వైరః సర్వభూతేషు యః స మామేతి పాండవ ॥ 55

"పాండుకుమారా! నా కోసం కర్మలు చేసేవాడూ, నన్నే పరమగతిగా భావించేవాడూ, ప్రతిజీవిలోనూ నన్నే దర్శిస్తూ స్నేహంగా ఉండేవాడూ, నాకు పరమభక్తుడు. అలాంటి భక్తుడే నన్ను పొందగలడని" కృష్ణపరమాత్మ సెలవిచ్చారు.

శ్రీకృష్ణార్పణమస్తు.


సహనానికి పర్యాయ పదం "అమ్మ"

# 'హితబోధకాలు'- పురాణాలు

- ఆచార్య జానమద్ది రామకృష్ణ

భారతీయ సంస్కృతికి మూలాధారం **'వేదాలు'**. మన దేశంపై ఎన్నో దురాక్రమణలు జరిగినా, మన సనాతన సంస్కృతి చెక్కుచెదరక పోవడానికి కారణం వేదాలే. వేదాల పట్ల మనకు గల పూజ్యభావం కారణంగానే ఐహిక, ఆముష్మిక సుఖాల్ని పొందగలుగుచున్నాము. మానవ జీవితంలోని అవశ్య కర్తవ్యాలెన్నిటినో ఉపదేశిస్తున్నాయి వేదాలు. ***"పుమాన్ పుమాంసం పరిపాతు విశ్వతః"*** అనే మంత్రం ఒక మనిషికి మరియొక మనిషి సహాయం చేయడం ద్వారా తన జన్మను పవిత్రం చేసుకోవాలని ఉపదేశిస్తున్నది. ***"మిత్రస్యాహం చక్షుషా సర్వాణి భూతాని"*** అనే మంత్రం సమస్త ప్రాణులను మైత్రీ భావంతో దర్శించాలని హితబోధ చేస్తున్నది. ***"కృణ్మో బ్రహ్మణో గృహే సంజ్ఞానాం పురుషే భవం"*** అనే మంత్రం- ఓ జనులారా! మన మందరం కలిసి మానవుల్లో సద్బుద్ధి, సద్భావనల కోసం దైవాన్ని ప్రార్థిద్దామనే చక్కని భావనాబీజం వేస్తున్నది.

ఈ వేదాల్లోని నిగూఢార్థాలను బయటికి తీసి సామాన్య మానవునికి సైతమర్థమయ్యేలాగున హితోపదేశం చేయడానికే పురాణాలు బయల్దేరాయి. ఈ కారణంగానే ***"పురాణం పంచమో వేదః"*** అని ఐదవవేదంగా కీర్తింపబడుతున్నాయి. 'పురా నవమితి' అనే పురాణాలు పురావృతం, పురాణమనే వ్యుత్పత్తిని బట్టి, ఒకప్పుడు జరిగిన వృత్తాంతాలను తెలియజేస్తూ, తద్వారా మంచిని తెలియజేసేవే పురాణాలు. పురాణాల్లో లేని విషయాలంటూ ఏవీ లేవు. దేవతలవర్ణన, సదాచారాలు, చతుర్దశ విద్యలు, మానవకర్తవ్యాలు, గురుశిష్యసంబంధం, రాజ్యాధికార నిర్వహణ విధానం, పరోపకారవర్ణన, పుణ్యక్షేత్రవర్ణన, భక్తి జ్ఞానవైరాగ్యాల విశదీకరణ, మొదలైన అమూల్య విషయాలెన్నిటినో తమలో దాచుకొన్నాయి పురాణాలు.

సాహితీ ప్రక్రియల్లో ఒకటైన పురాణప్రక్రియ ఎంతో ప్రాధాన్యాన్ని సంతరించుకొన్నది. ఇంతటి విశిష్టమైన ప్రక్రియ మరేదీ కానరాదు. ప్రతి పదార్థానికి తమ తమ విలక్షణమైన లక్షణాలుంటాయి. ఇలాగే పురాణాలకు కూడా....

**సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వంతరాణి చ।**
**వంశానుచరితం చేతి పురాణం పంచలక్షణమ్॥**

అనే వచనాన్ని బట్టి (1)సర్గ (2)ప్రతిసర్గ (3)వంశం (4)మన్వంతరం (5)వంశానుచరితమనే ఐదు లక్షణాలు ఉన్నాయి. **'సర్గ'** అంటే ప్రపంచం యొక్క సృష్టి, **'ప్రతిసర్గ'** అనగా సమస్త ప్రపంచం యొక్క ప్రళయం. **'వంశం'** అంటే రాజులు మరియు ఋషుల సంతాన పరంపర. మనువులు, మను పుత్రులు, ఋషులు, దేవతలు, ఇంద్రుడు మరియు విష్ణువు యొక్క అవతారాలనే ఆరు అంశాలతో కూడినది **'మన్వంతరం'**. రాజవంశాల్లోనూ, ఋషివంశాల్లోనూ పుట్టిన వారిని గుఱించిన చరిత్రచర్చ **'వంశానుచరితం'.**

మహిమాన్వితాలైన ఈ పురాణాలు మొత్తం 18 ఉన్నాయి. వీటినే అష్టాదశ మహాపురాణాలంటారు. ఇవి 1)బ్రహ్మ 2)పద్మ 3)విష్ణు 4)వాయు 5)శ్రీమద్భాగవతం 6)నారద 7)మార్కండేయ 8)అగ్ని 9)భవిష్య 10)బ్రహ్మవైవర్త 11)లింగ 12)వరాహ 13)స్కాంద 14)వామన 15)కూర్మ 16)మత్స్య 17)గరుడ 18)బ్రహ్మాండములనే పేర్లతో ప్రసిద్ధములైనవి. ఈ పేర్లను తేలిగ్గా తెలుసుకొనడానికి...

**మద్వయం భద్వయం చైవ బ్రత్రయం వ చతుష్టయమ్।**
**అనాపలింగ కూస్కాని పురాణాని ప్రచక్షతే॥**


అనే శ్లోకం ఎంతో ఉపయోగపడుతుంది.

అష్టాదశ పురాణాల్ని మహావిష్ణువు యొక్క 18 అవయవాలతో పోల్చారు. బ్రహ్మపురాణం మహావిష్ణువు యొక్క శిరస్సుగాను, పద్మపురాణం హృదయముగను మొదలైన విధంగా వర్ణన ఉన్నది.

పురాణకథలను వినడంద్వారా వాటిలోని విషయాలు వెంటనే మన బుద్ధిలోకి ప్రవేశిస్తాయి. ఇవే విషయాలు వేదాల్లో ఉన్నప్పటికీ అవి సులభగ్రాహ్యాలు కావు. ఉదాహరణకు, మనిషి పరిపూర్ణుడు కావడానికి సాధనాలను చెప్పింది **'ఈశావాస్యోపనిషత్తు'**. కాని ఇవి సామాన్యులకర్థం కావడం కష్టమే. ఇదే పురాణాల్లో అయితే దధీచిమహర్షి, శిబిచక్రవర్తి కథల వల్ల ఉపకారగుణము; హరిశ్చంద్రుడు, ధర్మరాజు మొదలైనవారి చరిత్ర వలన సత్యవ్రతం నిష్ఠ; బలిచక్రవర్తి మరియు కర్ణుని

కథలవలన దానగుణం; అనసూయ, సీత, సావిత్రి, మదాలస, దమయంతి మొదలగు వారి కథలవల్ల పాతివ్రత్య గుణము మొదలైన అంశాల్ని తేలికగా తెలియ చేయడం ద్వారా మానవుణ్ణి పరిపూర్ణుడుగ చేయగలుగుతున్నాయి పురాణాలు.

పురాణాల్లో స్త్రీలకత్యున్నతమైన స్థానమున్నది. ఉదాహరణకు- ఒక్క సీతకోసం శ్రీరాముడు రావణాసురుని సర్వస్వాన్నీ నాశమొందించాడు. నిండుసభలో అవమానింపబడిన ద్రౌపదిని ఓదార్చేందుకు పాండవులు జరిపిన మహాభారత సంగ్రామంలో కురువంశం మొత్తం తుడుచుకొని పోయింది. సతీదేవికి జరిగిన అవమానాన్ని భరింపలేక పరమశివుడు దక్ష యజ్ఞాన్ని విధ్వంసం చేశాడు. ఇలాంటి సంఘటనలే గాక స్త్రీ గౌరవానికి అద్దం పట్టే మరికొన్ని ఉదాహరణలను పరిశీలింప వచ్చును.



మహావిష్ణువు లక్ష్మీపతిగ, శివుడు గౌరీపతిగ, శ్రీరామచంద్రుడు కౌసల్యా నందనుడనియు, శ్రీకృష్ణుడు దేవకీనంద నుడనియు కీర్తింపబడుతున్నారు.

పూజా సమయాల్లో **'లక్ష్మీ నారాయణాభ్యాం నమః', 'సీతారామాభ్యాం నమః'** అని పిలవడం ద్వారా అయ్యవారలతోపాటు అమ్మవారలు కూడా పూజల నందుకుంటున్నారు. అంటే తల్లిగా, భార్యగా స్త్రీమూర్తి మన్ననల్ని పొందుతోంది.

మరో విశేషమేమంటే, మనదేశంలో ఎక్కడాలేని విధంగా శ్రీపూరీజగన్నాథ

## ఆయా పురాణాలు మనకు ఇచ్చే ప్రధాన సందేశాల్ని పరిశీలిద్దాం....

**01)** **'ధర్మేణ రాజ్యం లభతే మనుష్యః'** ధర్మాన్ని రక్షించడం ద్వారా రాజ్యం, స్వర్గం, ఆయువు, కీర్తి, మోక్షము లభిస్తాయని **'బ్రహ్మపురాణం'** చెబుతున్నది.

**02)** సృష్టిలోని సమస్తపదార్థములు హరిమయమే అని ఉపదేశిస్తున్నది **'పద్మపురాణం'.**

**03)** శివకేశవులమధ్య భేదం లేదు గనుక వారిరువురిని భేద దృష్టితో చూడరాదని **'విష్ణుపురాణ'** సందేశం.

**04)** గయాక్షేత్రాన్ని దర్శించి వచ్చిన పుత్రుని చూడటం ద్వారా తల్లిదండ్రులకు అనిర్వచనీయమైన ఆనందం కలుగుతుందని **'వాయుపురాణం'** వక్కాణిస్తున్నది.

**05)** **"మోక్షసాధన సామగ్ర్యాం భక్తిరేవ గరీయసీ"** మోక్ష సాధనాల్లో ఉత్తమమైనది భక్తియే యని భక్తితత్త్వాన్ని పెంపొందింపజేస్తున్నది **'శ్రీమద్భాగవతం'.**

**06)** ఏకాదశీవ్రతాన్ని నియమనిష్ఠలతో ఆచరిస్తే సకలాభీష్టాలు నెరవేరగలవని వివరిస్తున్నది **'నారదపురాణం'.**

**07)** దుర్గాసప్తశతిని పారాయణంచేస్తే సంపదల్లోనూ, ఆపదల్లోనూ శ్రేయస్సు కలుగుతుందని **'మార్కండేయపురాణం'** హితవచనం.

**08)** ఉత్పత్తి, ప్రళయాలు, విద్య, అవిద్యలు తెలిసినవాడే భగవంతుడని **'అగ్నిపురాణం'** నిర్దేశిస్తున్నది.

**09)** సూర్యభగవానుని మహిమలను వివరిస్తున్నది **'భవిష్య పురాణం'.**

క్షేత్రంలో బలరామకృష్ణులతో సమానంగా తమ సోదరియైన సుభద్రాదేవికూడ పూజలందుకుంటోంది.

ఈ ఉదాహరణలన్నీ మహిళల్ని మనమెలా గౌరవించాలో తెలియజేస్తున్నాయి. అందుకే ***"యత్ర నార్యస్తు పూజ్యన్తే రమన్తే తత్ర దేవతాః"*** అనే ఆర్యోక్తి సార్థకమవుతోంది.

మానవుడేకాగ్రచిత్తంతో వ్యవహరిస్తే అత్యద్భుతాలైన సిద్ధుల్ని పొందవచ్చుననియూ, తద్వారా అసాధ్యాల్ని సుసాధ్యాలు చేయవచ్చుననీ, ఇలా చేయడంవల్ల ఇహలోకంలో కీర్తి–ప్రతిష్ఠలేగాక, పరలోకంలో భగవత్సాయుజ్యంకూడ పొందవచ్చునని ఉద్ఘోషిస్తున్నాయి పురాణాలు.

తన ఆజ్ఞను శిరసావహించి పుత్రుడైన పరశురాముడు తన తల్లి శిరస్సును ఖండించగా, తపస్సిద్ధి చేత ఆమెను మళ్ళీ బ్రతికించుకొన్నాడు జమదగ్ని. భగీరథుడు స్వర్గలోకంలోని గంగాదేవిని భూలోకానికి తీసుకొని రాగలిగాడంటే ఇందుకు కారణమతని తపస్సిద్ధియే. దేవతల ప్రార్థనను మన్నించి దధీచిమహర్షి వజ్రాయుధనిర్మాణం కోసం తన శరీరాన్ని సమర్పించగలిగాడంటే దీనికి కారణమతని సమాధిస్థితి అనబడేసిద్ధియే.

సీతాన్వేషణకై బయల్దేరిన హనుమంతుణ్ణి సముద్రం మధ్యలో ఆపుతుంది సురస అనే రాక్షసి. కాని మహిమాసిద్ధి

**లోకంలో అన్నింటికన్నా గొప్పగుణం దయ.**

**దయ, కరుణ కలిగి ఉన్న మనసులో భగవంతుడు పీఠం వేసుకొని ఉంటాడు.**

**సాటి జీవిపట్ల దయ కలిగి ఉండడం, తెలిసో తెలియకో చేసిన తప్పులను క్షమించగలగడం నిస్సందేహంగా గొప్పగుణాలు.**

ద్వారా తన శరీరాన్ని ఎన్నో రెట్లు పెంచాడు హనుమంతుడు. నిర్మలాంతఃకరణంతో వ్యవహరిస్తే ఎవరైననూ ఈ సిద్ధుల్ని తమ వశం చేసుకొనవచ్చునని ఉపదేశిస్తున్నాయి పురాణాలు.

కనుక పురాణాల్లో ఆధ్యాత్మికవిషయాలే గాక, సామాజికులకు ఉపయోగపడే రీతులు, నీతులెన్నో ఉన్నాయి.

ఇంతటి మహత్త్వపూర్ణములైన **'అష్టాదశపురాణా'**లను మనకందించిన విష్ణుస్వరూపుడైన **'వ్యాసమహర్షి'** ధన్యజీవి అనడంలో సందేహం లేదు. ఈ విధంగా సర్వదా సంస్మరణీయుడు వ్యాసభగవానుడు.

**"వ్యాసాయ విష్ణు రూపాయ వ్యాస రూపాయ విష్ణవే।**
**నమో వై బ్రహ్మ నిధయే వాశిష్ఠాయ నమో నమః॥"**

10) ఇంటికి వచ్చిన అతిథిని గౌరవించకపోతే ఆ ఇంటి నుండి పితృదేవతలు, దేవతలు పూజలందుకోక వెళ్లిపోతారని **'బ్రహ్మవైవర్తపురాణం'** సూచిస్తున్నది.

11) కాశీక్షేత్రమాహాత్మ్యాన్ని తెలియజేస్తున్నది **'లింగపురాణం'.**

12) యమునా సరస్వతుల సంగమంలో విష్ణుపూజ సకలాభీష్ట ప్రదాయకమని **'వరాహపురాణం'** ప్రతిపాదిస్తున్నది.

13) శ్రీసత్యనారాయణస్వామివ్రతమాహాత్మ్యాన్ని, జీర్ణదేవాలయాలను ఉద్ధరిస్తే వచ్చే ఫలితాన్ని తెలియజేస్తున్నది **'స్కాందపురాణం'.**

14) విష్ణుభక్తులచరిత్రను, విష్ణుమందిరాలను గురించియు విశదం చేస్తోంది **'వామనపురాణం'.**

15) తమ బాధ్యతల్ని విస్మరించి తీర్థయాత్రల నెపంతో వెళ్ల రాదని **'కూర్మపురాణం'** హితోక్తి.

16) మరణించిన పితృదేవతలకు భక్తిశ్రద్ధలతో శ్రాద్ధవిధిని జరపాలని **'మత్స్యపురాణ'** కథనం.

17) అగ్రవర్ణాలవారు తమ క్రింది కులాలవారిని నీచ దృష్టితో చూడరాదని హెచ్చరిస్తోంది **'గరుడపురాణం'.**

18) భారతదేశపు భౌగోళిక వర్ణన, గ్రహ నక్షత్రాలకు సంబంధించిన వివరణనిస్తోంది **'బ్రహ్మాండపురాణం'.**

ఈ విధంగా పురాణాల్లో ఇన్ని నిక్షేపాలున్నాయి గనుకనే మనదేశంలో ఎన్నో దేవాలయాల్లో ఈనాటికీ నిత్య పురాణప్రవచనం జరుగుతోంది.

మన మహర్షులు

# బకదాల్భ్య మహర్షి

-సద్గురు డా॥కె.శివానందమూర్తి

పూర్వం దల్భుడు అనే ఒక ముని విష్ణుమూర్తిని ప్రార్థించి, కల్పాంతంలో కూడా మరణంలేని చిరంజీవి అయిన ఒక పుత్రుడు కావాలని కోరుకున్నాడు. ఆయన కోరిక ప్రకారమే కుమారుడు కలిగాడాయనకు!

ఆ పిల్లవాడు బాతువలె అతి మృదువుగా ఉన్నాడట. అంత మృదువుగా ఉండడంచేత, ఆ పిల్లవాడు– బకుడని ('బకం' అంటే 'బాతు' లేదా 'కొంగ'), దల్భుడి కొడుకు కనుక **'బకదాల్భు'**దని, **'బకదాల్భ్య'**దని పిలువబడ్డాడు.

ఈ బకదాల్భ్యుడు పుట్టినప్పటినుంచీ నైమిశారణ్యంలోనే తపస్సుచేసి ముఖ్యప్రాణాన్ని తన వశంలో ఉంచుకున్నాడు. ఈయన ఒకసారి ఎక్కడికో ప్రయాణంచేసి వెళుతూ ఉంటే, ఒక తెల్లటి కుక్క కొన్ని చిన్నకుక్కలు ఒకదాని తోక మరొకటి పట్టుకుని మండలాకారంగా తిరుగుతూ మొరుగుతూ కనబడ్డాయి. ఈ దృశ్యాన్ని చూచి అతడు, **'బహిష్పవమాన'** మంత్రం చదువుతూ, తిరిగే ఋత్విజులవలె అవి తిరుగుతూ ఉండటాన్ని కనిపెట్టి, దాన్ని చదువుతూ ఇలా మండలాకారంగా తిరగాలని గ్రహించాడాయన.

అంటే, ప్రకృతిలో పశుపక్ష్యాదులవలనకూడా వేద జ్ఞానం సంపాదించగలిగినవాడు బకదాల్భ్యుడు. ప్రకృతిలో భాగమై అహంకార శూన్యమైనవి పశువులు. అలా జ్ఞానాన్ని ప్రకృతినుంచి కూడా సంపాదించవచ్చునని చెబుతున్నది వేదం. ఆయన అందరికీ మిత్రుడయ్యాడు, పూజనీయుడయ్యాడు. మృత్యువును జయించాడు. అపర శంకరుడివలె ఉన్నాడు. ద్వైత వనంలో ఆశ్రమాన్ని నిర్మించుకొని కొంతకాలంపాటు తపస్సు చేసుకుంటూ ఉన్నాడు.

ఆ రోజులలోనే పాండవులు అరణ్యవాసం చేస్తూ ద్వైత వనంలో ఈయన దర్శనం చేశారు. వాళ్ళను అక్కడున్న మహర్షులు ఆశీర్వదించారు. పాండవులతో, "మీరు ధర్మపరాయణులు, మీకు జయం కలుగుతుంది" అని ఆశీర్వదించారు. వారిలో బకదాల్భ్యుడుకూడా ఉన్నాడు.

ధర్మరాజు అశ్వమేధయాగంచేసి, తర్వాత యాగాశ్వాన్ని వదిలి పెట్టాడు. దాని రక్షణకోసమని దానివెంట కృష్ణార్జునులు వెళ్ళారు. అది అనేకదేశాలకు వెళ్ళసాగింది. ఏ దేశానికి వెళ్ళిందో ఆ దేశపు రాజు ఇతడికి కప్పంకట్టి మైత్రి ప్రకటించాడు. ఆ గుర్రం తిన్నగా ఉత్తరసముద్రతీరంలో ప్రవేశించిందట!

అది ఒక ద్వీపం వెళ్ళింది. ఆ ద్వీపంలో ఈ బకదాల్భ్య మహర్షి అనేక యుగములుగా తపస్సు చేస్తున్నాడు. ఈ జటా వల్కలధారి గొప్ప తేజస్సుతో వెలుగుతున్నాడు. కృష్ణార్జునులు ఆయన దగ్గరికి వెళ్ళి సాష్టాంగనమస్కారం చేశారు. ఆయన వీళ్ళ నమస్కారాలకు ఆనందించలేదు. పైగా కృష్ణునితో, "ఈ వెన్నునికి ఎన్ని వింతలు! ఈయన చాలా చిత్రమైన మనిషి. ఈ మారుమూల ద్వీపంలో తపస్సు చేసుకుంటున్నవాడిని, నాకు ఈ గొడవలన్నీ ఎందుకు? మీరందరూ ఇక్కడికి ఎందుకు వచ్చారు? ఈ మారుమూల ద్వీపంలో మీకేం పని?" అని అన్నాడు.

అప్పుడు అర్జునుడు ఆయనతో, "మహాత్మా! మీ శరీరంలో ఎన్నో వింతలున్నాయి. దేహం నలుమూలలా పుట్టలు మొలిచినవి. వాటిలో అనేక పాములు పడగలు విప్పి తిరుగుతున్నవి. మీ మోచేతులు, మోకాళ్ళ నుండి అనేకమైన వృక్షాలు పెరుగుతున్నవి. ఆ చెట్లకొమ్మలలో అనేకమైన పక్షి సంతానము లెన్నో గూళ్ళుకట్టుకుని సుఖజీవనం చేస్తున్నవి. మీరు చివికి పోయిన మర్రి ఆకులు తలమీద ఉంచుకునికూడా హాయిగా కూర్చున్నారు. ఈ వింతల పరమార్థం తెలిపి నన్నుగ్రహించండి" అన్నాడు.

అందుకు ఆయన, "అర్జునా! నేను నిన్ను ఎఱుగనివాడిని కాను. మొదట్లో మీరును ద్వైతవనానికి రాగా, నేను వచ్చి మీకు ఆశీర్వాదం ఇచ్చి వెళ్ళినవాడినే కదా! అప్పుడు నేను ఈ జీర్ణ

**విష్ణుసంకీర్తన గావించు భక్తజనులు ఐహిక, ఆముష్మిక ఆనందములు పొందుదురు.**

శరీరాన్ని మార్చుకుని కామరూపంలో సామాన్యుడివలె మీ దగ్గరికి వచ్చి మిమ్మల్నందరినీ ఆశీర్వదించి వెళ్ళాను. మీరు ధర్మపరాయణులే! మీకు క్షేమం కలుగుతుంది. మూన్నాళ్ళ ముచ్చటగా ఉన్న ఈ మానవదేహం శాశ్వతం కాదు. ఈ విషయం అందరికీ తెలిసిందేకదా! కాబట్టే నేను నిస్సంగుడినై ఇక్కడున్నాను. ఇక మర్రిఆకులంటావా! మృత్యువు లేని దేహం నాది. ఈ జన్మకు మృత్యువు అనేది లేదు. జీవితకాలం ఇలా ఎప్పుడూ శాశ్వతంగా ఉండవలసిందే! ఈ దేహంతో నాకు పనిలేదు. అందులో పుట్టలు, చెట్లు పెరిగినా, పాములు తిరిగినా ఇదంతా ప్రకృతికి సంబంధించిన దేహం. దీన్ని ప్రకృతికే వదిలి నా పని నేను చేసుకుంటున్నాను. కాబట్టే ఈ దేహంతో నాకేమి నిమిత్తం లేదు. ఇక మరో విషయం, రెండు మర్రి ఆకులు నా తలమీద ఉన్నాయి. నాకు గృహాలతో ఏమి పని? ఈ ఎండిపోయినమర్రి ఆకులే నన్ను రక్షిస్తున్నాయి. అవి నాకు చాలు. నా కోసమని నేనేదీ ప్రయత్నపూర్వకంగా చేసుకోదలచుకోలేదు. ఈ శరీరానికి అవి అనవసరం" అన్నాడు.

అర్జునుడు ఆయనను, "స్వామీ! మీరు పుట్టి ఎన్ని సంవత్సరాలయింది?" అని అడిగాడు. ఆయన అర్జునుడితో, "పార్థా! నేను పుట్టిన తరువాత ఎందరో రోమశులు గతించారు నేను జ్ఞానం ఎరిగిన తరువాత, ఇరవైమంది బ్రహ్మలు వెళ్ళిపోయి నారు. నేను ఎప్పుడూ శాశ్వతుడిని. పూర్వంనుంచీ ఉన్నాను, భవిష్యత్తులోనూ ఉంటాను. నేనులేని ప్రపంచం లేదు. ప్రపంచం ఉన్నన్నాళ్ళు, సృష్టి బ్రహ్మలు ఉన్నన్నాళ్ళు నేను ఉంటాను" అన్నాడు.


ఆయన ఇంకా, "పూర్వం ఒకప్పుడు ప్రళయకాలంలో సముద్రాలు పొంగిపోయినప్పుడు ముల్లోకాలూకూడా ఇక్కడికి వచ్చి తేలాయి. ఇక్కడ ఒక మర్రిచెట్టు ఉంది. దానికి వెయ్యి కొమ్మలున్నవి. వెయ్యి బ్రహ్మాండాలు దానికి వ్రేలాడుతున్నవి. ఇదంతా బ్రహ్మాండముల సృష్టిరచన. ఇదంతా నేను చూస్తూనే ఉన్నాను. ప్రతీ కొమ్మచివరి ఆకుమీద చిన్న పిల్లవాడు పడుకుని, కాలి బొటనవ్రేలు నోట్లో పెట్టుకుని ఉన్నాడు, వటపత్రశాయి! వటపత్రశాయిల రూపంలో అంతమంది విష్ణువులను నేను చూచాను. ఒకప్పుడు నాకు భయం కూడా వేసింది. కానీ ఆ పిల్లవాడు నాతో మాట్లాడి నా భయం పోగొట్టాడు. ఆ పిల్లవాడు పెరగటము, విష్ణువు కావటము, ఆయన గర్భం లోంచీ కమలం పుట్టటము, కమలంలోంచి బ్రహ్మపుట్టటము అదంతా చూచాను" అన్నాడు.



ఇంకా వివరిస్తూ, "ఈ చరాచర జగత్తుకు, ఈ బ్రహ్మసృష్టికి కారణమైన అతడే, ఈ యుగంలో యదువంశంలో పుట్టి పద హారువేల నూటఎనిమిది మంది భార్యలను పరి గ్రహించి, నీవంటి వాళ్ళతో వియ్యము పొంది; సంసార కారాగారంనుంచీ సనకస నందనాదులను ఉద్ధరించిన సదానంద స్వరూపుడే ఈ సంసారంలో చిక్కుబడి ఉన్నాడు. అటువంటివాడే నీవంటి వాళ్ళ వెనకాల తిరుగుతున్నాడు. సమయం వచ్చినపుడు అతడే సచివుడు,

సారథి, సేవకుడు. ఇవన్నీ కోరి తెచ్చుకుంటున్నాడు. ఆయనకు ఆనందంగా ఉంది. అదొక వింతగా ఇష్టంగా ఉందాయనకు" అని, పరిహాసపూర్వకంగా కృష్ణుణ్ణి, "త్రైలోక్యకుటుంబీ, రావోయి!" అని దగ్గరకు తీసుకుని కౌగిలించుకుని సన్మానించాడట!

అప్పుడు కృష్ణుడు ఆయనతో, "మహాభాగా! ఇరవై బ్రహ్మకల్పాలు చూచిన పరమేశ్వరుడివి నీవు. విష్ణుభక్తాగ్రేసరుడివి. నీవుకాక వేరే విష్ణువు ఎక్కడున్నాడు! అయితే నేను ఒక చిన్నకోరికతో ఇక్కడికి వచ్చాను. ధర్మరాజు అశ్వమేధ యాగం సఫలంకావటానికి నీవు విచ్చేయవలసింది. నీవు వస్తే చాలు, ఆ యాగం ఫలవంతమవుతుంది" అన్నాడు.





బకదాల్భ్యుడు కృష్ణుడితో, "కృష్ణా! నీవు ఈ రీతిగా నన్ను స్తుతించకు. స్తోత్రం చేయకు. సంస్తుతి వలన ఎంతటి సత్పురుషుడయినా గర్వపర్వతాన్ని అధిరోహిస్తాడు. వాడికి ఎప్పుడో ఒకప్పుడు పతనం తప్పదు. అటువంటి వాళ్ళ గర్వం నీవే అణచవలసి వస్తుంది. నీకెందుకీ పని? నన్ను స్తోత్రం చెయ్యటం ఎందుకు? ఆ పని కల్పించుకోకు. ఒక వేళ ఆ గర్వం నాకే వస్తే, దాన్ని మళ్ళీ తీసివేయవలసినవాడివి నువ్వే!" అన్నాడు.

ఆ తరువాత, ఆయన స్వయంగా వచ్చి, దగ్గరుండి ధర్మరాజుతో అశ్వమేధయాగం చేయించాడు. కృష్ణార్జును లిద్దరూకూడా ఆయనను పల్లకీలో కూర్చోబెట్టి స్వయంగా మోశారు. ఈ యజ్ఞం సుముహూర్తంలో, ద్రౌపదీదేవి బంగారు కలశాలనిండా అనేక విత్తనములు తీసుకుంది. శ్రీకృష్ణుడు తన వెనుకరాగా, ధర్మరాజు ఒక బంగారునాగలిని తీసుకున్నాడు. దానికి ఆరు ఎద్దులను కట్టారు. యాగభూమిని దున్నుతున్నారు. విత్తనములు మహామునీంద్ర మంత్రపూతములైన తరువాత, ద్రౌపది వాటిని చల్లుతూ పోయింది. కుంతీదేవి, దేవకి, యశోద ధర్మరాజుకు అభిషేకం చేశారు. ఋత్విజులు శాస్త్రోక్తంగా వేదికను అమర్చి యజ్ఞపాత్రలు సిద్ధం చేశారు. బకదాల్భ్యమహర్షి బ్రహ్మత్వం వహించాడు. వ్యాసమహర్షి అధ్వర్యుడయ్యాడు. వశిష్ఠ, వామదేవ, రోమ, గాలవ- ఇత్యాది ఋషులందరూ కూడా మంత్రపాఠకులుగా వచ్చారు. కుశాసనంమీద ధర్మరాజును కూర్చోబెట్టారు.

వ్యాసమహర్షి ఆజ్ఞ ప్రకారంగా అనసూయ - అత్రి మహర్షి, అరుంధతి- వశిష్ఠుడు, రుక్మిణి-కృష్ణుడు, హిడింబి- భీమసేనుడు, సుభద్రార్జునులు, మాయావతీ- ప్రద్యుమ్నులు, ఉషానిరుద్ధులు- ఈ ప్రకారంగా అరవైనాలుగుమంది దంపతులు పంచపల్లవములతో కూడిన కలశాలతో, గీత వాద్య నృత్యాలతో కుంతి, దేవకి, యశోదలను పురస్కరించుకుని బంగారు బిందెలతో పవిత్రోదకములు తీసుకునిరాగా, ఋత్విజులు వేదాలు చదువుతుండగా ధర్మరాజు లేచి యాగాశ్వానికి అభిషేకం చేసి, మహర్షులందరికీ పూజచేసి వాళ్ళందరినీ కూర్చోబెట్టి, బ్రహ్మ అయిన 'బకదాల్భ్యమహర్షి'కి నమస్కరించి ఆ యజ్ఞం పూర్తిచేశారు.

ధారావాహిక



# తిరుమల సమయాచారములు

(తిరుమల-తిరుపతి ఐతిహ్యమాల)

తెనుగు అనువాదకులు:

కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు,

కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు

*(గత సంచిక తరువాయి....)*

అనంతార్యుడు (ఆనందాళ్వాన్) పుష్పము గొనియు, మాలికలు కట్టియు స్వామికి సమర్పించుచుండెను. శ్రీఅనంతార్యులు చేయుచున్న కైంకర్యముల తాను తృప్తి పొందుచుండుటను, ఆయన భావశుద్ధిని జనులెల్లరును తెలియవలెనను తలంపుతోడ శ్రీవేంకటాచలపతి కన్యామాసమున బ్రహ్మోత్సవ సందర్భమున ఏడవ యుత్సవదినమున రాత్రివేళ తానును, అలర్మేల్మంగయు రాజకుమారుడుగను రాజకుమారిగను అయి అనంతార్యుల పూలతోటకు విజయము చేసి పూలు కోసికొని వెలుపలికి పోవుచుండెడువేళ అనంతార్యులు చూచి దొంగ చొరబడి పూలు కోసికొని పోవుచున్నాడని తలచి, అతనిని పట్టుకొనవలెనని తరుముచుపోవగ వాకిట కనిపించి అదృశ్యుడాయెను. అనంతార్యులు వెంబడించి పోవగ నందవనము వాకిట కనిపింపక మరగెనను ఐతిహ్యమును తెలిపెడి ఉత్సవమును శ్రీనివాసునకు ప్రతి సంవత్సరమున అనుష్ఠింపవలెనని, ఏడవ బ్రహ్మోత్సవదినమున ఉద్యానవిహారార్థమై విజయము చేయునపుడు కోవెలకు అప్రదక్షిణముగ విజయము చేయవలెననియు కట్టడచేసిరి.

క్రిమికంఠచోళుడను అవ్యపదేశ్యుడు (పేరు చెప్పదగనివాడు, పాపిష్ఠుడనుట) ఒకడు అనేక జన్మార్జితపాపవశ్యుడై, తన యేల్బడిలోనిదగు చోళదేశమున అనేక విష్ణుద్రోహములు చేసియు, కావేరీతీరమున కణ్వమహామునికి ప్రత్యక్షమైన శ్రీగోవిందరాజస్వామివారి దివ్యక్షేత్రమగు శ్రీచిత్రకూటమున (చిదంబరమున) శ్రీగోవిందరాజస్వామి దేవాలయమును సమూలధ్వంసము చేసెను. ఇది వినిన శ్రీభగవద్రామానుజులవారు పురాణప్రసిద్ధమై శ్రీకులశేఖరాళ్వారు, తిరుమంగైయాళ్వారు అను శ్రీవైష్ణవభక్తు లిరువురికి మిక్కిలి శ్రద్ధాపాత్రమగు దివ్యస్థలము మూలమట్టముగా ధ్వంసముకారాదని చింతించి, భవిష్యద్వృత్తాంత జ్ఞానపరిపూర్ణులగుటచేత ఆ సన్నిధిలో మగుడ భగవదావిర్భావము కలుగుటకై తిరుమల 'అడివారము'న (కొండయడుగు మొదట వచ్చిచేరిన) శ్రీగోవిందరాజస్వామి, శ్రీవేంకటాచలపతియొక్క అభిమానపాత్రమై విజయము చేసియుండుట ననుసరించి ప్రతిదినమున రాత్రి వేంకటాచలపతి అర్ధయామ దివ్యప్రసాదమును ఆరగించిన పిదప, అర్చములు శ్రీశఠకోపమును వస్త్రాచ్ఛాదితముచేసికొని చేతులపై ధరించి, ఛత్రచామరాద్యుపచారములతోడ శ్రీకృష్ణ (శర్మ) మండపమున (వెన్ణుమాలై యిట్టాన్ మండపమ్) దక్షిణాభిముఖముగా నిలచియుండ, అప్పుడు దేవాలయ కైంకర్యములు "కట్టియము" (ప్రశస్తి కావ్యవిశేషము) విన్నవించి 'అరుళప్పాడు!' (మంగళమగుగాక!) శ్రీచిత్రకూటసన్నిధి కైంకర్యధురంధరులై శ్రీవేంకటాచలపతి యధికార దండముద్రా నిర్వాహకులగు విష్వక్సేనులకు *(సేనై మొదలియార్)*" అని పలికి, కోవెలలో 'పారుపత్య'ము గుడి మణియము (వంటి అధికారము) చేయునట్టి శ్రీవైష్ణవునకు శేష వస్త్రము, శ్రీశఠకోపము అనుగ్రహించునట్లు కట్టడ చేసినారు.

శ్రీవేంకటేశ్వరస్వామి, ఆళ్వార్ తిరువరంగప్పెరుమాళ్ అరైయరు (ప్రబంధగాయకులు) కొరకై అధ్యయనోత్సవ సందర్భమున స్థలాంతరములందువలెగాక 'ఇయఱ్పా' మొదలుగా నాలాయిరదివ్యప్రబంధము ఇరువదిమూడు దినములు ప్రతి

సంవత్సరమున ఆలకించెదునట్లుగను, అటుపిమ్మట శ్రీజ్ఞాన వరాహస్వామి ఒకదినమున ఆలకించునట్లుగను, పిమ్మట ఈ రీతిగనే శ్రీగోవిందరాజస్వామియు ఆలకించునట్లును ఈ తీరుగ కొన్ని యుత్సవములు వేంకటాచలపతితోడ ఏకకాల మందు గాక కాలభేదముతోడ (23 దినములు) జరుపునట్లును ఏర్పాటు చేసిరి.

శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధియందు ప్రతిదినమునను స్నపనబేరము (స్నానవిగ్రహము) అగు సుందరస్వామి *(అళగప్పి రానార్)* రాత్రివేళలందు నిత్యము శయనబేరమై దివ్యశయన మంచముపై నిదురించునట్లు చేయవలెనని శ్రీవైఖానసాగమమున నున్న విధముగ జరుపవలసియున్నను, మునుపు ఆళ్వార్ శ్రీపుత్రిక (శ్రీగోదాదేవి) శ్రీకృష్ణుని తోడి యనుభవమునకు ఆశపడి ధనుర్మాసము ముప్పదిదినములును దినమున కొక 'పాశురము' (ద్రావిడపద్యము) చొప్పున ముప్పది పాశురముల ప్రబంధమును అనుగ్రహించుటవలన 'వేంకటాచలపతికి నన్ను విధింప (సమర్పింప) దగియున్నావు' అని వేరగు అర్చావ తారమును విడచి ప్రథమముగా శ్రీవేంకటాచలపతియందే ప్రీతి గొనియుండుట వలనను, శ్రీవైఖానసాగమమున ఒక సంహిత యందు 'ధనుర్మాసమునందంతయు శ్రీకృష్ణుడే శయనబేరముగ నుండవలెను' అను విధానము కనిపించుట చేతను, బేరత్రయ పక్షమున శ్రీకృష్ణుడే శయనబేరమని విధించియుండుట చేతను, ధనుర్మాసము ముప్పది దినములందును శ్రీకృష్ణుడే దివ్య మంచముపై పవ్వళించియుండి జగత్తు నుజ్జీవింపజేయునట్లుగను ఏర్పాటు చేయబడెను.

తిరుమలనంబి *(శ్రీశైలపూర్ణులు)*, యామునాచార్యుల *(ఆళవందార్)* ఆజ్ఞానుసారముగ తిరుమలపై నిత్యనివాసము చేయుచు త్రిసంధ్యలందును శ్రీనివాసుని సేవించుచూ, ప్రతి దినమునను ఆకాశగంగా తీర్థము నుండి అభిషేక (తీర్థానయన) కైంకర్యమును సలుపుచు మంగళాశాసనపరులై యుండునపుడు, శ్రీరామానుజాచార్యులవారు యామునాచార్యుల యానతి చొప్పున శ్రీరామాయణ ప్రవచనమునకై శ్రీరంగమునుండి కొండ దిగువకు చేరగా, శ్రీశైలపూర్ణులును ఈయన (శ్రీరామా నుజాచార్యుల) కొరకై ఒక సంవత్సరకాలము ప్రత్యహము ప్రాతః కాలమున అభిషేకకైంకర్యము నెరవేర్చి, స్వామిని సేవించి, మహా ప్రసాదము స్వీకరించి శ్రీభగవద్రామానుజుల కొసగి కొండ దిగువన ఒక చింతచెట్టు క్రింద ఒక గుండ్రాయి సమీపమున పాతప్రవచనము చేసి మధ్యాహ్నకాలమున యాగానుయాగ ములు (భగవంతునికి నివేదించుట నివేదితాన్నమును భుజిం చుట) నెరవేర్చి సాయంకాలసేవకై మరలిపోవుచుండిరి.

ఇట్లు కొన్నాళ్లు నడచుచుండగ, శ్రీశైలపూర్ణులు ఒక నాడు శ్రీనివాసుని ధ్యానించి 'తాము ఇప్పటివరకు శ్రీయాము నాచార్యుల కటాక్ష ప్రభావమున త్రిసంధ్యలందును దర్శన భాగ్యమును అనుగ్రహించితిరి. ఇప్పుడు శ్రీరామాయణ ప్రవచన మూలముగ మధ్యాహ్నసేవ లేకున్నది' అని తలచుచు నిదురింప, వారి స్వప్నమున శ్రీవేంకటేశ్వరుడు శ్రీశైలపూర్ణులను (తిరుమల నంబి) చూచి 'మీకు మధ్యాహ్నసేవయు నొసగితిమి' అని పలికెను. అంతట మేల్కొనిన శ్రీశైలపూర్ణులు మునుపటివలెనే అభిషేకమును ముగించుకొని తిరుమల దిగువన (అడివార మందు) యథాస్థానమున చేరగ, అప్పుడచ్చోట కస్తూరీ కర్పూర పరిమళములు అన్నివైపుల గుబాళింప శ్రీశైలపూర్ణులును, శ్రీరామానుజాచార్యులవారును 'ఇదేమి!' అనుచు విచారించి నలు దిక్కులను చూడగా, ఆ తింత్రిణీవృక్షాధఃప్రదేశమున గుండ్రాతిపై శ్రీనివాసభగవానుని దివ్యచరణములు రెండును కన్పట్టెను. ఆ దివ్యచరణములు చూచిన శ్రీశైలపూర్ణులు తాము కాంచిన స్వప్నవృత్తాంతమును భగవద్రామానుజులకు చెప్పగా, సంకల్పిత రీతిగ సంభవింప ఇరువురును అచ్చెరువంది, ఆ స్వయం వ్యక్తములైన దివ్యపాదములు సేవించి వానిక్రిందుగ పదుగురు ఆళ్వారులను దివ్యచరణములతో ఒకేమూర్తిగా (ఒకేశిలపై) చెక్కించి ప్రతిష్ఠించి, శ్రీచరణములకు దివ్యాలయమును కట్టించి, ప్రతిష్ఠ అర్చన మున్నగువాని నన్నిటిని శ్రీవైఖానసాగమప్రకారము జరిపించి, తీర్థప్రసాదపరిగ్రహము చేయించి, గ్రంథశేషమును శ్రీపాద సన్నిధానమున అనుసంధానము చేసి పూర్తి చేసెను. ఆ చింతచెట్టు నిదురింపనిద్దై యుండుటచేత అది శ్రీ యాది శేషుని యంశమని నిర్ణయించి, 'కలౌ వేంకటనాయకః' అనియు–

"విశేషతః క్రూరకలౌ నరాణాం పాపాకరాణాం పరపీడకానామ్,
భూగోలమధ్యే ద్రవిడే చ పుణ్యే శ్రీవేంకటాద్రి ర్గతిరేవ నాన్యః"

(ఈ క్రూరకలియుగమున పాపాలపుట్టలై పరహింస కులగు నరులకు భూగోళమధ్యమున పవిత్రమగు ద్రవిడదేశ మందలి వేంకటాద్రియే గతి; వేరొండు గాదు.)

*(ఇంకా ఉంది)*


తీర్చుకోలేని ఋణం "అమ్మ"



# 'నరకుని' వధ– రహస్యాలు

– శ్రీ జయదేవానంద

'ప్రా'గ్జ్యోతిష' పురాధిపతి అయిన నరకాసురుడు తన బలగర్వంతో ఇంద్రుని హింసించడం వలన, దేవపతి ద్వారకకు వచ్చి శ్రీకృష్ణుని వద్ద తన బాధను చెప్పుకున్నాడు. సురపతిని రక్షించే సదుద్దేశ్యంతో నల్లనయ్య సత్యభామామణితో కలసి గరుడునిపై ప్రాగ్జ్యోతిషంపైన దాడికి వెళ్ళాడు. శ్రీకృష్ణనరకాసురులమధ్య నడిచిన యుద్ధంను తెలుసుకోవడానికి ముందుగా పోతనగారు ఆ రాక్షసుని ప్రాగ్జ్యోతిషపురాన్ని వర్ణించినతీరు గమనించాలి. ఇందులో అనేకరహస్యాలు దాగి ఉన్నాయి (భక్తి–యోగ–వేదాంత–ముక్తి రహస్యాలుగా వీటిని పేర్కొనచ్చు). అవి ఏమిటో పరిశీలిద్దాం!

ప్రాక్+జ్యోతిషం=ప్రాగ్జ్యోతిషం అవుతుంది. ఇందులోని 'జ్యోతిషం' ప్రకాశమునకు సంకేతంగా చెప్పబడింది. దేహంలో ప్రకాశించే పరమాత్మ జ్ఞానప్రకాశమును జ్యోతిషపురం అంటోంది నిరుక్తం. 'ప్రాక్' అనగా ముందు భాగమని అర్థం.

ప్రాగ్జ్యోతిషపురం అంటే 'జ్ఞానానికి ముందు ఉన్న ఆవరణమనే' అర్థం వస్తుంది. అనగా దేహంలో ప్రకాశిస్తున్న పరమాత్మ జ్ఞానప్రకాశమును అజ్ఞానావరణం లేదా మాయావరణం కప్పి ఉన్నదనే భావంలో "ప్రాగ్జ్యోతిషపురం" అలరారుతున్నదని తెలుసుకోవాలి. 'నరకాసురు'నకు "భౌమా" సురుడనే మరో పేరున్నది. 'భౌమ' అంటే 'భూమి'. కాబట్టి ఈ ప్రాగ్జ్యోతిషం భూమికి సంబంధించిన మాయకు ప్రతిరూపం. 'నసురః అసురః' అంటే ముక్తిని గ్రహించలేనివాడని అర్థం.

ముక్తిని గ్రహించలేని మాయకూ, అజ్ఞానానికి సంకేతంగా నరకాసురుని చిత్రీకరించారు పోతనగారు. ఇక నరకాసుర శబ్దాన్ని పరిశీలించినట్లయితే! నర+క=నరకః, 'నృహింసాయాం' అనే ధాతువు వలన 'నర' అనగా 'నశించునది' అని అర్థం. ఇక 'క' అనగా 'సుఖము', అంటే నశించే సుఖములు. ఈ సుఖాలు భూ సంబంధమైన అజ్ఞానం– మాయ వల్ల ఏర్పడేవి అని తెలుస్తుంది. "నశించే సుఖాల వెంట అజ్ఞానంతో పరుగులు పెట్టేవాడే నరకాసురుడని" మనం గ్రహించాలి.

ప్రాగ్జ్యోతిషపతియైన నరకాసురుడు "మాయావృత-అజ్ఞానజీవుడని" చెప్పవచ్చు. ఇక ఇంద్రునకూ- నరకునకూ ఉన్న అవినాభావ సంబంధం ఏమిటో పరిశీలిద్దాం!

వ్యుత్పత్తి రీత్యా 'ఇంద్ర' అనే పదమునకు 'మనస్స'ని అర్థం. నరకపదం 'మాయ'తో కూడినది. ఎప్పుడైనా సరే! ఎవరికైనా సరే మనస్సు మాయకు లోబడినపుడు రక రకాల ఇబ్బందులకూ, బాధలకు గురి అవుతుందని చెప్పడమే ఇంద్రుడు, నరకునిచేత బాధింపబడ్డాడని చెప్పడంలోని ఆంతర్యం.

నరకుని రూపంలో ఉన్న మాయ తనని బాధిస్తుండటంతో ఇంద్రుడు, కృష్ణుని ఆశ్రయించాడు. ఇక్కడ కృష్ణ శబ్దానికి భక్తిరూపేణా 'నిర్వృతి తత్త్వాన్ని' సూచిస్తుంది. 'నిర్వృతి' అంటే "విషయావరణం లేని మనోవృత్తి" అని అర్థం.

శ్రీకృష్ణుడు గరుడుని ఎక్కి సత్యతో కలిసి యుద్ధానికి వెళ్ళడం గమనించాలి. వీరిలో "గరుత్మంతుడ"నగా "వేద మార్గం" అని, "సత్యభామ" అంటే "సత్యరూపమైన పరమాత్మ యొక్క క్రియా జ్ఞానశక్తి లేదా సంపద" అని అర్థం.

వీటన్నింటినీ సమీకరించి, విశ్లేషించినట్లయితే విషయావరణం లేని నిర్వృతి తత్త్వం (శ్రీకృష్ణుడు), సత్యస్వరూపం అయినటువంటి సంపద అనే ఆయుధంతో (సత్యభామ), వేదమార్గం అనే వాహనాన్ని అధిరోహించి (గరుత్మంతుడు) మాయనూ-అజ్ఞానమును (ప్రాగ్జ్యోతిషాన్ని- తత్ అధిపతియైన నరకాసురుని) భేదించడానికి వెళ్ళిందని స్పష్టంగా బోధపడుతుంది.

ఇక వీటి ద్వారా మనం తెల్సుకోవాల్సినదేమిటనే సందేహం కలిగే వారికి కూడా పోతన గారు ఇలా సమాధానం ఇస్తున్నారు.

"సాధకులు లేదా భక్తులైనవారు మాయను వేద చోదితమైన బ్రహ్మస్వరూప నిర్వృతి తత్త్వాన్ని జ్ఞాన సంపద ద్వారా సాధించి, తనలోని అజ్ఞామనే అసురుణ్ణి (రాక్షసుని) సంహరించాలి" అని ఈ నరకునివధలోని ప్రధానరహస్యంగా వారు మనకి బోధిస్తున్నారు.

## యుద్ధంలోని రహస్యాలు

ప్రాగ్జ్యోతిష పట్టణం 1)పర్వత, 2)బాణమయ 3)వాయు 4)జల 5)అగ్ని అనేటటువంటి అయిదు దుర్గముల చేత ఆవరించబడి ఉన్నది. వీటినే "పంచదుర్గము"లని కూడా అంటారు. ఈ పంచదుర్గముల మురాసురుని చేత చుట్టూ రక్షింపబడుతూ అతనిచే దాని కట్టబడిన 'అష్టపాశములు' వలన అన్యులు ఈ పట్టణంలో ప్రవేశించడం కష్టం. అయితే పోతన గారు పంచమయ కోశముల చేత ప్రవేశింప చొరగాని పట్టణంగా ప్రాగ్జ్యోతిషమును వర్ణించారు. ఈ దుర్గములకు రక్షకునిగా ఉన్న అసురుడు మురాసురుడు. ఈ అసురుని నివాసం జలం. ఈ రాక్షసునకు అయిదు ముఖాలు, ఈ పంచ ముఖములూ పంచేంద్రియాలకు ప్రతీకలు. మాయ తన పంచేంద్రియ వాసనలతో శ్రీకృష్ణరూపంలో ఉన్న నిర్మల, నిశ్చల నిర్వృతిపై దాడి చేసింది అంటే.... మురాసురుడు మాయా-అజ్ఞానములతో శ్రీకృష్ణనిర్వృతిపై పోరుకు దిగినాడని అర్థం.

శ్రీపోతనామాత్యులవారు ఈ అష్టపాశములనూ మురాసురుని ఎనిమిదిమంది పుత్రులుగా అభివర్ణించారు. ప్రాగ్జ్యోతిష పురవర్ణన పద్యాన్ని చదివేటప్పుడు "మాయ" అనబడే ఈ పురం పంచభూతాత్మకమైన అజ్ఞానం చేతనూ, మనస్సు-బుద్ధి- అహంకారము- శబ్దము- స్పర్శము- రూపము-రసము- గంధము అనే అష్టవిధములైన ప్రకృతుల తోనూ బంధించబడిందన్న అర్థం మనకు స్ఫురిస్తుంది.

మురాసురుడు శ్రీకృష్ణుని చేతిలో హతుడయ్యాడని తెలుసుకున్న నరకాసురుడు, అతడి పుత్రులైన 1)తామ్రుడు, 2)అంతరిక్షుడు, 3)శ్రవణుడు, 4)విభావసుడు, 5)వసుడు 6)నభస్వంతుడు, 7)అరుణుడు అనే ఏడుగుర్ని 'పీఠుడు' అనే సేనాని కిచ్చి (7+1=8 అష్టప్రకృతులు) శ్రీకృష్ణుని అంత మొందించమని పంపాడు. వీరందరూ కూడా ముకుందుని చక్ర-బాణములచేత హతులయ్యారు.

అప్పుడు నరకుడు యుద్ధోన్మత్తుడై వచ్చి, సత్యభామా శ్రీకృష్ణులచేతిలో బలి అయ్యాడు.

మురాసురుడు మరణంతో, అంటే పంచభూత, పంచేంద్రియ వాసనా ప్రాబల్యం నశించగానే భౌమాసురుని బలం తగ్గింది. ఈ కారణంగానే ఐహిక సుఖరూపం మాయావరణాలు అనగా నరకుడు, ప్రాగ్జ్యోతిషం అనే ద్వంద్వ విషయములు, కృష్ణునిలో అంటే నిర్వృతి తత్త్వంలో ఐక్యం అవ్వగలిగాయి. ఇదే నరకాసురుని వధలో దాగిన మూల రహస్యం.

# రామాయణంలో 'నవీన శాస్త్ర విజ్ఞానము'

– ఆచార్య కె.పి.ఆర్. విఠల్‌మూర్తి

వేద వేద్యే పరే పుంసి, జాతే దశరథాత్మజే।
వేదః ప్రాచేతసాదాసీత్సాక్షాద్రామాయణాత్మనా॥

ప్రాచేతసుడు (వాల్మీకి) వేదాంతసారమైన రామాయణాన్ని లోకానికి అందించిన మహామనీషి. రామాయణం ఆదికావ్యం. దీనిని 'సీతాయాశ్చరితం మహత్' అని, "పౌలస్త్య వధ" అని నామాంతరాలతో పిలుచుకుంటారు. వాల్మీకి మహర్షి తమసానదిలో స్నానానికి వెళ్తున్నప్పుడు ఒక బోయవాడు, క్రౌంచమిథునంలో ఒక పక్షిని బాణంతో కొట్టినప్పుడు –


మా నిషాద ప్రతిష్ఠాం త్వమగమశ్శాశ్వతీ స్సమాః।
యత్క్రౌంచమిథునాదేకమవధీః కామమోహితః॥

అనేది మొదటి శ్లోకమైంది.

ఇట్లు వ్రాయబడిన రామాయణం ప్రపంచంలోని పలు భాషలలోనికి అనువదింపబడి ప్రసిద్ధి పొందింది. రామాయణంలో చెప్పినవన్ని సత్యములేనా? శాస్త్రీయాంశము లున్నవా? ఇప్పుడు ఈ కాలంలో అవి మానవ మనుగడకు ఉపయోగంగా ఉంటాయా? అనే విషయాలను పరిశీలిద్దాం.

**భౌతిక శాస్త్రవిషయాలు:** చిన్న పిల్లలకు రామకథను చెప్తూ 'పుష్పకవిమానం' గురించి చెప్తూవుంటారు. 'రైట్' సోదరులు విమానాన్ని కనుగొనక ముందు ఇది కట్టుకథ అనుకునేవారు. ఇప్పుడు విమానయానం సర్వసాధారణం అయింది. పెద్ద పెద్ద విమానాలు వచ్చిన తరువాత ఎక్కువ మంది ప్రయాణికులకు, సైనికులకు సామానులను చేరవేయవచ్చునని తేట తెల్లమయింది. ఇది కట్టు కథ కాదు ఇందులో సత్యముందని అందరికి విదితమయింది.

రాముడు లక్ష్మణుడు చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు విశ్వామిత్రుడు దశరథుని దగ్గరకు వచ్చి తన యాగసంరక్షణార్థం వారిద్దరిని పంపమని అడుగుతాడు. వారిద్దరు చిన్నపిల్లలు, తను తన సైన్యం మొత్తంతో వచ్చి యాగసంరక్షణ చేస్తానని పుత్రప్రేమతో దశరథుడు చెప్పటం, వశిష్ఠుల వారు నచ్చచెప్పిన తరువాత విశ్వామిత్రునితో పంపటం, చక్కగా కథలు చెప్తూ లోకకల్యాణార్థం జరగటం వెంటవెంటనే జరిగిపోతాయి. జనులను హింసిస్తున్న తాటకను లోక కల్యాణార్థం స్త్రీ అని చూడక వధించమని విశ్వామిత్రుడు రామునికి నచ్చచెపుతాడు. తనకు వచ్చిన ధనుర్విద్యతోనే గురువు ప్రోత్సాహంతో దుష్టశిక్షణ, శిష్టరక్షణ అక్కడనుంచే ప్రారంభం చేశాడు రాముడు.




**బల, అతిబల విద్యలు:** తరువాత విశ్వామిత్రుడు బల, అతి బల అనే మంత్రాలను రామలక్ష్మణులకు ఉపదేశిస్తాడు. వీటి వల్ల మనిషి ఆకలిదప్పులను జయించ కలుగుతాడు. అందుకే వాటికి బల, అతిబల అని పేర్లు వచ్చాయి. యోగా గురించి, మానవ ఆరోగ్యమనుగడలో దాని స్థానం గురించి కొంత మార్పు వస్తున్న తరుణంలో సృష్టికి ప్రతిసృష్టి చేసిన విశ్వామిత్రుని వల్ల రామలక్ష్మణులకు నేర్పబడిన బల, అతిబల అనేవి రహస్యమైన ఉపయోగకరమైన మంత్రములని విశ్వసించాలి.

**అస్త్రవిద్య:** విశ్వామిత్రుడు రామలక్ష్మణులకు తనకు తెల్సిన శస్త్ర, అస్త్రములను నేర్పుతాడు. వాటిని ఎట్లా ఉపసంహరించాలో

చెపుతాడు. పీడనాన్ని తగ్గించి, గాలి వేగాన్ని ఎక్కువ చేసే అస్త్రం 'వాయవ్యాస్త్రం', మంటని రగిల్చి మండిపోయేట్టు చేసేది 'ఆగ్నేయాస్త్రం'. అతిశీతల ప్రదేశాలలో పీడనాన్ని తగ్గించటం ద్వారా గాలివేగాన్ని పెంచవచ్చు. ప్రకృతిలో ఇది సహజంగా తుఫానుల రూపంలో జరుగుతూ ఉంటుందనేది శాస్త్రీయసత్యంగా నిర్ధారించి మన వారు పరిశోధనలు చేశారు. ఇతర దేశాలవారు మన దేశంలో కొంతభాగాన్ని ఆక్రమించుకోడానికి ప్రయత్నించి నప్పుడు వారు ప్రయోగించిన అస్త్రం 'యుద్ధక్షిపణి' అది కార్చి చ్చులా ప్రయోగించినంత మేర కాల్చి బూడిద చేస్తుంది. ఆ ప్రదేశంలో తరువాత కొంతకాలం వరకు గడ్డి కూడా మొలవదు. అంటే ఆగ్నేయాస్త్రంలా పని చేస్తుంది. దీనిని బట్టి **వాయవ్యాస్త్రం, ఆగ్నేయాస్త్రం** అనేవి సత్యదూరం కావని అనిపి స్తోంది. ఇక ***'బ్రహ్మాస్త్రం'*** అనేది అణ్వస్త్రం అణువులో దాగున్న శక్తిని వెలికితీసేది.

విశ్వామిత్రుడు తన సిద్ధాశ్రమంలో యాగం మొదలు పెట్టాడు. యాగం చేస్తున్న యాగకర్త దాని మీదే దృష్టి పెట్టాలి. మధ్యలో లేచి వచ్చి యుద్ధం చేయకూడదు. అందుకే దానిని రామలక్ష్మణులకు అప్పజెప్పాడు. వారు శ్రద్ధగా కాపలా కాస్తు న్నారు. ఎట్లాగైనా దాన్ని చెడగొట్టాలని మారీచ, సుబాహువులనే రాక్షసులు వారి అనుచరగణం ప్రయత్నిస్తున్నారు. కుండలతో మాంసాన్నిరక్తాన్ని యాగశాలలో పోసి, దాని పవిత్రను చెడ గొట్టాలని వాళ్ళ ఆలోచన. అలా వాళ్ళు వచ్చినప్పుడు క్షణంలో బాణాలతో ఒక పళ్ళెం లాగా నిర్మించి, రక్తమాంసాలు క్రింద పడకుండా గొడుగులా ఏర్పరచారు రామలక్ష్మణులు. రక్త మాంసాదులు అస్త్రాల మీద పడిన వెంటనే కాలిపోయి ఆవిరై పోయాయి. ఆ రాక్షసుల మీదకి రాముడు మూడు అస్త్రాలు ప్రయోగించాడు. ఇది మరో శాస్త్ర విజ్ఞానం. అవి–



**మానవాస్త్రం:** ఆగ్నేయాస్త్రం మరియు వాయవ్యాస్త్రం, 'బల', 'అతిబల' మంత్రాలు లాగానే 'మానవాస్త్రం' పేరు విచిత్రంగా ఉంది. రాముడు ప్రయోగించిన మొదటి అస్త్రం మానవాస్త్రం. మానవాస్త్రం మారీచుణ్ణి అతిశీతల వాతావరణంలో నూరు యోజనాల అవతల పడవేసింది. ఈనాడు ఖండాంతక్షిపణుల ద్వారా అంతదూరం విసిరి వేయటం సాధ్యమని నిరూపించ బడింది. ఈ క్షిపణులలో ద్రవరూపంలో ఉన్న ఉదజని, నత్రజని వాడతారు. అవి ద్రవరూపంనుంచి వాయురూపానికి మారి నప్పుడు పీడనం వల్ల అది ముందుకు అతివేగంగా వెళ్ళగలదు. అవి అంతదూరంలో పడినప్పుడు ఇంకా కొంత ఉదజని, నత్రజని మిగిలిపోతాయి. దీనిని బయటకి పంపగల్గితే అతి శీతల వాతావరణం ఉత్పన్నమవుతుంది. మానవాస్త్రం చేత కొట్టబడిన మారీచుడు అంతదూరం విసిరి వేయబడి కూడా చావక, చేష్టలుడిగి ఉండిపోయాడు. దీనిని గురించి బాల కాండలో 30వ సర్గలో 14 నుంచి 25వ శ్లోకం వరకు విపులంగా విశదంగా వర్ణించబడి ఉంది. ఇప్పుడు ప్రయోగి స్తున్న ఖండాతర క్షిపణులలో కూడా మిగిలిన నత్రజని, ఉదజని బయటకు పంపగల్గితే అతిశీతల వాతావరణాన్ని సృష్టించవచ్చు.

సుబాహుని **'ఆగ్నేయాస్త్రం'**తోను, మిగిలిన రాక్షస అను చరులను **'వాయవ్యాస్త్రం'**తోను రాముడు సంహరించెను. ఈవిధంగా మూడు అస్త్రములను రామచంద్రుడు ప్రయోగించి రాక్షసులను సునాయాసంగా శిక్షించి యాగరక్షణ చేసెను.

## రామాయణము-పురవర్ణనలు

రామాయణములో పురనిర్మాణ కౌశలము చక్కగా వర్ణింపబడినది. పురములను అందలి భవనాలను, రాజ ప్రాసాదములను, వాటి నిర్మాణమును, పెద్ద పెద్ద వీథులను వాటి నిర్మాణ విశేషములను కూడా విశదముగా వర్ణించాడు వాల్మీకిమహర్షి. రామా యణంలో వర్ణింపబడిన పురములలో నాలుగు ముఖ్య మైనవి.

**అయోధ్య:** మొదటిది కోసలదేశ రాజధానియగు అయోధ్య. అయోధ్య అనగా జయింపశక్యము కానిది. అయోధ్యా పుర వర్ణనము బాలకాండలో కన్పిస్తుంది. నగరము పొడవు పది పైన రెండు యోజనములు. అనగా పన్నెండు యోజనములు. యోజనమునకు ఎనిమిదిమైళ్ళు, అంటే అయోధ్యానగరపు పొడవు తొంబది ఆరుమైళ్ళు. అయోధ్య వెడల్పు మూడు యోజనములు లేక ఇరవై నాలుగు మైళ్ళు. బాలకాండలో అయిదవ సర్గలో ఈ విధంగా వర్ణింపబడియున్నది.

రాజమార్గాల నిడివి వెడల్పులతో బాటు– ఆ మార్గాలు జలము చేత ఎల్లప్పుడు తడిపేవారనీ, ముత్యాలు, పువ్వులు చల్లి అందంగా, ఆనందంగా, పరిమళభరితంగా ఉండేలా చేసే వారని వర్ణించాడు వాల్మీకి మహర్షి. కోసలదేశపు రాజధాని అయోధ్య పొడవు వెడల్పు కంటే నాల్గురెట్లు అధికంగా ఉండడం వల్ల చతురస్రాకారంగా ఉంది. దీనివల్ల వాతావరణ కాలుష్యం తక్కువగా ఉంటుంది. నిరంతరం నీళ్ళు చల్లడం వల్ల దుమ్ము లేవదు. మహాపథములు రాజమార్గాలు చక్కగా వాస్తు ప్రకారం ఉన్నాయి.

**మిథిల:** రామాయణంలో వర్ణించబడిన రెండవ నగరం మిథిల. నిమిచక్రవర్తి కుమారుడైన మిథి నిర్మించిన నగరం 'మిథిల'. ఇతనినే జనకుడు అని వ్యవహరించడం వలన వారిది జనక వంశంగా పేర్కొనబడింది. జనక మహారాజు తమ్ముడు కుశధ్వ జుడు. సుధర్ముడు అను రాజు జనకపురి మీదకు దండెత్తి వచ్చాడు. కానీ, ఆ యుద్ధంలో సుధర్ముడు చనిపోయాడు. ఆ రాజ్యాన్ని జనకుడు తన తమ్ముడైన కుశధ్వజుని పరిపాలించ మని కోరాడు. సుధర్ముని 'సాంకాశ్య పట్టణము' ఆ రీతిగా కుశధ్వజునకు సంక్రమించెను.

**సాంకాశ్య పట్టణము–** లోతైన అగడ్తలతో పరరాజులు దండెత్తి రాకుండా కాపాడునదిగా ఉన్నది. గోసంపదతో ధన ధాన్యములతో భాగ్యవంతమైన, మిథిలానగరము మీద పరరాజులు కన్నేసి ఉంచేవారు.

**పురదిగ్బంధము:** పూర్వం దక్షయజ్ఞంలో రుద్రుడు తనకు యజ్ఞభాగం కల్పించనందుకు దేవతలను తన ధనుస్సుచే హింసింప సంకల్పించెను. దేవతలు ప్రార్థింపగా, ప్రసన్నుడై శివధనుస్సును జనకుని వంశములో పూర్వుడైన దేవరాతునకు ఇచ్చెను. అట్లు వంశపారంపర్యముగా జనకరాజు దగ్గరకు ఆ శివధనుస్సు వచ్చి చేరెను. దీనిని ఎక్కు పెట్టినవారికి సీత నిచ్చెదనని జనకుడు ప్రకటించెను. చుట్టు పక్కల రాజులందరూ ప్రయత్నించి విఫలులైరి. వారందరూ కలసి మిథిల రాజ్యము మీదికి దండెత్తివచ్చారు.

ఒక సంవత్సర కాలము వారు లోపలివారు బయటకు పోకుండా, బయటివారు లోపలికి పోకుండా మిథిలా పురమును దిగ్బంధము చేశారు. ఒక సంవత్సరం తరువాత నిలవ ఉంచిన ఆహార పదార్థాలు తగ్గిపోయినవి. ప్రజల జీవనం కష్టమైనది. జనకుడు దేవతలను ప్రార్థించి చతురంగ బలములను సమ కూర్చుకొని దండెత్తి వచ్చిన పరరాజులందరితో యుద్ధ మొన రించి ఓడించెను. ఇట్లు జయింపశక్యము కాని మిథిల అయోధ్యతో సమమై నిలిచింది.

ఇచ్చటి ఈ పరిస్థితి– రెండవ ప్రపంచయుద్ధములో ఒక పట్టణాన్ని దిగ్బంధము చేయుట అనే యుద్ధనీతిలో భాగ మునకు సరిసమానముగా ఉన్నది. అంటే లోపల ఉన్న సంపద నంతను వశపరచుకొనుటకు ఈ వ్యూహము పన్నారు. అట్లే భాగ్యసంపన్నమైన మిథిలా నగరమును వశపరచుకొనుటకు రామాయణమున ప్రయత్నము జరిగినది. అనగా ఇట్టి యుద్ధ వ్యూహము రామాయణ కాలమునాడే అమలులో ఉన్నదని భావింపవచ్చును. అలనాటి వైరి రాజులూ సఫలీకృతులు కాలేదు. ఇదీ మిథిల సంగతి.


**కిష్కింధ :** రామాయణములో వర్ణింపబడిన మూడవ నగరము కిష్కింధ. మొదట వాలిచే పరిపాలింపబడినది. రాముడు వాలిని వధించి సుగ్రీవుని రాజుగను, వాలి పుత్రుడైన అంగదుని యువరాజుగను పట్టాభిషిక్తులుగా చేశాడు.

**మధువనం:** ప్రకృతి మధ్య ప్రకృతికి భంగం కలుగకుండా అలరారే రాజ్యం కిష్కింధ. వనాలతో విరాజిల్లే రాజ్యం కిష్కింధ. ఇచట మధువనం గురించి ప్రస్తావించాలి. ఇది మిక్కిలి మక్కువతో వారు పెంచిన వనం. అందులోకి రాజానుమతి లేకుండా ఎవరూ ప్రవేశించలేరు. అందులో ఉన్న తేనెపట్టులూ, ఫలాలు వానరులకు నోరూరిస్తూ ఉంటాయి. దక్షిణ దిశగా వెళ్ళిన అంగద సారథ్యంలోని వాయుసేన హనుమంతుడు సముద్రలంఘనం చేసి సీతమ్మ వారిని చూసిరమ్మంటే సగం లంకను కాల్చి వస్తూ, మధువనంలోకి ప్రవేశించి మధువు సేవించాలని ఆశపడ్డారు. అంగదుని అనుజ్ఞతో అందులో

యథేచ్ఛగా విహరిస్తారు. ఆ వనం బాగోగులు చూడడానికి నియమింపబడ్డ దధిముఖుణ్ణి నిందించి తరిమేశారు. రామ కార్యం, సుగ్రీవాజ్ఞ నెరవేర్చిన వానరుల ధీమా అది. ఇంతకీ రామాయణ కాలంలో ఎటువంటి వనాల్ని వృద్ధి చేసేవారో తెలుసుకోవడానికి మధువనం ఒక ఉదాహరణ.

తరువాత వర్ణింపబడిన పట్టణం లంకానగరం. సుందర కాండలో వాల్మీకి 2, 3, 4, 6, 7 సర్గలలో లంకా పట్టణాన్ని విపులంగా విశదంగా వర్ణించారు. రకరకాలయిన ఆకారాల్లో స్వస్తికం వలెను, పద్మంవలెను అందులోని భవనాలు నిర్మింప బడినట్లు కథ వర్ణించాడు.

**అశోకవనం:** లంకానగరంలో అత్యంత సుందరమైన వనం అశోకవనం. సౌందర్యరాశి అయిన సీతాదేవిని రావణుడు



ఆ వనంలోనే పెట్టాడు. ఆ వనసౌందర్యాన్ని చూసి హనుమ ఆశ్చర్యపడ్డాడు. ఆ వనాన్ని భగ్నం చేయడం వల్లనే రావణుని చూసే అవకాశం లభిస్తుందని తలచి ఆ పనే చేశాడు. రాక్షసులు హనుమను పట్టి బంధించి రావణుని కొలువు కూటానికి తీసుకు వెళ్ళారు. లంక పర్వత పంక్తులతో రకరకాల ఆ వృక్షసంపదతో అనేకమైన తటాకాలతో, సరస్సులతో లక్ష్మీకళ ఉట్టిపడుతూ ఉన్నట్లు వాల్మీకి వర్ణన.

పుష్పక విమానాన్ని కూడ వాల్మీకి విశేషంగా వర్ణించాడు. చుట్టూ ఉన్న వాటికంటే ఎత్తుగా పైపైకి వృద్ధి పొందేలా ఉందని ఆకాశయానానికి అనువుగా ఉన్నట్లుగా దీనిని వర్ణించాడు.

**వీథులు:** రాజులు సైన్యంతో వెళుతున్నప్పుడు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో వీథులను ఎలా నిర్మించాలో రామాయణంలో వర్ణించారు. ముఖ్యంగా భరతుడు వనవాసానికి వెళ్ళిన రాముణ్ణి వెనుకకు తీసుకు రావడానికి సైన్యమంతటితోనూ, పౌరులందరితోనూ బయలుదేరి వెళ్ళాలని సంకల్పించారు. అప్పుడు వారంతా ప్రయాణించడానికి అనువుగా విశాలమైన వీథులు నిర్మించమంటాడు. అటూ ఇటూ ఫలవృక్షాలు తప్ప కుండా నాటమంటాడు. అంటే ప్రయాణమై వెళ్తున్న సైన్యం పౌరులు ఇబ్బంది పడరాదనీ, దారిలో ఉన్న జనపదాల్ని ఇబ్బంది పెట్టరాదనీ భరతుని ముఖ్యోద్దేశం.

**సేతు నిర్మాణం:** ఇక రాముడు వానరసైన్యంతో లంకకు వెళ్ళటానికి సముద్రం మీద నిర్మించిన సేతువు ఇప్పటికి గొప్ప కట్టడంగా నిలిచి ఉంది. ఈనాడు ఉపగ్రహాల ద్వారా లభించిన ఆధారాలతో 'రామసేతువు' అతి పురాతనమైన మానవ నిర్మిత మైన కట్టడమని అందరూ ప్రశంసిస్తుంటారు. యుద్ధకాండలో 23, 24 సర్గలలో వారధి నిర్మాణ నిపుణులు నలుడు నీలుడు వానరసైన్యం మొత్తం సహాయం చేయగా 5 రోజులలో ఈ సేతువు నిర్మాణం ఎట్లా చేశారో ఉంది. కాబట్టి, రామసేతు అతి పురాతమైన గొప్ప నిర్మాణమని నిస్సందేహంగా చెప్పవచ్చును.



భూకంపాల గురించి, శివధనుర్భంగ ఘట్టము, కిష్కింధ కాండలోని జంతువుల వైద్య విజ్ఞానానికి సంబంధించిన మంచి మంచి ఎన్నో... ఎన్నో.... వృత్తాంతాలు రామాయణంలో దాగి ఉంది. ఈ విధంగా వాల్మీకి రామాయణము అనేక శాస్త్రాంశాలను ఉటంకించిన తొలి కావ్యము. బహుశాస్త్ర విషయాన్విత మహాకావ్యము.

'జై శ్రీరామ్'



# నాగులచవితి భక్తులకు ప్రగతి

- శ్రీ కె.మల్లికార్జున

నాగపూజను మనదేశంలోని వివిధ ప్రాంతాలలో సంవత్సరానికి రెండుసార్లు జరుపుకోవడాన్ని గమనించగలం. శ్రావణమాసంలో వచ్చే శుద్ధచవితిని నాగులచవితిగా, పంచమిని గరుడపంచమిగా జరుపుకుంటారు. మరికొన్ని ప్రాంతాల్లో కార్తికశుద్ధచవితిని నాగులచవితిగా, పంచమిని నాగపంచమిగా జరుపుకుంటుంటారు.

సర్పపూజ అనాదికాలం నుండి మన హిందూసంస్కృతిలో ఒక భాగం. దేవ, రాక్షస, యక్ష, గంధర్వ, నాగ, పితృ, మానుషగణాలను 'సప్తగణాలు' అని అంటారు. ఈ సప్తగణాలలో సర్పగణం ఒకటిగా చెప్పబడింది. ఈ సప్తగణాలలో నాగులకు, మానుషగణాలకు అవినాభావ సంబంధం ఉంది. నాగులు రజోగుణ సంపన్నులు. వీరికి ఎంత అధికకోపం వస్తుందో, అంత ఉపకారం చేసే గొప్పగుణం కూడా కలదు. అందుకే ఈ భూమండలంలో మానవులతో నాగులకు అవినాభావ సంబంధం ఉన్నది. సర్పజాతికి ఎనిమిదిమంది మూలపురుషులు ఉన్నారని పురాణవచనం. వారిలో అనంతుడు, వాసుకి, తక్షకుడు, శంఖపాలుడు. ధనంజయుడు, కర్కోటకుడు, మహాపద్ముడు, కుశికుడు ముఖ్యులు. వీరిలో అనంతుడు, శేషుడు సత్త్వగుణప్రధానులు. ఐరావత, ధనుంజయ, శంఖపాలుడు, రజోగుణప్రధానులు. తక్షక, కర్కోటకులు తమోగుణ ప్రధానులు.

మన సంస్కృతిలో సర్పారాధనకు విశేషమైన ప్రాధాన్యత ఉంది. ఆదిశేషుడు, నాగేంద్రుడు, వాసుకి, తక్షక పేర్లతో నాగులు పూజలు అందుకుంటున్నారు. అంతేకాదు, మన పురాణాలలో నాగులకున్న ప్రత్యేకత అంతా ఇంతా కాదు. శ్రీమహావిష్ణువుకు ఆదిశేషుడు క్షీరసాగరంపై తల్పంగా, వాసుకి పరమశివునికి ఆభరణంగా, గణపతికి నాగేంద్రుడు యజ్ఞోపవీతంగా వారి స్వాములసేవలో పునీతులవుతున్నారు.

## నాగులు భూలోకానికి రావడం

యోగశాస్త్రాన్ని రచించి చిత్తశుద్ధిని, వ్యాకరణాన్ని సాహిత్యాన్ని, రచించిన ఆదిశేషుడు 'పతంజలి'- 'చరకుని' రూపంలో ఈ భూలోకానికి వచ్చిన కథ అత్యంత ఆసక్తికరం.

పూర్వం ఒకసారి శ్రీమహావిష్ణువు క్షీరసాగరంలో ఆదిశేషునిపై పవళించి ఉండగా, స్వామివారి బరువు క్షణక్షణానికి పెరిగిపోసాగిందట. అంత బరువును మోయలేక తల్లడిల్లిపోయిన ఆదిశేషుడు, స్వామితో అలా బరువుపెరగడానికి కారణమును అడిగి తెలుసుకొన్నాడు. ఆ బరువుకు ఆలస్యం చేయకుండా భూలోకానికి వచ్చాడు. ఇందుకు కారణమును- ఒకసారి భూలోకానికి వచ్చిన విష్ణుమూర్తి చిదంబరక్షేత్రంలో నటరాజస్వామి నృత్యాన్ని చూస్తూ తన్మయత్వంలో తన ఉనికినే మరచిపోయాడు. ఆ ఆనందతాండవాన్ని చూసిన సంతోషంలో స్వామి బరువు క్షణక్షణానికి పెరిగిపోయింది.

ఆ సంఘటన గురించి ఆసక్తిగా విన్న ఆదిశేషుడు, తనకు కూడా చిదంబరక్షేత్రంలో నటరాజస్వామి నాట్యాన్ని చూడాలని కోరిక ఉన్నట్లు స్వామికి తెలిపి, అందుకు శ్రీహరి అనుమతిని కోరాడు. నటరాజస్వామిని గురించి తపస్సు చేసి, భూలోకానికి వెళ్లి నాట్యాన్ని చూసి, తరించమని శ్రీహరి ఆనతిచ్చాడు. అలా ఆదిశేషుడు భూలోకానికి చేరాడు.

అంతలో ఒక మునీశ్వరుడు గంగాస్నానం చేస్తూ అర్ఘ్య ప్రదానం చేసేందుకు నీళ్లను తీసుకున్నాడు. ఆ నీళ్లలో చిన్న పురుగులా ఐదుతలల పాము కనిపించింది. ఉలిక్కి పడి కిందికి వదిలాడు. అంజలినుండి కిందపడిన ఆదిశేషుడు, పతంజలి రూపంలో మానవరూపాన్ని ధరించి చిదంబరక్షేత్రంలో పరమ శివుని గురించి తపస్సు చేసి, ఆ మహేశ్వరుని అనుగ్రహంతో నటరాజస్వామి ఆనందతాండవాన్ని కనులారా చూసి ఆనందించాడు.

నాగులు భూమికి వచ్చేముందు మహాక్రూర స్వభావాన్ని కలిగి ఉండేవారు. దీనికి సంబంధించిన ఒక పురాణగాథ కలదు.

అనంతుడు, కుశికుడు మొదలు వారి సంతతి దినదినం పెరిగిపోయింది. సర్పజాతి అంతా కుటిల స్వభావంతో, విష పూరితముఖాలతో ఉంటూ, అడ్డం వచ్చిన జీవులన్నింటినీ కాటు వేసి సంహరిస్తూ ఉండేవి. ప్రజలంతా ఈ బాధను భరించలేక బ్రహ్మదేవుణ్ణి వేడుకున్నారు. మానవుల బాధలను సానుభూతితో విన్న బ్రహ్మదేవుడు అభయాన్నిచ్చి పంపివేశాడు.

తర్వాత నాగసంతతిని పిలిచి మీ వలన నేను సృష్టించిన జీవులన్నీ నాశనమౌతున్నాయి. మీరు ధర్మవిరుద్ధంగా ప్రవర్తిస్తున్నారు. వైవస్వత మన్వంతరంలో చంద్రవంశీయుడైన జనమేజయమహారాజు చేసే సర్పయాగంలో నాశనమవుతారని శపించాడు. అప్పుడు నాగులన్నీ అంతశాపం తాము భరించలేమని బ్రహ్మను వేడుకున్నారు. తర్వాత పాతాళలోకాలకు వెళ్లి సుఖాలను అనుభవించమని బ్రహ్మదేవుడు చెప్పాడు.

అనంతరం పాతాళలోకం నుండి శాపవిమోచన కోసం బ్రహ్మదేవుడు యజ్ఞం చేస్తున్న పర్వతప్రాంతానికి వెళ్లారు. బాగా అలసిపోయిన నాగులన్నీ ఒక కొండ చరియ ప్రక్కన నీడకోసం ఆగాయి. ఆ సర్పాలమీద దైవకృపవల్ల చల్లని జలధార ప్రవహించింది. నాగులమీద పడిన జలధార క్రమేణ నాగతీర్థంగా మారింది. శ్రావణ పంచమినాడు ఈ నాగతీర్థంలో స్నానం చేస్తే నాగుల వల్ల కలిగే భయాలు, నాగదోషాలు పరిహారమౌతాయి. ఈ విధంగా నాగులు భూలోకానికి వచ్చాయి.

## నాగులచవితి నాడు పూజ

నాగులచవితి ప్రాశస్త్యాన్ని గురించి స్వయంగా పరమ శివుడే పార్వతీదేవికి చెప్పినట్లు స్కాందపురాణంలో పేర్కొనబడింది. "ఓ పార్వతీ! నాగులచవితి రోజు ఉదయమే కాలకృత్యాలు తీర్చుకొని, తలస్నానం చేసి, ఉపవాసం ఉండాలి. గడపకు రెండువైపులా గోమయంతో సర్పచిత్రాలను చిత్రీకరించి పూజించాలి. పంచమిరోజు బంగారం, వెండి, కర్ర లేక మట్టితో ఐదుపడగలు గల తలతో సర్పప్రతిమను చేయించాలి. అలా కుదరనపుడు చందనం లేదా పసుపుతో ఐదు లేక ఏడుతలల సర్పచిత్రాన్ని గీయాలి. లేదా ప్రతిమలను తయారు చేసుకోవాలి. ఈ ప్రతిమలను భక్తిశ్రద్ధలతో పూజిస్తూ, పంచమినాడు పాలు, పాయసాలను నైవేద్యంగా సమర్పించాలి" అని చెప్పాడు.

స్త్రీలు తమ అభీష్టసిద్ధి కోసం నాగదేవతను పూజించడం తరతరాలుగా వస్తున్న సంప్రదాయం. దీర్ఘకాలికవ్యాధులతో, బాధలు పడేవారు, చెవిటి, మూగవారు నాగదేవత పుట్టకు ప్రదక్షణలు చేస్తే ఫలితం ఉంటుందన్నది భారతీయుల నమ్మకం. నాగప్రతిష్ఠ చేస్తే సంతానభాగ్యం కలుగుతుందని పెద్దలవాక్కు.

నాగులచవితి రోజున సంతానభాగ్యాన్ని కోరుకునే వారు. పుట్టచుట్టూ, బియ్యపు నూకలను చల్లుతూ, "నూకలిస్తాను స్వామీ! మాకు మూకలు ఇవ్వు" అని ప్రార్థిస్తుంటారు. చవితి రోజున ఉదయాన్నే తలంటి స్నానంచేసి కఠిన ఉపవాసం ఉండి, నియమంతో పుట్టదగ్గరకు వెళ్లి, పుట్టను షోడశోపచారాలతో పూజించి, పుట్టలో పాలు పోసి నైవేద్యాన్ని సమర్పిస్తారు. నువ్వులు, బెల్లం కలిపి చేసిన నువ్వుల పిండిని, బెల్లం, బియ్యపు పిండి కలిపి చేసిన చలిమిడిని నైవేద్యంగా సమర్పిస్తారు. ముఖ్యంగా శివాలయాలు, రావిచెట్టు మొదలు ఉద్యానవనాలు, నదీతీరాలలో నాగదేవతలు ప్రతిష్ఠింపబడి, భక్తులచే పూజించబడటం జరుగుతోంది.

నాగదేవతలను పూజించినవారికి కోరిన కోరికలు అనుగ్రహింపబడతాయి. నాగదేవతపూజ సకలశుభప్రదం. కామితార్థఫలప్రదం.

నాగులచవితి, నాగపంచమి రోజులలో తెలిసో, తెలియకో భూమిలో బొరియలుంటే పూడ్చడం గానీ, భూమిని దున్నడంగానీ, చేయకూడదు. అందుకే –

*"పాహిమాం నాగేంద్ర సౌభాగ్యం దేహిమే"*




11-10-2021న తిరుమల బ్రహ్మోత్సవాల సందర్భంగా గరుడసేవలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున గౌరవముఖ్యమంత్రివర్యులు శ్రీ వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిగారు శ్రీవారికి పట్టువస్త్రాల సమర్పణ. వారికి ఆశీస్సులు అందజేస్తున్న పెద్దజీయర్, చిన్నజీయర్‌స్వాములు.




11-10-2021న తిరుపతి అలిపిరి వద్ద 'శ్రీవేంకటేశ్వర సప్తగోప్రదక్షిణ మందిర' సముదాయాన్ని ప్రారంభించి, గోవుకు గ్రాసం అందిస్తున్న గౌరవముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డిగారు మరియు ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న దృశ్యం.






11-10-2021న పునర్నిర్మిత అలిపిరి నడకదారి ప్రారంభం, 12-10-2021న తిరుమల శ్రీవారి ఆలయంలో తులాభారంలో పాల్గొన్న గౌరవముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డిగారు. అనంతరం వారిని ఆశీర్వదిస్తున్న అర్చకులు.

# తిరుమల తిరుపతి దేవస్థానములు

## తిరుమల శ్రీవారి ఆలయంలో 07-10-2021 నుండి 15-10-2021 వరకు



సేనాధిపతి ఉత్సవం



ధ్వజారోహణం



పెద్దశేషవాహనం



సింహవాహనం



కల్పవృక్షవాహనం



సర్వభూపాలవాహనం

# ఏకాంతంగా జరిగిన శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవ దృశ్యాలు



గరుడవాహనం



హనుమద్వాహనం



గజవాహనం



సూర్యప్రభవాహనం



చంద్రప్రభవాహనం



చక్రస్నానం

# తిరుమల తిరుపతి దేవస్థానములు



11-10-2021న తిరుమల శ్రీవారి ఆలయంలో 2022 నూతన సంవత్సర క్యాలండర్లు, డైరీలను ఆవిష్కరిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మాన్యశ్రీ వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డిగారు. ఈ కార్యక్రమంలో మంత్రివర్యులు, తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు మరియు తి.తి.దే. ఉన్నతాధికారులు పాల్గొన్న దృశ్యం.



11-10-2021న తిరుపతి బర్డ్ ఆసుపత్రి ప్రాంగణంలో శ్రీపద్మావతీచిన్నపిల్లల గుండె చికిత్సల ఆసుపత్రిని ప్రారంభిస్తున్న మాన్యముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి గారు. ఈ కార్యక్రమంలో మంత్రివర్యులు, తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు మరియు తి.తి.దే. ఉన్నతాధికారులు పాల్గొన్నారు.





12-10-2021న తిరుమలలో ఎస్వీబిసి కన్నడ, హిందీ ఛానెళ్లను ప్రారంభిస్తున్న గౌరవముఖ్యమంత్రివర్యులు శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డిగారు. చిత్రంలో మంత్రాలయ శ్రీరాఘవేంద్రపీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సుబుధేంద్రతీర్థస్వామివారు. ఈ కార్యక్రమంలో మంత్రివర్యులు, తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు మరియు తి.తి.దే. ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



12-10-2021న తిరుమల శ్రీవారి ఆలయంలో నూతన బూందీపోటును ప్రారంభించిన గౌరవముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డిగారు. ఈ కార్యక్రమంలో మంత్రివర్యులు, తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు మరియు తి.తి.దే. ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



25-09-2021న తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి సంయుక్త కార్యనిర్వహణాధికారిగా శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., గారు పదవీబాధ్యతలు స్వీకరిస్తున్న దృశ్యం

# అరుదైన 'సప్త స్వరా'లయం

- కీ.శే. డా॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రి

మన దేవాలయాలు

ప్రపంచంలో మధురమైన నాదానికి ఆకర్షితుడు కాని వ్యక్తి ఉండదు. నాదం వివిధ రూపాలలో అభివ్యక్తమవుతుంది. ఓంకారనాదం బ్రహ్మాండమంతటా వ్యాపించి ఉపాసనాయోగ్యత నందుకొన్నది. నాదంనుండి శ్రుతులు, శ్రుతులనుండి స్వరాలు, స్వరాలనుండి రాగాలు వెలువడినవి. 'శ్రుతిర్మాతా లయః పితా' అన్నట్లు, శ్రుతికి సంగీతశాస్త్రం మాతృస్థానమిచ్చింది. గాయకుని కంఠధ్వనిని పక్కవాద్యాలు శ్రుతి తప్పకుండా ఉంచుటకు శ్రుతి వాద్యంగా 'తంబూరా' ఉంటుంది. తంబూరవాద్య సృష్టికర్తలు తుంబురు- నారదులని ప్రతీతి. తంబూరా సప్తస్వరములతో కూడిన శ్రుతికి ఆధారం.

సంగీతంలో సప్తస్వరాలు, వారంలో ఏడు దినములు, మహర్షులలో సప్తర్షులు ప్రాధాన్యత నందుకొన్నారు. హంపిలో సప్తస్వరాలు పలికే స్తంభాలు రూపొందించారు మన శిల్పులు.

సప్తస్వరాలకోసం ఒక ఆలయాన్ని, శ్రుతికే ఆధారమైన తంబూరా ఆకారంలో నిర్మించటం అద్భుతం. ఇట్టి అద్భుతానికి ఆకారం కల్పించిన సంగీత శాస్త్రవేత్త ఆర్.కె.పద్మనాభ, కర్ణాటక రాష్ట్రమందలి హాసన్ జిల్లా రుద్రపట్నంలో సంగీతసేవకు ప్రతీకగా, తంబూరా ఆకారంలో, విశాలమైన స్థలంలో నిర్మించి కళాకారులను, సంగీతాభిమానులను ఆకర్షిస్తున్నారు.

ఈ సప్తస్వరాలయంలో సప్తస్వరదేవతలు ప్రతిష్ఠింపబడి నిత్యపూజలందుకొంటున్నారు. సప్తస్వరదేవతలు-

**స - షడ్జమం -** సంగీతానికి ఆధారస్వరం షడ్జమం. సంగీత దేవత సరస్వతీమాత నెమలివలె ధ్వనించు ఈ స్వరానికి అగ్ని తేజస్సును, శారదను ఆవాహన చేశారు.

**రి - రిషభం -** బ్రహ్మమూలంగా వృషభం (ఎద్దు తోకవలె) ఉండు, ఈ స్వరాన్ని సంకీర్తనాచార్యుడైన పురందరదాసుల వారు సమీకరించారు. శాస్త్రీయసంగీతానికి నియమ నిబంధనలను ఏర్పాటు చేసిన వారాయన. పురందర విఠలాంకితమైన వీరి కీర్తనలు జనరంజకములుగా ఉన్నాయి.

**గ - గాంధారం -** సంగీతం గంధర్వ కళ. సరస్వతికీ, భగవంతునికీ ప్రియమైన స్వరం మేక. మేకధ్వనివలె వినబడు ఈ స్వరంలో, కరుణరసం, శాంతరసం, ప్రధానమైనవి. వాదిరాజస్వాములవారు 'హయవదన' అంకితంతో చక్కని కృతులు రచించారు.

**మ - మధ్యమం -** ఈశ్వరమూలమైన ఈ స్వరం సప్తస్వరాల మధ్య ఉండి హాస్యరసాన్ని చిందిస్తూ, క్రౌంచపక్షి ధ్వనికి ప్రతినిధిగా ఉండి, మేధావులకే కాక, సామాన్యులకు కూడా ప్రీతిపాత్రమైన కృతులను అంకితం చేశారు భక్త కనకదాసు. తన ఇష్టదైవమైన 'కాగినెల ఆదికేశవునికి' అంకితం చేశారు. ఈ స్వరప్రతినిధి కనకదాసుగారే గూఢార్థములతో ప్రజలను సన్మార్గంలో నడిపించుటకు యత్నించారు.

**ప - పంచమం -** ఇది చలనం లేని ప్రకృతి స్వరం. పరమ శివునికి ప్రియమైన ఈ స్వరం శృంగారరస సూచకం. వసంతఋతువులో కోకిల పంచమస్వరంలో పాడే ధ్వనివలె ఉంటుంది. త్యాగరాజస్వామివారు, భావప్రధానమైన సాహిత్యంలో నూరారు కృతులను, త్యాగరాజాంకితంగా ఈ స్వరంలో రచించారు. త్యాగరాజస్వామి కృతులను 'త్యాగోపనిషత్' అంటారు. శ్రీరామోపాసకులై, రామచంద్రుల సాక్షాత్కారమందుకొన్న 'నాదబ్రహ్మ' త్యాగరాజులవారు.

**ద - దైవత్వం -** గణపతి స్వరూపమైన ఈ స్వరం ధ్వని గాంభీర్యం కలిగి వీరరసప్రచోదకంగా ఉంది. గుర్రం ధ్వని కల్గింది. ఇందుకు అనుగుణంగా, వీణావాదన నిపుణులు, సంస్కృత విద్వాంసులు అయిన ముత్తుస్వామి దీక్షితులవారు దీనిని స్థాపించారు. దీక్షితులవారు దేవీ ఉపాసకులు. 'శ్రీవిద్య'ను హస్తగత మొనర్చుకొని సంస్కృతభాషలో 'గురుగుహ' అంకితంగా ఎన్నో కృతులు రచించిన వాగ్గేయకారులు దీక్షితులవారు.

ని - నిషాద - ఏనుగు ఘీంకారమును ప్రతిధ్వనించు ఈ స్వరం అద్భుతరస ప్రచోదకం. శ్రీశ్యామశాస్త్రులవారు తాళ, లయ ప్రధానమైన పెక్కు కృతులను తెలుగులో రచించారు. శాస్త్రులవారికి, దేవికి, తల్లీబిడ్డల సంబంధం. కోమలమైన నిషాదస్వరప్రతినిధి శ్యామశాస్త్రులవారు.



ఈ సప్తస్వరాల ఆలయ గోపురం 60 అడుగుల ఎత్తు, ఏడు అంతరువులున్నాయి. గోపురం కుడి ఎడమ వైపులందు సంగీత వాద్యకారులు పలికించే రాగాలను ఏడు భంగిమలలో రూపొందించారు. ఎత్తైన తంబూరా దండియ కళ సదా గొప్పది. కళాకారుడు బాలుడు అని నిరూపిస్తుంది. దండియలో నాలుగు బిరడాలు మరియు తీగలు చేర్చబడినాయి. తంబురా కుంభం లోపల భాగాన్ని అర్ధచంద్రాకృతిలో కూర్చినారు. తంబురా కుంభం (కుండ) శబ్దనాదములను పెంచును. చలనం కల్గి స్తుంది. ఇచట కూర్చొని అభ్యాసం సాగించిన సంగీతజ్ఞానం వృద్ధి చెందునని, ఆలయనిర్మాత పద్మనాభగారి అభిమతం. ప్రధానమూర్తులు కింద, వారి ప్రతిరూపములున్న చిన్నమూర్తు లకు అభిషేకం, అర్చనలు జరుగును. దేవాలయం నలువైపుల సంగీతవాద్యాలకు కాణాచియైన రుద్రపట్నమునకు చెందిన, సంగీతవిద్వాంసుల పేర్లను గ్రానైట్‌శిలలో మలచినారు.

## స్వరార్చన

ఈ దేవాలయం ఆకారంవలె ఇచటి పూజలు కూడా విశిష్టమైనవి. స్వరదేవతల పూజకు ప్రతిదినము సంగీత కళాకారులు, దాతలు, తమకు ఇష్టమైన రాగాలలో పాటలు పాడి స్వరసమర్పణ కావిస్తారు. ఆరోహణస్వరాలను మంత్ర పూర్వకంగా సంగీతయజ్ఞంలో హవిస్సుగా సమర్పించి గానాభి షేకం చేస్తారు. సంగీతదేవతలకు యుక్తమైన నాదపూజ గానాభి షేకములను చూచి, విని ఆనందించాలి.

ఈ ఆలయానికిగల మరొక అద్భుతం, ఆలయంలో ప్రవేశించిన వెంటనే తంబూరా నాదం మనకు స్వాగతం పలుకుతుంది. ఒక్కొక్క మూర్తి ముందు నిల్చుని మీట నొక్కినంతనే ఆ సంగీతమూర్తి పద్మనాభదాసుల ధ్వనిలో విన గలం. అచట కూర్చొన్న ఆ ప్రశాంత నాదద్వయ ముల దివ్యానుభూతి లభిస్తుంది. ఆలయం బయటి ప్రాంగణం పచ్చికబీళ్ళతో, జల యంత్రా లతో అత్యంత ఆహ్లాదకరంగా ఉంటుంది.

ఈ స్వరమందిర నిర్మాత శ్రీ కె.ఆర్.పద్మనాభ అగ్రశ్రేణికి చెందిన గాయకులుగా, నటులుగా, గోష్ఠిగానప్రవర్తకులుగా పేరుగాంచి పద్మనాభ దాస అంకితంగా పలు కీర్తనలు రచించిన వాగ్గేయకారులు. ఎందరో శిష్యులను తీర్చిదిద్దు తున్న పద్మనాభదాసువారు అతినిరాడంబరులు. వాదిరాజ స్వాములవారి అనన్యశిష్యులై, వాదిరాజస్వాములవారి కృతులను స్వరపరచి, వందలాది ధ్వనిముద్రికలను వెలువరించారు.

ప్రతి ఏటా, మే నెల మూడవవారంలో సంగీ తోత్సవాలను నిర్వహిస్తూ, కళాకారుల కచ్చేరీలను ఏర్పాటుచేసి ప్రముఖులకు "నాచారమ్మ" పురస్కారప్రదానం చేస్తారు. రుద్రపట్నం రెండవ తిరువయ్యారుగా ప్రసిద్ధి గాంచింది.

ప్రతి ఏటా కళాకారులు విచ్చేసి స్వరదేవతలకు గానాభిషేకం చేసి, ఆ దేవతల అనుగ్రహపాత్రులై, ఆనందిం చాలని పద్మనాభ దాసుల ఆశయం.

## ఎక్కడుందీ రుద్రపట్నం?

ఈ ఆలయం కర్ణాటకమందలి హాసన్ జిల్లా, అరకుల గూడు తాలూకాలోని కావేరీ నదీతీరంలో ఉంది. లోగడ హయగ్రీవపురి అనేవారట. బెంగుళూరు నుండి అయిదారు గంటల ప్రయాణం. బస్సుసౌకర్యం ఉంది.



ప్రతిరోజూ ప్రాతః కాలంలో నిద్ర లేవాలి

# ధర్మానికి పునాది - దాంపత్యం

- బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ

గృహలక్ష్మి

అపూర్వ నాగరికతను సాధించి ప్రపంచంలో ప్రప్రథమ సంస్కృతిని సాధించిన భారతీయ ధర్మం ఇప్పటికీ ఆ విలువలను పూర్తిగా కోల్పోలేదు.

స్త్రీ పురుష సంబంధాలపై సనాతన ధర్మం తపశ్శక్తితో గొప్ప వ్యవస్థను ఏర్పరచింది.

ఆ ధర్మానికి మూలస్తంభం కుటుంబం. కుటుంబానికి మూలాధారం దాంపత్య ధర్మం. కాలగతిలో ఎన్ని పరిణామాలు ఎదురౌతున్నా ఈ ధర్మమే పరంపరను నిలబెట్టింది.

'దాంపత్యం- భార్యాభర్తల సంబంధం' ఎలా ఉండాలో అద్భుత ఆదర్శాలతో వైదిక సంప్రదాయం స్పష్టపరచింది.

భార్యాభర్తల బంధాన్ని స్నేహబంధంగా నిర్వచించారు. "పురుషునికి దైవమిచ్చిన స్నేహితులెవరు?"- అని యక్షుడు ప్రశ్నిస్తే..

"భార్య" (భార్యా దైవకృతా సఖా) అని సమాధాన మిచ్చాడు ధర్మరాజు.

ఈ స్నేహాన్ని చాటడానికే వివాహంలో 'సప్తపది' (ఏడడుగులు) మంత్రాలున్నాయి.

(సఖా సప్తపదాభవ, సఖాయౌ సప్తపదాబభూవ, సఖ్యంతే గమేయగ్ం, సఖ్యాత్తే మా యోషగ్ం, సఖ్యాన్నే మా యోష్ఠా....)

ఈ వివాహ మంత్రాలన్నీ దాంపత్యం అనేది ఒక 'సఖ్యం' అని స్పష్టీకరించాయి.

"ఏడడుగులు వేసి నాతో స్నేహితురాలవై ఉండు. మనం ఎప్పుడూ స్నేహితులుగానే ఉందాం. నీ స్నేహమే నాకు లభించింది. నీ స్నేహం విడవలేను. నా స్నేహం విడవకు" అని పై మంత్రాల భావం.

"ధర్మార్థ కామాలలో నిన్ను అతిక్రమించను" (నాతి చరామి) అంటూ ప్రతిజ్ఞ చేస్తాడు వరుడు.

అసలు "పరస్పర విరోధంగా కనిపించే ధర్మార్థ కామాలను సమన్వయపరచే శక్తి 'భార్యకే ఉంది"... అని మహాభారతం చెబుతోంది.

అర్థకామాలు భార్య ద్వారా నెరవేరడం వల్ల అధర్మ దోషం ఉండదు. ఇలా ధర్మంతో ఆ రెండూ కలిసి పురుషుని ఉన్నతుణ్ణి చేస్తున్నాయి. ఈ లోతు తెలుసుకుంటే ప్రపంచ వ్యాప్తంగా కుటుంబ వ్యవస్థ పటిష్ఠపడి, సవ్యమైన సమాజం సుప్రతిష్ఠితమవుతుంది.

యజుర్వేద మంత్రాలలో స్నేహధర్మం గురించి చెబుతూ- "స్నేహితునిగా భావించే వారిని పరిత్యజించరాదు. మిత్రుని వదిలిన వారికి ధర్మంలో భాగం ఉండదు. పుణ్య మార్గం అతడికి గోచరించదు"- అంటే ఇహపరాల్లో క్షేమం ఉండదని భావం.

స్నేహబంధమైన దాంపత్యంలో దీనిని గుర్తుంచుకోవాలి. మనిషి తనని తాను ఎలా క్షమించు కుంటాడో, తనతో తాను ఎలా




రాజీ పడతాడో, తన భార్య (భర్త) తోనూ అలాగే సహనశీలియై సఖ్యాన్ని కాపాడుకోవాలి. కొన్ని భేదాలు వచ్చినా శాశ్వత ప్రయోజనమైన ధర్మంకోసం, స్నేహ నిబద్ధతకోసం సహనం వహించడం ప్రేమధర్మం.

ఈ 'ప్రేమ' అనే మాట విస్తృతంగా వినిపిస్తుంటుంది. కానీ ఆ ప్రేమను ఒక సువ్యవస్థగా నిలబెట్టే అపూర్వ బంధం దాంపత్యం.

*"గార్హపత్యాయ దేవాః మహ్యం త్వాం అదుః"*– గృహస్థాశ్రమ నిర్వహణకై దేవతలు నిన్ను నాకు ప్రసాదించారు– అని వరుడు చెప్పే వివాహమంత్రం *"సమ్రాజ్ఞీ శ్వశురేభవ" "మూర్ధానం పత్యురారోహ".*

" నా గృహానికి నువ్వు సామ్రాజ్ఞివి." "పతినైన నా శిరస్సుపై అధిష్ఠించు" – అని ఉత్తమస్థానంలో గౌరవించదగినది ఇల్లాలేనని వైదిక వివాహ మంత్రాల బోధన.



"ఆర్జించిన ధనాన్ని భార్యకు అధీనం చేయాలి. ధన రక్షణ, వ్యయాలపై ఆమెయే అధికారిణి. గృహంలో సదాచారంలోనూ, శౌచంలోనూ, ధర్మంలోనూ, ఆహారంలోనూ ఆమెకే పూర్ణ అధికారం"– అని మనుస్మృతి ఉపదేశం.

*"భార్యా శ్రేష్ఠతమా సఖా"* అని స్మృతి కూడా సెలవిచ్చింది.

కుటుంబ సామాజిక బాధ్యతలను ఒక యజ్ఞంగా నిర్వహించడంలో భార్యాభర్తలు కలిసి ఉద్యమించాలని వేద బోధ.

"దంపతులారా! మీరిరువురూ కలిసి వర్తించండి. కలిసి ధర్మాన్ని ఆచరించండి. సమాన మార్గాన్ని అనుసరించండి. మీ ద్వారా వంశమంతా తరించాలి" అని యజుర్వేద మంత్రాలు.

*"త్వష్టాజాయా మజనయత్.*
*త్వష్టా స్యైత్వాం పతిం"*

అనే మంత్రంలో– "ఓ పురుషుడా! నీ కోసమే పరమేశ్వరుడు ఈ భార్యను సృష్టించాడు. నిన్ను పతిగా ఆమెకోసం సృష్టించాడు" అని చెప్పారు.

అసలు 'దాంపత్యధర్మం' అనాది. సనాతనం. ఒకే పరమాత్మ తనను రెండుగా విభజించుకున్నాడనీ, అదే ప్రకృతీ పురుషులనీ, ఆ అర్ధనారీశ్వరతత్త్వం వల్లనే సమస్త విశ్వం ఆవిర్భవించిందనీ వేదం స్పష్టంగా పలికింది.

ఈ విషయాన్నే మనువు –

*ద్విధాకృత్వాత్మనో దేహమర్ధేన పురుషోభవత్।*
*అర్ధే నతస్యాం సా నారీ విరోజ మసృజత్ ప్రభుః॥*

– అని తెలియజేశాడు. విశ్వనిర్మాణానికి మూలం దాంపత్యభావం. ఒకే పరతత్త్వం రెండయ్యింది. అలాగే స్త్రీ పురుషభావం ఏకమవ్వాలి. ఆ ఏకంలో పరమాత్మ వైభవం ప్రకాశిస్తుంది. ప్రకృతి నియమం పాలించబడుతుంది. అంటే – దాంపత్య ధర్మాన్ని అతిక్రమించడం ప్రకృతి విరుద్ధం.

భార్యాభర్తల అన్యోన్యత గురించి రాముడు చెప్పిన ఒక్క మాటచాలు– *"అనన్యా హి మయా సీతా భాస్కరస్య ప్రభా యథా"*

'సూర్యునికి వెలుగులా సీత నాకు అనన్య (వేరు కానిది)'
దాంపత్యంలోని ఔన్నత్యాన్ని తెలిపేది ఇంతకన్నా గొప్ప వాక్యం ఉంటుందా!

ధారావాహిక

# శ్రీమద్భగవద్గీత

- ఆచార్య కుప్పా విశ్వనాథశర్మ

*గత సంచిక తరువాయి భాగం...*

శ్రీ గురుభ్యోన్నమః

మనం శ్రీకృష్ణపరమాత్మ చేసినటువంటి గీతామృతాన్ని సాక్షాత్తుగ వేదరూపంగా భావిస్తూ వస్తున్నాము. వేదాలు లేదా శ్రీమద్భగవద్గీత ఈ రెండూ కూడ మానవులకు కర్తవ్యాన్ని బోధించే గ్రంథాలు అని అర్థం చేసుకున్నాము.

అయితే యేదైన ఒక గ్రంథం అధ్యయనం చేసుకునే ముందు ఒక ఉపదేశాన్ని వినేముందు ఆ ఉపపదేశం గ్రహించ టానికి ఆ గ్రంథం అధ్యయనం చేసుకోవటానికి అర్హులు ఎవరు అనే తీర్మానం జరగాలి.

అలా జరిగినప్పుడు మాత్రమే మనం ఆ గ్రంథం వలన ఆ ఉపదేశం వలన ప్రయోజనాన్ని పొందగల్గుతాం. దీన్ని శాస్త్రీయ పరిభాషలో 'అధికారి' అంటారు. ఈ గ్రంథం చదవడానికి లేదా ఈ ఉపదేశం గ్రహించటానికి అధికారి అనే విచారణ శాస్త్రగ్రంథాలలో విస్తృతంగా చేసుకుంటారు.

అయితే శ్రీమద్భగవద్గీత ఈ గీతామృతోపదేశాన్ని అధ్యయనం చేయటానికీ పొందటానికి 'అధికారి' ఎవరు? అని మనంకూడ విచారణ చేసుకొన్నట్లయితే, ఒక్కసారి చరిత్రను పరిశీలించుకుందాం.

పరిశీలిస్తే ఈ గీతామృతాన్ని ప్రాథమికంగా విన్నది అర్జునుడు. ఎందుకంటే పరమాత్మ అర్జునుణ్ణి ఉద్దేశించి, ఈ గీతామృతాన్ని ఉపదేశించాడు.

కేవలం అర్జునుడు మాత్రమే కాదు, ఈ గీతామృతాన్ని రథంమీద ధ్వజంపైనున్న అంజనేయస్వామి కూడా విన్నారు. అదీ ప్రత్యక్షంగా విన్నారు, ఇంతేకాదు భగవంతుడు యొక్క లీలలన్నింటిని ముఖ్యంగా యోగ నేత్రాలతో గమనిస్తున్నటు వంటి వేదవ్యాసమహర్షి గూడ స్వచ్ఛంగా విన్నాడు. ఆ వేదవ్యాస మహర్షి యొక్క అనుగ్రహంతో భగవంతుడి ఉపదేశాన్ని పొంద గలిగిన యోగ్యత కలిగిన సంజయుడు కూడ విన్నాడు. ఆ సంజయుడు ద్వారా ధృతరాష్ట్రుడు కూడ విన్నాడు. కాబట్టి ఒకే ఉపదేశాన్ని ఇంతమంది విన్నారు.

ఇది మనకు చరిత్ర. ఇంతే కాకుండ అనేక మంది మహర్షులు, సిద్ధులు, యోగులు, మహర్షులు పరమాత్మ యొక్క లీలావినోదాన్ని ఉపదేశాన్ని ఎప్పుడిస్తాడా ఎప్పుడిస్తాడా అని ఎదురు చూస్తూ వారు కూడ సూక్ష్మరూపాల్లో వింటూ వచ్చారు, కాబట్టి ఉపదేశకాలంలోనే అనేకమంది ఈ ఉప దేశాన్ని సంగ్రహించారు. కాబట్టి ఇది కేవలం అర్జునుణ్ణి మాత్రమే ఉద్దేశించి చేసిన ఉపదేశంకాదు.

అయితే, ఎవరు విన్నారో వారికే కదా ఉపదేశం చేసినట్లు అంటే, కాదు ఆ వినే వాళ్ళను ఎంపిక చేసుకోవటంలో పరమాత్మ చాలా నైపుణ్యాన్ని ఉపయోగించాడు, ప్రదర్శించాడు అని మనకు అర్థం అవుతుంది.

వీరిలో మొదలు విన్నది అర్జునుడు. ఆయన యోగ్యుడు. పరమాత్మకు అత్యంత ప్రియుడు. పరమాత్మకు ఏ రకంగా ప్రీతి కలగాలో అన్నిరకాలుగానూ ప్రీతిని సంపా



దించుకున్నాడు. ఆయనకు భక్తుడు, సఖ, స్నేహితుడు, బంధువు కూడాను. కాబట్టి ఆయన విషయం ప్రక్కనపెడదాం.

రెండవది ధ్వజం మీద ఉండి విన్నటువంటి ఆంజ నేయస్వామి వారి పరమభక్తుడు. కాబట్టి భక్తులు వినవచ్చు అని ఒక కేటగిరిని పరమాత్మ నిరూపిస్తున్నాడు.

ఇంతేకాకుండ వేదవ్యాస మహర్షి దీనిని విన్నాడను కుందాం. వేదవ్యాసమహర్షి పరమోత్కృష్టమైన తత్త్వజ్ఞాని. కాబట్టి తత్త్వజ్ఞానులు కూడ దీనిని వినవచ్చు. తత్త్వజ్ఞానం కోసం ప్రయత్నం చేసుకునే వారు కూడ దీనిని వినవచ్చు అని ఆ కేటగిరీని కూడా సూచిస్తున్నాడు.

తత్త్వజ్ఞానంలేదు. మాకు భక్తీలేదు, అర్జునుడి లాంటి యోగ్యతాలేదు, మాకు భగవద్గీత అక్కరలేదు అనుకునే వారి కోసం ఇంకా రెండు పాత్రలు ప్రవేశపెట్టాడు అది సంజయుడు, ధృతరాష్ట్రుడు.

సంజయుడనేవాడు ఒక సామాన్యసాధకుడు. ఇంద్రియ నిగ్రహం కోసం ప్రయత్నం చేస్తూ, ఇంద్రియ నిగ్రహంలో కాస్త పై మెట్టుకి ఎదిగి తత్త్వజ్ఞానం ఎలా వస్తుంది అని ప్రయత్నం చేసుకుంటున్నవాడు. ఆశపడుతున్నవాడు. అటువంటి సంజ యునికి కూడా ఈ గీతామృతాన్ని వినిపించడంద్వారా సాక్షాత్తుగా కాకపోయినా యోగబలంతో వినిపించడం ద్వారా పరమాత్మ సాధారణ సాధకులు కూడ దీనిని వినవచ్చు అని సూచన చేస్తున్నాడు.

ఇంతేకాదు చివరికి అంధుడు. ఏ మాత్రం సద్గుణాలు మనకి కనిపించని వాడు, పుత్రవ్యామోహంతో కొట్టుమిట్టాడు తున్నవాడు, కేవలం చర్మచక్షుస్సులే కాదు మనస్సు అనే చక్షుస్సు కూడ పని చేయనివాడు, మనోనేత్రం కూడ పని చేయనివాడు ధృతరాష్ట్రుడు. ఆ ధృతరాష్ట్రునికి గూడ వినిపించాడు.

ఏ మాత్రం యోగ్యత లేని వాడైన సరే ఈ ఉపదేశాన్ని వినవలసిందే. సమస్త మానవాళికి ఈ ఉపదేశం అందవల సిందే అని పరమాత్మ ఈ రకంగా మనకు సూచన చేస్తున్నాడు.

ఇంకో రకంగా ఆలోచించుకుంటే సంజయుడు అనే వాడు సేవకుడు. సేవా వృత్తిలో ఉన్నవాడు అటువంటి సేవా వృత్తిలో వున్నటువంటి వారికి వినిపించడం ద్వారా గ్రాస్‌రూట్ మేనేజమెంట్ (క్రిందిస్థాయి) ఉన్నవారికి కూడా ఈ గీతామృతం పనికివస్తుందని సూచన చేస్తున్నాడు. *(ఇంకా ఉంది)*

## మంచి అలవాట్లు...

'శరీర మాద్యం ఖలు ధర్మ సాధనం' అని పెద్దలు చెబుతారు. ధర్మాన్ని సాధించాలంటే తొలుత శరీరాన్ని చక్కగా ఉంచుకోవాలి. మనస్సు నిర్మలంగా ఉన్నప్పుడే శరీరం కూడా బాగుంటుంది.

ఉదయం నిద్రలేచిన వెంటనే ఎదురుగా ఉన్న దేవుడి పటానికి నమస్కరించుకొని, రెండు చేతుల్ని రుద్దుకొని, కళ్లు నులువుకొని ఇలా చెప్పుకోవాలి.

కరాగ్రే వసతే లక్ష్మీః కరమధ్యే సరస్వతీ।
కరమూలే స్థితా గౌరీ ప్రభాతే కరదర్శనమ్॥

వేళ్ల చివరన లక్ష్మీదేవి, అరచేతిలో సరస్వతీ దేవి, చేతి మొదట్లో గౌరీదేవి నెలవై ఉంటారు. అంచేత ఉదయం లేవటంతోనే ఆ ముగ్గురమ్మలను చేతిలో చూసుకోవాలి. చేతులతో పని చేస్తాం. పనిలేనిది ఏమి సాధించ లేము. ఆ పనికి విద్యకావాలి (సరస్వతి). చేయడానికి శక్తి కావాలి (పార్వతి). దీని ద్వారా జీవితంలో విజయం పొందాలి (లక్ష్మి). ఈ భావనతో నిద్రలేవమన్నారు పెద్దలు. అలాగే ఇష్టదైవాన్ని తలుచుకొంటూ లేచి అమ్మా నాన్నలకు పాదనమస్కారం చేసినవారికి రోజంతా విజయంగానే ఉంటుంది.

# పాపపుణ్యాల విచక్షణ

- డా॥ లక్ష్మీనారాయణమూర్తి

**పుణ్యస్య ఫలమిచ్ఛంతి పుణ్యం నేచ్ఛంతి మానవాః।**
**న పాపఫలమిచ్ఛంతి పాపం కుర్వంతి యత్నతః॥**

"మానవులు ఎలాంటి పుణ్యకార్యాలనూ చేయడానికి ఇష్టపడరు. కాని, పుణ్యఫలాన్ని మాత్రం ఆశిస్తారు. పాప ఫలితాన్ని ఆశించరు. అయినా, పాపకార్యాలను మాత్రం ప్రయత్న పూర్వకంగానే చేస్తారు" అని ఈ శ్లోక సారాంశం. మానవనైజాన్ని ఎంత చక్కగా ఒక్క ముక్కలో చెప్పారో కదా!

ఇంతకీ పుణ్యమంటే ఏమిటి? పాపమంటే ఏమిటి?

దీనికి ఒక్క ముక్కలోనే ఉంది సమాధానం-

***"పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనమ్"*** అని.


పూర్వజన్మల్లో చేసిన పాపదోషాలవల్లనే ఈ జన్మలో శారీరక, మానసిక వ్యాధులు పీడిస్తున్నాయని మనం గ్రహించాలి. పాపం వల్లనే దుఃఖాలు వస్తాయి. పాపము లేనప్పుడే ఆనందం కలుగుతుంది.

కాస్త దుఃఖం కలిగినా అది పాప ఫలితమే తప్ప వేరు కాదు! అనుభవించనిదే పాపదోషం నశించదు!

కనుక బాధలు, దుఃఖాలు నివారించబడాలంటే... ఈ జన్మలో పాపాలు చేయకుండా ఉండాలి. దానధర్మాలు చేయాలి, భగవన్నామస్మరణలోనే ఎక్కువ కాలాన్ని గడిపేందుకు ప్రయత్నించాలి.

అడవిలో, యుద్ధంలో, శత్రువుల మధ్య, నీటి మధ్య, అగ్నిమధ్య ఉన్నపుడు, సముద్రంలో సాగుతున్నపుడు, పర్వత శిఖరారోహణలో, నిద్రలో, అజాగ్రత్తలో, సంకటపరిస్థితుల్లో మానవుడిని తాను పూర్వజన్మలోచేసిన పుణ్యాలే కాపాడుతాయి.





***"ఒరులేయవి యొనరించిన..... పరాయణము పరమ ధర్మ పథములకెల్లన్."*** - అని నన్నయ మహాభారతం ద్వారా మనకు చెప్పిన విషయాన్ని మనం ఒంట పట్టించుకున్నా చాలు. ఇతరులు తనయందు ఏ విధంగా ప్రవర్తిస్తే తన మనస్సు కలత చెందుతుందో, అదేవిధమైన ప్రవర్తనను ఇతరులయందు నీవు కలిగియుండకుండుటయే అన్ని ధర్మములలోకీ కూడా ఉత్తమ మైన ధర్మము అన్నారాయన!

పుణ్యం చేయడం చేతకాకున్నప్పటికీ ఈ ధర్మాన్ని ఆచరిస్తే చాలు!


ఈ ప్రపంచంలో సుఖాన్ని గానీ, దుఃఖాన్ని గానీ ఒకరికి ఇంకొకరు ఇవ్వరు. తాను చేసిన పాపకర్మవల్లనే దుఃఖం కలుగుతుంది. తాను చేసిన పుణ్యకర్మవల్లనే సుఖము కలుగుతుంది. ఈనాడు నవ్వుతూ చేసిన పాపకర్మకి రేపు ఏడుస్తూ దుఃఖాన్ని అనుభవించక తప్పదనే సత్యాన్ని మనం గ్రహించవలసి ఉంది.

తాను చేసిన పుణ్యఫలం వల్లనే ఉత్తములైన పుత్రులు, మంచి స్నేహితులు, తగిన భార్య లభిస్తుందంటాడు భర్తృహరి.

భక్తితో తండ్రిని పూజించి ఆయన మెప్పును పొందిన వాడే నిజమైన పుత్రుడు. భర్త సుఖాన్ని మనః పూర్వకంగా కోరే స్త్రీయే నిజమైన భార్య. కష్ట సుఖాల్లో సమమైన ఆదరణతో స్నేహం చేసే వాడే నిజమైన స్నేహితుడు. అయితే ఈ ముప్వురు కూడా తాను చేసిన పాపానికి, పుణ్యానికి ప్రతీకలే గనుక అత్యధిక పుణ్యం చేసుకున్న భాగ్యశాలురకే ఇలాంటి ముప్వురు గుణవంతులు లభిస్తారు. దోషం తనదే కాని వారిది కాదని భావం!



భగవంతుడు మనకిచ్చిన వివేకాన్ని ప్రదర్శించి కాస్త నిదానంగా ఆత్మ విమర్శ చేసుకుంటూ ఆలోచిస్తే సరిపోతుంది. వివేకాన్ని మించిన గురువు లేడు. వివేకం యొక్క ఆశయం కేవలం మంచి విషయాల్ని తెలుసుకోవడం, మంచి మాటల్ని వినడం, ఆచరించడం, ఎవర్నీ అడగాల్సిన అవసరం లేదు. ఎక్కడా చదవాల్సిన అవసరమూ లేదు. స్వయంగానే మనమంతా నిర్ణయం తీసుకో గలిగిన శక్తివంతులం. భగవంతుడిచ్చిన ఆ శక్తిని సదుపయోగంలోకి తేవాలి. అదే మన ఏకైక కర్తవ్యం కావాలి.



చెడు చేయడం పాపం. మంచి చేయడం పుణ్యం. మంచి చేయకపోయినా చెడు చేయకుండా ఉన్నా చాలు. 'చేసిన పాపమైనా, పుణ్యమైనా చెబితేపోతుంది' అంటారు. చేసిన పాపాన్ని చెబుతామా! చెప్పం. ఎవరైనా బహిర్గతపరచినా కాదని బుకాయిస్తాం. అంటే పాపాన్ని భద్రంగా దాచుకుని పెంచి పోషిస్తామన్నమాట! మరి పుణ్యం సంగతో! చేసింది ఎలాగూ చెబుతాం. చేయని పుణ్యాన్ని కూడా చేసినట్లుగా వర్ణించి ఎదుటి వాళ్ళకి చాటుతాం. చేసిన పుణ్యం చెప్పటంతోటే పోతున్నది. చేయని దాన్ని చెబుతాం కనుక మరింత పాపాన్ని మూట గట్టుకుంటాం. ఫలితంగా పుణ్యకార్యాల పరంగా కూడా పాపాన్నే ప్రోగు చేసుకుంటున్నామన్న మాట! ఎందుకిలా చేస్తున్నాం? వివేకాన్ని ఉపయోగించకపోవడం వల్లనే ఇలా జరుగుతున్నది.



'జీవితంలో భయంచేతగానీ, ప్రలోభంవల్లగానీ ఎవరికీ, ఎప్పుడూ, ఎలాంటి చెడునూ చేయను' అనీ, 'గతంలో చేసిన చెడును పునరావృతం కానివ్వను' అనీ ప్రతిజ్ఞ చేయండి. ఇలా ప్రతిజ్ఞ చేయడమంటే భగవంతుడు ప్రసాదించిన వివేకము అనే గురువు ఆజ్ఞని శిరసావహించడమన్న మాటే! ఇదే జీవన మూలసాధన!

ఈ సాధనను మీరు మీ కుటుంబంతోనే ఆరంభించండి. బంధుమిత్రులతో మొదలు పెట్టి మీతో పరిచయమున్న ప్రతీ వారి విషయంలోనూ కొనసాగించండి. అప్పుడు మీ జీవితం ఎంత ఆనంద భరితంగా ఉంటుందో మీరే ఆశ్చర్యపోతారు!

మీ పట్ల ఇతరుల ప్రవర్తనలో ఏవేవి మీకు మంచిగా కనిపించవో అవే చెడులు! నిరాదరణ, తిరస్కారం, ఇతరుల సంపదపైన హక్కు చలాయించడం వంటివన్నీ కంటికి కనిపించే చెడులే! మమత, కాంక్ష, భౌతిక విషయాలపట్ల ఆకర్షణ వంటివి సూక్ష్మరూపంలో ఉండే చెడులు! స్వయం విమర్శద్వారా మాత్రమే వీటిని మనం కనుక్కోగలుగుతాము. అభిమానం, అహంకారం, మౌనంగా ఉంటూనే చెడును చేసే ప్రయత్నం చేయడం సూక్ష్మాతిసూక్ష్మమైన చెడులు. ఏ క్షణంలోనైతే మీరు 'చెడును చేయను' అనే శపథాన్ని తీసుకున్నారో ఆ క్షణం నుండి వీటన్నింటిపట్ల బహు జాగరూకులై ఉండక తప్పదు!



భగవంతుడిచ్చిన శక్తినీ, యుక్తినీ ఉపయోగించుకుని సాధ్యమైనంత ఎక్కువగా ఇతరులకు మేలుచేసే ప్రయత్నం చేద్దాం. అదే పుణ్యం. అదే మన జీవనపరమార్థం. ఎవరికీ కీడు తలపెట్టవద్దు. అది పాపం. దాన్ని దరి జేర నీయవద్దు.



అహంకారం వల్ల అతిశయమేర్పడుతుంది



# హరిదాస వాఙ్మయంలో...
# శ్రీవేంకటాచలాధీశుడు

- శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు

*గత సంచిక తరువాయి భాగం...*

పురందరదాసులవారికి అంతరంగ బహిరంగములు శ్రీనివాసుడే. కన్నులు మూసిన తెరచిన ఆతని దివ్యమంగళ విగ్రహదర్శనమే. ఆ దర్శనముచే పులకించిపోయిన దాసుల వారు దిగ్గున లేచి కూర్చొని అక్కడున్న వారితో మైమరచి ఆ స్వామి సౌందర్యాన్ని వర్ణించేవారు. చూడండి.

**"కనసు కండెనె మనదల్లి కళవళ గొండెనె ।**
**ఏనుహేళలి తంగి తిమ్మయ్యన పాదవను కండె ॥**

(కలగంటిని, మనసులో ఆతని కళలను గ్రహించితిని. ఎంతని వర్ణించి చెప్పను? ఆ తిరుమలేశుని పాదములను చూచి తిని, అని స్వామి యొక్క ఆపాద మస్తక మంగళ సౌందర్యా లంకార విగ్రహమును పై కృతిలోని భావమే వచ్చేటట్లు వర్ణించినారు).

ఒకమారు కాకుండా పలుమార్లు స్వామి దివ్యమంగళ మూర్తిని గాంచిన పురందరదాసులవారు *'కండెనా కనసినలి గోవిందన'* అని పై భావమునే వ్యక్తీకరించారు. అంతేకాక శ్రీని వాసుని వాత్సల్యముతో తండ్రి లేదా తల్లి పసివాణ్ణి పిలిచేటట్లు నాడు గోకులంలో యశోద బాలకృష్ణుని పిలిచినట్లు భక్తి పార వశ్యంతో *'ఓడి బారయ్య వేంకటపతి నిన్న నోడువె మనదణియ'* పరుగెత్తుకొని రావయ్య వేంకటపతి! శ్రీకృష్ణుడుగా నాడు గోకులంలో గజ్జెలనాదంతో ఆడినట్లు ఆడుతూ రావయ్యా నిన్నలంకరిస్తాను. తినుటకు కావలసిన తినుభండారములనిస్తా నని అంటారు. అంతే దీనులై స్వామి దయావర్షాన్నపేక్షించేవారై ఆధ్యాత్మికభావంతో కూడ శ్రీస్వామివారిని స్తుతించినారు. (ఆనందభైరవి).

**"శ్రీనివాస నీనె పాలిసో । శ్రితజనపాల ।**
**గానలోల శ్రీముకుందనె ।**
**ధ్యానమాళ్ప సజ్జనర మానదిం పరిపాలిప**
**వేణుగోపాల గోవింద వేదవేద్య నిత్యానంద ॥**

(శ్రీనివాస నీవే నన్ను కాపాడవయ్య. నీవు ఆశ్రిత జన పాలకుడవు. గానలోలుడవు. శ్రీముకుందుడవు. ధ్యానించే సజ్జనుల యొక్క అభిమానమును కాపాడే వేణుగోపాలుడవైన గోవిందుడవు, వేదవేద్యుడవు. నిత్యానందుడవు).

**"అనుదిన అనేక రోగగళ । అనుభవిసువెనో**
**ఘన మహిమ నీనె బల్లెయా ।**
**తను వినలి బలవిల్ల నెనెద మాత్ర సలహువ**
**హనుమదీశ పురందర విఠల నీనె ఒలిదు ॥**

(ఉత్తమమైన ఈ మానవ జన్మము వచ్చిన తర్వాత కూడ నిన్ను ముట్టి భజించక కష్టాలపాలైన నన్ను రక్షించు స్వామి. ఏ నాటికి నీ పాదాలనాశ్రయించి, చూచి పూజించే భాగ్యము కల్గుతుంది స్వామి? అంధకారణ్యము నిలబడి దిక్కు కానక పరితపించే నా ముందు అందముగా వచ్చి నిలబడుము. స్వామీ! అనుదినమును అనేక రోగములననుభవించే నన్ను నీవు చూడలేవా స్వామీ. హే ఘనమహిమా! నా తనువు నందుబలము సన్నగిల్లినది. తలచినంత మాత్రము వచ్చి కాపాడే పురందర విఠలుడా రమ్ము. కాపాడుము స్వామీ).

నవవిధభక్తిలో ఒకటైన ఆత్మనివేదనమును చేసు కొంటూ *'నా నేనుమాడిదెనో వేంకటరాయ। నీనెన్న సలహబేకు॥'* నేను చేసిన అపరాధమేమున్నది స్వామి? నన్ను నీవే కాపాడుము అని అంటూ గజ, ధ్రువ, ప్రహ్లాద, ద్రౌపదులను ఉదహరించి వారిని కాపాడినట్లు కాపాడమంటారు. ఒకవేళ నీ దృష్టిలో నేను తప్పునే చేసినవాడినైన నా తప్పులు స్వీకరించి మన్నించి కాపాడమని *'తప్పు గళెల నీ నొప్పికొళ్ళొ నమ్మప్పకాయో'* అని అంటూ సదాచారవంతుడనై నీ భక్తుడనై నీ యొక్క నీ భక్తుల యొక్క సేవలను చేయలేకపోయిన నన్ను క్షమించమని *'అష్టాదరు ఎన్నవ గుణఎణిసదే। సత్సంకల్ప తిమ్మప్పనీను'* అని అంటారు.

సౌజన్యము, సౌశీల్యము నిరహంకారులు అయిన పురందర దాసులవారు ఈ పాటచివరిలో –

"ఎష్టు హేళలి అవగుణగళెల్ల । అవు ।
ఇష్టు అష్టు ఎందు ఎణికె యిల్ల ।
దృష్టియిందలి నోడు దీనవత్సల । సర్వ ।
సృష్టి గొడెయ పురందర విఠల ॥

నా తప్పులు ఇంతంత కాదు, లెక్కించుటకు వీలులేనిది, దృష్టితో చూచి కాపాడు *(అపరాధ సహస్రాణి క్రియంతేఽహర్నిశం మయాం)* 'న మే భక్త ప్రణశ్యతి' భగవంతుని నమ్మిన వారికి నాశము లేదు. భగవంతుడైన శ్రీవేంకటేశుని నమ్మిన వారికి దురితముల భయములేదని దృష్టాంత పూర్వకముగా పురందరదాసుల వారు వేంకటేశ్వరుని యందున్న భక్తిని ఇట్లు ప్రకటించుతారు.

"వేంకటరమణ వేదాంతనిన్న యపాద పంకజకండమేలె ।
మంకు మానవర బేడి సువుదుచి తవే । శంఖ చక్రాంకితనె॥



(వేంకటరమణా వేదాంతవేద్యా! నీ పాదపంకజము లను చూచిన తర్వాత కూడ అల్పులను అర్థించేటట్లు చేయడము ఉచితమా?)

క్షీర సాగరవ పొందిదవ మథిసిద । నీరుమజ్జిగె కాణనె ।
చారు కల్పవృక్ష దడియలికుళితవగె । దొరె తింత్రిణి బయకేయె॥

సార్వభూపాలన సూను ఎందెని సిదవగె । సూరె గూళిన తిరుకె ।
నారి లక్ష్మీకాంత నిన్న పొందిదవగె । దారిద్ర్య దట్టుళియె ॥

సుర నదియలిమిందు శుచి యాదమేలిన్ను దురితగళట్టుళియె ।
పరమ పురుష నిన్న పొందిర్దదాసర్గె అరిగళ భీతియుంటే ॥

గరుడన మంత్రవ కలితుజపిసువగె । ఉరగన హావళియె ।
హరి పక్కదొళుమనె కట్టిదనరనిగె । కరిగళ భీతియుంటే ॥

పరమ పురుష గుణ పూర్ణ నీనహుందేందు
మొరెహొక్కెకాయో ఎన్న!
ఉరగాద్రివాస శ్రీపురందర విఠల । పరబ్రహ్మనారాయణ ॥

క్షీరసాగరమునాశ్రయించినవాడు నీళ్ళ మజ్జిగను కోరునా? కల్పవృక్షపు ఛాయలలో కూర్చున్నవాడు చింతపండును ఇష్టపడునా? సార్వభౌముని పుత్రుడు భిక్షాన్నమును పట్టునా? లక్ష్మీపతీ! నిన్నాశ్రయించినవానికి దారిద్ర్యపు భయమా? సుర నదియందు మునిగిన వానికి పాపములు తిరిగి సంభవించునా? గరుడమంత్రాన్ని జపించేవానికి పాముల భయముండునా? సింహము ప్రక్కన ఇల్లు కట్టినవానికి ఏనుగుల భయముండునా? పరమపురుషా! గుణపరిపూర్ణుడని తెలిసుకొని నీకు శరణాగతుడైన నన్ను కాపాడవయ్యా! ఉరగాద్రివాస! శ్రీపురందర! విఠల! పరబ్రహ్మ! నారాయణ! కాపాడుము.

*'బ్రహ్మరుద్రాది వంద్యంతం భజే వేంకటనాయకం'* అనే శ్లోకపాదాన్ని అట్లే అనుసరించుచూ *'బ్రహ్మ శంకరాది వంద్య ఎనగె ముక్తి కరుణిసో, వేంకటేశ బేడికొంచెకృపెయ పాలిసో'* 'వేంకటేశ నిన్ను వేడుకుంటున్నాను. నాపై కృపను చేయవయ్యా' అని అంటూ, సార్వభౌముడవైన, ఈశుడవైన నీవు నీచే కరుణతో, ఇవ్వబడినది మహాప్రసాదంగా స్వీకరిస్తానని అంటారు. 'తేన త్యక్తేన భుంజీత' పురందరదాసులవారి కీర్తనలలో శ్రీవేంకటేశ్వరస్వామికి సంబంధించిన 'సింధుభైరవి' రాగంలోని *'వేంకటాచల నిలయం వైకుంఠపురవాసం, పంకజనేత్రం పరమ పవిత్రం. శంఖచక్రధర చిన్మయరూపం'* అనేది ఎంతో ప్రసిద్ధమైనది. ఇంచుమించు సంగీత విద్వాంసులు తమ కచేరిలలో తప్పకుండా

పాడుతూనే ఉంటారు. అలాగే 'వేంకట రమణనె బారో శేషాచలవాసనె బారో', 'వేణునాద బారో వేంకట రమణనే బారో' అనే ఈ రెండింటిని భజన బృందములవారు విధిగా పాడుతూనే ఉంటారు.

ఖరహరప్రియ రాగంలోని *'తిరుపతి వేంకటరమణ నినగేతకె బారదు కరుణ'* అనే కీర్తన 15 చరణములతో కూడి చక్కగా అంత్యానుప్రాసాక్షరాలతో కూడినది. శ్రీనివాసుని గుణగానముతోపాటు, ఆ స్వామిని కొలిచే మార్గమును ఇందులో తెల్పియున్నారు. పాట చివరిలో *'పాప వినాశిని స్నాన। హరి। పాదోదకవె పాన। కోపతాప గళ నిధాన। నమ్మ పురందర విఠలన ధ్యాన'* పాపవినాశన మందలి స్నానము, హరిపాదోదక పానము, కోపతాపముల నిదానమును ప్రబోధించినారు. *'నోడు నోడు వేంకటేశనోడు నోటవ। అవను ఆడువాటవ బేటిగాగి హోరటు బంద ప్రఖ్యాతవ'* అనే 74 చరణములు గలిగిన ఈ కీర్తన వేంకటేశ పురాణమందు శ్రీనివాసుడు ధనుర్బాణపాణియై, కిరాత వేషధారియై, గుఱ్ఱము పైకి ఎక్కి వేటకు వెళ్లి పద్మావతిని చూచి వచ్చిన వృత్తాంతమంతా వర్ణించారు. ఇది ఇంచుమించు అంత్యానుప్రాసను గలిగి ఉన్నది. ఈ పాటలోని చివరి చరణము *'స్వామి వేంకటేశ తాను బేటిమాడిద। స్వామి బేటిమాడిద। అప్ప వేంకటేశ తాను ఒప్పి దిందలే। స్వామి గిరిగె బందు శ్రీపురందర విఠల నెందు హోగె నిందనె స్వామి హోగె నిందనె॥'*

పురందరదాసుల వారి వేంకటేశస్తుతి కృతులలో 'వేంకటేశ' మంత్రానికి సంబంధించిన ఒక కీర్తన మంత్రమునకు విశాలార్థమును తెలుపుతున్నాయి. ఆదిత్య, భవిష్యోత్తర, గరుడ పురాణాదులలో వేంకటేశ శబ్దమునకు అర్థమును చెప్పబడి నట్లుగానే దాసులవారు తమ ఈ కీర్తనలో వేదశాస్త్ర పురాణముల నుండి ఏర్చి కూర్చి నాలుగు అక్షరములను ఎన్నో విధాలుగా వర్ణించి చెప్పినారు.

"వేంకటేశ నిన్న నామక్కె మొదలు నాకక్షరగళు నోడో ॥
బింక వాద నాల్కు వేద శాస్త్ర పురాణ గళదరింద ॥

అని పల్లవిని ప్రారంభించి 'వేం'– అను అక్షరములకు అర్థమును మత్స్య, కూర్మ, వరాహ, నారసింహావతారములను వర్ణించి చెప్పినారు. 'క'– అను అక్షరమునకు వామన, పరశురామ, రామకృష్ణ అవతారములను వర్ణించి చెప్పినారు. 'టే'– అను అక్షరమునకు బుద్ధ, కల్కి అవతారములను మరియు లక్ష్మీదేవిని వక్షఃస్థలమున నిలిపిన దానిని వర్ణించి చెప్పినారు. 'శ'– అను అక్షరమునకు

'శాకద తుది యల్లి శాంత పాండవరు ద్రౌపదివాస
వాస శ్యామసుందర శరణు సజ్జన గురుచంద్ర భాస ।
శామ సహిత బహుముక్తియ పొందిద రుక్మాంద పోష
శాశ్వత సలహోవ పురందర విఠల కలియుగ వేంకటేశ ॥

భారత భాగవతాది ఇతిహాస పురాణములలోని అర్థము లనే చెప్పియున్నారు. లక్షలాది కీర్తనలలో అసంఖ్యాకకీర్తనలు శ్రీనివాసుని స్తుతి రూపములు మాహాత్మ్య వర్ణనములు గల కీర్తనములున్నప్పటికిని అవన్నియు నేడు అలభ్యములు. దొరి కినవన్నియు సమకూర్చి విశ్లేషించిన గ్రంథవిస్తారమగు ననుభయమువలన త్రికరణశుద్ధికై ఈ దాసశ్రేష్ఠుల శ్రీనివాస కీర్తనలను మచ్చునకు కొన్ని మాత్రమే ఉదాహరించి విశ్లేషించుట జరిగినది.

*(ఇంకా ఉంది)*



**తిరుమల వచ్చే యాత్రికులు శ్రీవారి దర్శనానికి ముందుగా పుష్కరిణి వద్ద ఉన్న శ్రీవరాహస్వామి వారిని దర్శించాలి. ఇది సంప్రదాయం.**

## భర్తృహరి సుభాషితం

విపది ధైర్య మథాభ్యుదయే క్షమా
సదసి వాక్పటుతా యుధి విక్రమః।
యశసి చాభిరతి ర్వ్యసనం శ్రుతౌ
ప్రకృతిసిద్ధ మిదం హి మహాత్మనామ్ ॥

**ఆపద కల్గినప్పుడు ధైర్యమూ, ఐశ్వర్యం వచ్చినప్పుడు ఓర్పూ, సభలో వాగ్నైపుణ్యమూ, యుద్ధంలో పరాక్రమమూ, కీర్తిపై కోరికా, వేదాభ్యాసంపై ఆసక్తి - ఇవి మహాత్ములకు సహజ గుణాలు.**

– శ్రీ సముద్రాల లక్ష్మణయ్య

# 'భగినీ హస్త భోజనం'
## సప్తజన్మకృత పాపహరం

– శ్రీమతి కె.నాగవేణి

కార్తికేతు ద్వితీయాం యా శుక్లాయాం భ్రాతృపూజనమ్।
యే న కుర్యాత్ వినశ్యంతి భ్రాతరస్సప్తజన్మసు॥

–లింగపురాణం.

అంటే కార్తికమాసం శుద్ధ విదియనాడు భ్రాతృపూజ చేసిన సోదరికి, సోదరి (భగినీ) హస్తభోజనం చేసినవారికి ఏడు జన్మల పాపాలు హరిస్తాయని భావం. ఈ రోజు సోదరి, సోదరుని తన ఇంటికి పిలిచి, స్వహస్తాలతో పిండివంటలను తయారు చేసి, అతనికి వడ్డించడం విశేషం. ఈ భ్రాతృవిదియ వైశిష్ట్యం గురించి ఒక పురాణగాథ కలదు.

### పురాణగాథ

యమున పవిత్రమైన త్రివేణులలో ఒక నది. ఆమె సోదరుడు యమధర్మరాజు. వీరి తల్లిదండ్రులు– సంజ్ఞాదేవి, సూర్యభగవానుడు. సూర్యభగవానుని తేజాన్ని భరించలేని సంజ్ఞా దేవి అతని దగ్గరికి చేరేసరికి, కనులు మూసుకున్నది. ఆదిత్యుడు కోపగించి "నన్ను చూసి కళ్లుమూసుకున్నావు. కాబట్టి అందరికళ్లు మూయించేవాడు నీకు కుమారుడుగా జన్మిస్తాడు" అని శపించాడు. ఆ శాపఫలితంగా జన్మించినవాడే యమధర్మ రాజు. సమవర్తియై కాలం తీరిపోయిన వారందరి ప్రాణాలు హరిస్తూ తీరికలేని పనిలో మునిగి ఉంటాడు యముడు. మరొక సమయంలో సంజ్ఞాదేవి దగ్గరికి సూర్యుడురాగా, ఆమె బెదిరి అటు ఇటు సదలింది. సూర్యుడు ఈ సారి కూడా 'చంచలమైన నడకలు కలిగిన కూతురు జన్మిస్తుందని' శపించాడు. ఆ శాప ఫలమే యమున అనే కూతురు జన్మించింది.

తన కుమార్తె సంజ్ఞాదేవి ప్రతిసారీ సూర్యుని తాపం భరించలేక శాపాలపాలు కావడం, ఆమె తండ్రి విశ్వకర్మ (దేవశిల్పి) చూశాడు. లోకాలకు హాని కలుగకుండా, కుమార్తెకు మాత్రమే ఉపయోగపడే విధంగా, సూర్యతేజాన్ని తగ్గించి, ఇద్దరిని దగ్గర చేశాడు విశ్వకర్మ. శాంతించిన సూర్యుడు కుమార్తె విషయంలో శాపాన్ని మార్చి, లోకుల పాపాలను హరింపజేసే పవిత్రమైన నదిగా పూజలందుకుంటుందని శాపాన్ని సడలించాడు. ఆ పనిలో తన కూతురు యమున నిమగ్నమై తీరిక లేకుండా ఉంటుంది. ఫలితంగా అన్నాచెల్లెళ్లు (యముడు, యమున) కలుసుకునే అవకాశం లేకపోయింది.

అయినప్పటికి, అనేకసార్లు తన అన్న యముడిని, తన ఇంటికి రమ్మని ఆహ్వానించింది యమున. ఎన్నోమార్లు పిలువగా, కార్తికమాసం శుక్లపక్ష విదియరోజున, తీరిక చేసుకుని, యమున ఇంటికి వెళ్లాడు యముడు. అదే 'భ్రాతృ విదియ దినము'. రాకరాక అన్నయ్య వచ్చిన ఆ దినాన్ని యమున పర్వదినంగా భావించింది. ఆ ఆనందంలో యమున అతిథిమర్యాదలు చేసి, పిండివంటలు స్వయంగా చేసి, యమధర్మరాజుకు వడ్డించింది.

అంటే ఈ కార్తికశుద్ధవిదియ రోజున యముడు– తన చెల్లెలైన యమున చేతి భోజనం చేశాడు, కాబట్టి, ఈనాడు యమ ద్వితీయ పర్వదినంగా జరుపుకుంటాం. సంతోషించిన యముడు, చెల్లెల్ని ఏదైనా ఒక వరాన్ని కోరుకోమన్నాడు. అప్పుడు యమున 'నీవు నా ఇంటికి వచ్చి భోజనం చేసిన

### వైకుంఠపాళి
:: 70 – సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 స | | 2 రా | మా | 3 య | ణ | 4 ము | | 5 అ |
| ప్త | | మ | | శో | | క్తి | | న్న |
| 6 గి | ర | | 7 శో | ధ | ని | | 8 ఉ | మ |
| రి | | 9 అ | | ర | | 10 శుం | | య్య |
| | 11 స్ర | వం | తి | | 12 నృ | గు | డు | |
| 13 ల | | తి | | 14 అ | | డు | | 15 అం |
| 16 పి | త | | 17 క | లి | మి | | 18 వం | ది |
| త | | 19 అ | | పి | | 20 పా | | య |
| | 21 వ | ల | ము | రి | తా | లు | పు | |




కామక్రోధాలు మోక్షమార్గానికి శత్రువులు

ఈ రోజున, ఏ సోదరుడు తన సోదరితో భోజనం చేస్తాడో, అతడికి అకాలమరణం సంభవించకుండా, పూర్ణాయుష్షును ప్రసాదించమని' కోరింది. ఆమె కోరికకు సంతసించిన యముడు, ప్రతి సంవత్సరం ఈనాడు తన సోదరి చేత వండిన వంటలను తిన్న సోదరుడికి అకాలమరణం, అపమృత్యుభయం ఉండవు. అంతే కాక ఆ సోదరికి సైతం జీవితంలో వైధవ్యం కలుగకుండా సుమంగళిగా ఉండాలని ఆశీర్వదించి వరాన్ని ప్రసాదించాడు.

అస్యాం నిజగృహే .....................
భగినీ హస్తాత్ భోక్తవ్యం పుష్టివర్ధనమ్॥

అని పురాణోక్తి.

అంటే ఈ రోజున సోదరుడు తన ఇంటి భోజనం చేయకుండా సోదరి ఇంటిలో ఆమె వండిన వంటలను భోజనం చేస్తే అది పుష్టిని కలుగజేస్తుంది. పై శ్లోకంలో 'భగినీ హస్తాత్ భోక్తవ్యం' ఎంతో ప్రాముఖ్యం కలిగి ఉంది. ఈ విషయాన్ని సామాజికంగా ఆలోచిస్తే సాధారణంగా సోదరి అనే ఉద్దేశ్యంతో ఆమెకు సోదరుడు ఇవ్వడమే కానీ, ఆమె నుంచి ఏనాడు సోదరులు ఏదీ తీసుకోరు. ఈ కట్టుబాటులో సోదరుల నుంచి ఎప్పుడూ ఏదో ఒకటి తీసుకోవడమే గానీ, ఇచ్చే అవకాశం లేకపోవడంతో ఆ సోదరికి ఆత్మగౌరవానికి లోటు ఏర్పడుతుంది. ఆ స్థితి నుంచి తప్పించడానికే ఈ ఏర్పాట్లు తప్పనిసరి అయినట్లు విశ్లేషకుల ఆలోచన. ఈ విధంగా ఇరువైపుల నుంచి ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉన్నప్పుడే మమతానుబంధాలు, ప్రేమానురాగాలు బలపడతాయి. స్త్రీలకు మానసికబలం, ఆత్మస్థైర్యం కలుగుతుంది.




పూర్వం ఉమ్మడి కుటుంబంలో, కుటుంబసభ్యులందరూ కలసి మెలసి, పండుగ పర్వదినాల్లో ప్రేమతో, ఆప్యాయతతో భోజనం చేసేవారు. ఫలితంగా పరస్పర సంబంధాలు, అనుబంధాలు, శక్తివంతమై సుఖంగా జీవించేవారు.

ఈ రోజులలో యాంత్రిక, కృత్రిమ జీవనవిధానం కలదు. ఫలితంగా కుటుంబంలోని సభ్యులు, కనీసం పండుగ పర్వదినాలలో కలిసి భోజనం చేయడం యాదృచ్ఛికమో, మహదవకాశమో, అదృష్టమో అని అనుకోవాలి. మంచి, మర్యాద, అనురాగం, ఆప్యాయత క్రమేణ సన్నగిల్లిపోతున్నాయి.

'భగినీ' అనేది సంస్కృతపదం. 'బెహన్'గా హిందీ భాషలోకి మారింది. 'భగినీ హస్త భోజనం' అనేది దక్షిణరాష్ట్రాల కంటే ఉత్తర హిందూస్థానంలో ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంది. 'భాయిదుజ్' (సోదరప్రేమ) అని పిలిచే ఈ పర్వదినాన్ని ముఖ్యంగా యమునానది పరీవాహకప్రాంతంలో ఎక్కువ ప్రాముఖ్యత కలిగి ఉంది.

ఈ రోజును పవిత్రదినంగా భావిస్తారు. సోదరునికి భోజనం పెట్టి నూతన వస్త్రాలను, కానుకలను సైతం బహూకరిస్తారు. సోదరీమణులు ఈ దినం యమునానదిలో స్నానం ఆచరించడం వల్ల పుణ్యఫలాలు కల్గుతాయి.



# వేదవాఙ్మయం – వైజ్ఞానిక భూమిక

- కీ.శే. ఆచార్య హెచ్.ఎస్.బ్రహ్మానంద

జ్ఞానాన్ని ప్రాథమిక స్థాయిలో 'విజ్ఞానమ'ని అంటారు. పరిణామ స్థాయిలో 'ప్రజ్ఞానం' అంటారు. దాన్నే ఋషులు ఆత్మవిద్యగా, బ్రహ్మవిద్యగా ఉపనిషత్తులలో పెంపొందించారు.

వేదవాఙ్మయంలో ప్రాపంచికమైన ఆ విజ్ఞానాన్ని పొందటం, విస్తరింపచేసుకోవడం, వినియోగించుకోవడం అన్న మూడు అంశాలు కనిపిస్తాయి. అసలు వేదవిద్యలో మొదటిది సంహితలు. ఇవి మంత్రభాగాలు. శ్లోకరూపాల్లో ఉంటాయి. రెండవది బ్రాహ్మణాలు. ఇవి యజ్ఞ ప్రక్రియను వచనంలో బోధిస్తాయి. బ్రాహ్మణాలకు అనుబంధాలుగా ఆరణ్యకాలు పుట్టాయి. అంటే సిద్ధాంతం– ప్రయోగం అనే విభాగం స్పష్టంగా వేదంలో ఉన్నాయని అర్థం.

వేదాలను అభ్యసించడానికి కొన్ని మౌలిక అవగాహనలు అవసరం. వాటిని వేదాంగాలు అన్నారు. శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం. సాధారణంగా ఇవి సూత్రాల రూపంలో రాయబడ్డాయి. కాలక్రమంలో ఇవి భిన్న శాస్త్రవిభాగాలు అయ్యాయి. కల్పసూత్రాల సమగ్రరూపం ధర్మశాస్త్రమనే పేరు పొందింది. ఈ షడంగాల సంపూర్ణజ్ఞానం చేత వేది (వేదం తెలిసినవారు) అయ్యేవాడు.

వేదాలు మూడు. ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం. నాల్గవ వేదం కాలక్రమంలో పరిణమించింది. దీన్నే అథర్వణ వేదం అంటారు. లోకానికి సంబంధించిన విజ్ఞానమంతా అథర్వణలో ఉన్నాయని సంప్రదాయకమైన భావన. ఇందులో కొంత సత్యం ఉంది.

వేద విద్య అనే మాటను సమగ్రంగా వివరించాలంటే సంహితల నుండి పురాణేతిహాసాల దాకా వ్యాపించిన సర్వ వాఙ్మయాన్నీ ఆధారంగా తీసుకోక తప్పదు. పురాణాలలో అన్ని విద్యలను ఋషులే బోధిస్తూ వచ్చారన్న కథనం కనిపిస్తుంది. వ్యాకరణాన్ని పాణిని రచించాడు. వైద్యాన్ని సుశ్రుతుడు రచించాడు. అర్థశాస్త్రాన్ని కౌటిల్యుడు చెప్పాడు. ఖగోళాన్ని వరాహమిహిరుడు వివరించాడు. వీరందరూ వృత్తిరీత్యా విజ్ఞానులే. ప్రకృతిరీత్యా ఋషులు.

ఈ నేపథ్యం మనసులో ఉంచుకుని వేదాలలోని వైజ్ఞానిక భూమికను మనం అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

వేదవాఙ్మయంలో భూమి శబ్దం ఉంది. దానికి భ్రమణ లక్షణముందని గుర్తించటం చేతనే భూగోళ, భూచక్ర, కుర లయ– ఇత్యాది శబ్దాలను ప్రయోగించారు. తిథి, వార, నక్షత్ర, యోగ, కరణాలనే ఐదు అంగాలను గుర్తించి పంచాంగ కల్పన చేశారు. నిమేష, తృణ, కాష్ఠ కళాది అత్యల్ప కాల విభాగాలను గుర్తించారు. సెకన్ లో ఇంకా సూక్ష్మమైన భేద పరిగణనలు చేశారని కూడా జ్యోతిష్య శాస్త్రవేత్తల ద్వారా తెలుస్తున్నది. సూర్యుని గమనాన్ని బట్టి రాశులలో ఆయన ప్రవేశాన్ని బట్టి ఉత్తరాయణ, దక్షిణాయణాలను, ఋతువులను, మాసాలను; చంద్రుని ఆకారాన్ని బట్టి, కళాస్థాయిని బట్టి శుక్ల కృష్ణ పక్షాలను; గ్రహప్రాధాన్యాన్ని బట్టి వారాలను, తిథులను లెక్కగట్టిన పద్ధతిలో ఎంతో ప్రామాణికత ఉంది. ఆధునిక ఖగోళ, జ్యోతిష పరిశోధనల్లో ఈ లెక్కలకు ఎంతో ప్రాధాన్యం, ప్రాముఖ్యత ఉన్నాయి.

మహాభారతంలో తపతీసంవరణోపాఖ్యానం ఉంది. సూర్యుని కూతురు తపతి. భూలోకంలో ఉన్న సంవరణునితో ఆమె వివాహం జరుగుతుంది. ఆ సందర్భంలో సూర్యుని రథం నిమిషానికి 2000 యోజనాల వేగంతో భూమికి ప్రయాణం

చేసినట్లు చెప్పబడింది. అప్పటి లెక్క ప్రకారం నిమిషం అంటే 16/75 సెకండ్లు. యోజనమంటే 91/11 మైళ్ళు. ఈనాటి లెక్కలలో చూసుకుంటే సెకనుకు 1 లక్ష 70 వేల 454 మైళ్ల వేగం అవుతుంది. ఆధునిక విజ్ఞానశాస్త్రం కూడా కాంతి వేగాన్ని సెకనుకు 1 లక్ష 86 వేల 325 మైళ్ళుగా చెప్పింది. దీన్నిబట్టి కాంతి వేగాన్ని లెక్కించే పద్ధతి వేదాంగమైన జ్యోతిషంలో స్పష్టంగా ఉన్నట్టు చెప్పవచ్చు.

వేదాలు వాడిన భాష ప్రతీకాత్మకమైంది. నిదానాత్మక లేదా సంకేతాత్మక భాష అని కూడా పిలవవచ్చు. ఈ భాషను ఎందుకు వాడారు? అంటే **'పరోక్ష క్రియా వై దేవా'** దేవతలు పరోక్ష విద్యాప్రియులు. ప్రత్యక్షంగా శబ్దం చేత బోధింపబడే తత్త్వం కాదు కాబట్టి దైవతత్త్వాన్ని పరోక్ష పద్ధతిలో ప్రతీకలను ఆశ్రయించి సంకేతం సహాయంతో నిరూపించడానికి వైదిక మహర్షులు ప్రయత్నం చేశారు. ఈ రహస్యాన్ని తెలిసి శబ్దాలకు వ్యుత్పత్తి చెప్పిన మొదటివాడు యాస్కాచార్యుడు. కశ్యప అని ఒక మహర్షి పేరు. 'పశ్యక'-చూసేవాడు (దార్శనికుడు) అని అర్థం. వర్ణాలను తిరగవేస్తే 'కశ్యప' అయిందని యాస్కుడు చెప్పాడు. ఇలాగే **'అగ్రే వర్తతి ఇతి అగ్నిః'.** తొలుత యజ్ఞంలో ప్రజ్వలించేది అగ్ని. అగ్ని ప్రజ్వలింపచేసిన తర్వాతే యజ్ఞం జరుగుతుంది.

ఇక వ్యాకరణం. పదంలో ధాతువు, ప్రత్యయ మనే రెండువిభాగాలను గుర్తించి పదనిర్మాణ స్వరూపాన్ని నామ, క్రియారూపాల విభజించి 4000 సూత్రాలలో ఆనాటి భాషను వ్యాకరించిన పాణిని ఆధునికశాస్త్ర పరిభాషలో చెబితే ఒక భాషా విజ్ఞాని.

అంటే భాషలో అభివ్యక్తంగాని స్థితి- అభివ్యక్తమయ్యేస్థితి రెండు ఉన్నాయని వైదికవాఙ్మయం గుర్తించిందని అర్థం. దీనికి మూలమైన వేదమంత్రాలున్నాయి. ఈ మంత్రాల సారాంశంగా వైదిక మహర్షులు భాషాపరిణామాన్ని చాలా శాస్త్రీయంగా దర్శించారని చెప్పవచ్చు.

వైదిక మహర్షులు భాషా తత్త్వాన్ని 'వాక్కు' అన్నారు. సృష్టిలో అంతటా వ్యాపించి ఉన్న శబ్ద తత్త్వాన్ని వాక్కు అని సాధారణీకరించి వేదం ప్రయోగించింది.

వేదమంత్రాలలో చాలాచోట్ల మనసే వాక్కుకు మూలమని చెప్పారు. **'దేవం మనః'** – దేవత మనోరూపుడు. అలాంటి మనో రూపాలైన దేవతలు వాక్కును సృష్టించారని ఒక వేద మంత్రం స్పష్టంగా చెబుతున్నది.

మనస్సులో వాక్కు, వాక్కులో మనస్సు స్థిరంగా కలిసి ఉన్నాయి. ఈ మనస్సునే అర్థం అని, వాక్కునే శబ్దం అని అంటాం. దీన్నే వేదం ప్రతిపాదించిన శబ్దార్థ నిత్య సంబంధ సిద్ధాంతమని అంటాం.

సృష్టి ఆవిర్భావాన్ని గురించి నాటి నుంచి ఈనాటి దాకా విజ్ఞానులు అనేక విధాలుగా ఆలోచిస్తున్నారు. వేదం ఆ సమస్యను నారద సూక్తం ద్వారా ఇలా వివరిస్తోంది.

'ప్రారంభంలో నిస్సందేహముగా ఏమీ లేదు. అస్తి-నాస్తి భావాలు రెండు లేవు. అప్పుడు స్వర్గం లేదు భూమి లేదు. ఆకాశము లేదు. అప్పుడు నాస్తిలో అహమస్మి అన్న భావన పుట్టి చైతన్యమేర్పడింది. ఆ చైతన్యంలో అగ్ని పుట్టింది.'



సృష్టి అంతా తేజస్సులో నుంచి పుట్టింది. అందులోంచి నీరు, దానిలోంచి పృథ్వి పుట్టింది అని వేదం గుర్తించింది. ఆ అగ్నివాయువులో నుంచి, ఆ వాయువు ఆకాశంలోంచి పుట్టిందని కూడా వేద మంత్రం స్పష్టంగా చెబుతోంది.

ఆధునిక భూగోళ శాస్త్రజ్ఞుల అవగాహన ప్రకారం నీరే భూమిగా ఘనీభవించిందంటున్న సిద్ధాంతంలో బలముందట. అందుకే ప్రపంచపటం స్వరూపం, ఖండాల విభాగం, అనంత కాలంలో మారుతూ వచ్చిందంటున్నారు.

ఈ తత్త్వాలకు మూలమైన ఆకాశాన్ని శూన్యంగా, పూర్ణంగా వివరించే మంత్రం ఉంది.

**"పూర్ణమదః పూర్ణమిదం....."** అని వేదమంత్రం అంటున్నది. ఏది లేకపోతే సంఖ్యాతత్త్వం పూర్ణంకాదో దాన్ని పూర్ణ మన్నారు. అంచేత సున్నకు సున్న కలిపినా, సున్న నుంచీ సున్న తీసివేసినా మిగిలినది సున్న అని ఈ మంత్రంలో సంఖ్యాతత్త్వం చెప్పబడింది.

ఇంకా సంఖ్యాశాస్త్రానికి సంబంధించి వేదంలో చాలా గూఢమైన రహస్యాలున్నాయి సంఖ్యలో రెండు విధానాలున్నాయి.

**ఐశ్వర్యం లేకపోవడంవల్ల**
**మహాత్ములు సువర్ణాభరణాలు**
**ధరించకపోవచ్చు.**
**అయినా వాళ్ళ చేతికి ప్రశస్తమైన**
**త్యాగమూ, శిరస్సుకు**
**గురుపాద నమస్కారమూ,**
**ముఖానికి సత్యవచనమూ,**
**భుజాలకు సాటిలేని**
**జయశీలమైన పరాక్రమమూ,**
**హృదయానికి నిష్కల్మషమైన ప్రవర్తనా,**
**చెవులకు శాస్త్ర శ్రవణమూ -**
**ఇవే అలంకారాలు.**

**1)బేసిసంఖ్యలు:** 1,3,5,7,9 ఇలా ఉంటాయి. **2)సరిసంఖ్యలు:** 2,4,6,8 ఇలా ఉంటాయి. శివుణ్ణి బేసి సంఖ్యలలోను, పార్వతిని సరి సంఖ్యలలోను స్తుతించిన వేదమంత్రాలున్నాయి.

**'ఏకాచమే త్రిసశ్చమే పంచచమే సప్తచమే....'** ఇలా శివుణ్ణి, **'ఏకపదీ సా ద్విపదీ సా చతుష్పదీ....'** అని పార్వతిని వేదమంత్రాలు స్తుతిస్తున్నాయి.

గణితంలో ఒక ప్రధాన అంశం - మొత్తాన్ని లెక్కించటం. దీన్ని అక్షవిద్య అని అన్నారు. నలమహారాజు వద్ద ఈ అక్షవిద్యను నేర్చుకోవడానికి ఋతుపర్ణ మహారాజు సిద్ధ పడతాడు. ఇది ఒక యాదృచ్ఛిక నమూనా పద్ధతిని మూలంగా కల్గింది. ఒక నిర్ణీత పరికరంలోని ఆకుల్ని లెక్కించి చెట్టులో మొత్తం ఎన్ని ఆకులున్నాయో చెప్పటం ఈ విద్య. స్టాటిస్టిక్స్ లో ఇప్పటికీ ఇదే మౌలికమైన సూత్రం.

అథర్వణం ఒక స్తంభం ఆధారంగా చూపింది. అందులో ధన రుణ ధ్రువాలు రెండూ కలిసి ఉన్నాయి. అందుకే విరుద్ధ శక్తులు ఒకచోట కలసి ఆ స్తంభమేర్పడింది. భాగవతంలో నృసింహస్వామి స్తంభంలో నుంచి పుట్టాడన్న వర్ణన వెనుక ఈ అక్షవిద్య దాగి ఉందని స్పష్టంగా చెప్పవచ్చు.

ఇక భౌతికశాస్త్రానికి స్పష్టమైన ఒక అంశం ఘర్షణ సూత్రంకి సంబంధించింది ఉంది. అది ఒరపిడిలో ఉష్ణం పుడుతుందన్న సూత్రాన్ని గుర్తించే వైదికులు అరటి కొయ్యలను రెండింటిని తీసుకొని ఒక కొయ్యలో వృత్తాకార ద్రోణాన్ని కల్పించి దానిపై మరొక కొయ్య నుంచి త్రిప్పుతారు. ఆ తిప్పే వేగంలో నిప్పుపుడుతుంది. నిప్పు కనిపెట్టక ముందు బ్రాహ్మణుని హస్తంలో అగ్ని ఉందని ఆ ప్రాణిలో హవిస్సును సమర్పించ వచ్చని కూడా వైదికులు భావించారు. ఇప్పటికీ ఋగ్వేద సంప్రదాయంలో ఉన్న పాణిహోమం ఇదే.

ఇలాగే యజ్ఞంద్వారా పొగను సృష్టించడం, పొగద్వారా వర్షం రావటం అన్నది భ్రమ కాదు. సత్యమే.

యాజ్ఞికుడు ముందురోజు ఉపవసించాలని చెప్పారు. యజ్ఞ ప్రక్రియలో విఘ్నం రాకుండా ఉపవాసాన్ని విధించారు.

ఈ విధంగా చూస్తే విజ్ఞానానికి మూలం 'వేదమే' అని నిస్సందేహంగా చెప్పవచ్చు.


ధర్మము నశించినచో అన్ని లోకాలు అధర్మము పాలగును

# శ్రీకృష్ణామృతం

అందునా  కన్నయ్య ఇంకొక్కనాడు
అమ్మ పంచనచేరె పాలడగగాను
ఓయమ్మ మాయమ్మ చిన్నిబాలుడను
ఈయవేమమ్మ మరి ఆ వెండి దొన్నె

ఏమిరా కన్నయ్య ఇటువచ్చినావు?
పాత్రతో నీకంత పనిఏల నయ్య?
పాత్రలేకున్న నే పాలెట్ల తాగుదు?
పాలుత్రాగక బొజ్జ నిన్డునది ఎట్లు?

ఈపూట కన్నయ్య క్షీరముడిగినది!
పాలులేవయ్య పాత్రలో నేనేమి చేతు?
అట్లయిన ఓ యమ్మ పాలెప్పుడిచ్చెదవు?
ఊరకుందును నేను నీవిచ్చువరకు

రాత్రిగానివ్వ ఆవు పాలిచ్చునపుడు
పాత్రనిండుగ నీకు పాలిత్తునపుడు

చిన్ని బాలుడను నాకు రాత్రెట్లు ఎరుక?
చెప్పుమోయమ్మ నీవు రాత్రెట్లునుండు?

అంతటా చీకటియు వెలుగు కాన్పడదు
అట్టి సమయమును రాత్రిగా నీవెరుగగలవు

ఇటు చూడుమోయమ్మ నావైపు తిరిగి
కన్ను రెప్పలు రెండు మూసుకున్నాను
అంతటా చీకటియే వెలుగు కాన్పడదే
రాత్రి అయినది అమ్మ పాలియ్యవేమే?

ఈ తీరు తల్లితో మారము చేయుచూ
చిట్టి చేతుల అమ్మ చెంగు పట్టేవు
బుడిబుడి అడుగులతో వెమ్బడించేవు
ఓ చిన్ని కన్నయ్య నన్నటులే బ్రోవు.

– "అనంత" (కృష్ణసుందరి సత్తిరాజు)



ఆయుర్వేదం

# ఆహార ఔషధం 'కాకర'

- డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ

'షడ్రసయుక్త' అంటే తీపి, పులుపు, ఉప్పు, కారం, చేదు, వగరు రుచులతో కూడిన ఆహారాన్ని శాస్త్ర నిర్దేశిత పద్ధతిలో, వాటి వాటి నిష్పత్తులలో స్వీకరించమంటుంది మన వైదిక విజ్ఞానం. తద్వారా వాత పిత్త కఫ దోషాలు, రసరక్తాది సప్త ధాతువులు వగైరాలు వాటి వాటి క్రియా సామర్థ్యంతో ప్రాకృతిక ధర్మాలు నిర్వర్తిస్తూ మన ఆరోగ్యాన్ని పదిలంగా కాపాడటం వల్ల శారీరిక, మానసిక వ్యాధులు దరిచేరకుండా ఉంటాయని స్థూలంగా అర్థం చేసుకోవచ్చు.

అందుకే **"స్వస్థస్య స్వాస్థ్య రక్షణం"** అంటుంది అత్యంత ప్రాచీన ఆయుర్వేదవైద్యం. ఆరోగ్యవంతుల ఆరోగ్యాన్ని కాపాడటం ఈ వైద్యవిధాన ప్రధాన ఉద్దేశ్యం. ఆరోగ్యాన్ని పరిరక్షించటంలో ఈ షడ్రసాలు ప్రధానపాత్ర వహిస్తాయి.

మన ఆహార పదార్థాల తయారీలో ఉపయోగించుకునే చేదు రుచి కలిగిన కూరగాయ **'కాకరకాయ'**. గతంతో పోలిస్తే ఈ ఆధునిక కాలంలో చేదురుచి కలిగిన ఈ కాకరకాయలను మనం వినియోగించడం తక్కువగా ఉందని చెప్పుకోవచ్చు. మధుమేహం, స్థూలకాయం, ఆహార జనిత వ్యాధులు విస్తారంగా పెరిగి పోవడానికి ఆహారంలో ఇలాంటి చేదురుచి కలిగిన పదార్థాల వినియోగం తక్కువ కావడం కూడా ఒక కారణంగా చెప్పుకోవచ్చు.

కాకరకాయలు కొన్ని పొడవుగా, కొన్ని పొట్టిగా, కొన్ని ఆకుపచ్చ రంగులో, కొన్ని ఆకుపచ్చ తెలుపు రంగు కలిగిన మిశ్రమ వర్ణంలో ఉంటాయి.

ఇవి పండుగా మారినప్పుడు ఎరుపు, సింధూరం రంగులో ఉంటాయి.

ఈ కాకరకాయలను సంస్కృతంలో **'కారవేల'** అని వ్యవహరిస్తారు. ఆంగ్లంలో 'బిట్టర్ గార్డ్, బిట్టర్ మెలాన్' గా పిలువబడే 'కుకుర్‌బిటేసి' అను వృక్షకుటుంబానికి చెందిన ఈ కాకర శాస్త్రీయనామం 'మొమార్డిక ఛారేన్షియా'.

కాకరకాయను పప్పు, పులుసు, వేపుడు కూరలు, ఊరగాయలు, వొరుగుల తయారీలో వాడుతారు.

కొంత మంది వీటి చేదు రుచి తగ్గేందుకు కాకర ముక్కలను ఉప్పు కరిగించిన నీటిలో వేసి కొద్దిసేపు ఉంచి వాడుకుంటారు. ఇలా చేయటం వల్ల కాకరలోని పోషకాంశాలు నష్టపోవటమేకాక, ఆరోగ్య పరిరక్షణలో కూడా వీటి ప్రయోజనం తగ్గుతుంది.

కాకరకాయలను గుండ్రంగా తరిగి, ఎండించి, నిల్వ చేసుకొని అప్పుడప్పుడు నేతిలో వేయించుకొని కూరలో కలుపుకొని తింటుంటే చాలా రుచికరంగా ఉంటుంది. ఇలా కాకర ఆహారంగా ఉపయోగపడుతుందనే విషయం అందరికి విదితమే.

అపార ఔషధ గుణాలు నిబిడీకృతమై ఉన్న ఈ కాకరకాయల్ని నిత్యజీవితంలో మనం ఎదుర్కొనే వివిధ సాధారణ అనారోగ్య సమస్యలకి ఔషధంగా ఎలా సద్వినియోగం చేసుకోవచ్చో తెలుసుకుందాం.

**మలబద్ధక సమస్య :** రోజూ రాత్రి పడుకునేటప్పుడు అర టీ స్పూను నుంచి ఒక టీ స్పూను కాకరకాయ పేస్టులో అంతే ప్రమాణంలో తేనె కలిపి సేవిస్తుంటే మలబద్ధక సమస్య తగ్గటమే





కాక కడుపులోని ప్రేవుల్లోని ఏలికపాములు లాంటి నులి పురుగులు హరిస్తాయి.

**మధుమేహం (షుగర్ వ్యాధి) నియంత్రణకు :** కాకరకాయలను ముక్కలుగా తరిగి, ఎండించి చేసిన పొడి పచారికొట్లు లేదా ఆయుర్వేద ఔషధ విక్రయశాలలో లభ్యమయ్యే పొడపత్రి మరియు నేరేడువిత్తుల చూర్ణాలను ఒక్కొక్కటి 50 గ్రాముల చొప్పున కలిపి ఉంచుకొని ఉదయం, సాయంత్రం 2-3 గ్రాముల పొడిని 50 మి.లీ. నీటిలో కలిపి సేవిస్తూ ఉండాలి.

**మోకాళ్ళ నొప్పులకు :** కాకరకాయముక్కలను కొద్దిగా నీరు చేర్చి, పేస్టుచేసి, 8వ వంతు పసుపు కలిపి మెత్తగా నూరి దట్టంగా మోకాళ్లపై లేపనం చేసి ఆరిన పిదప కడిగేస్తూ ఉంటే ఈ సమస్య త్వరగా తగ్గుతుంది. మోకాళ్ళలో చేరిన నీరు తగ్గుతుంది. మోకాళ్ళ కండరాలు శక్తిని సంతరించుకుంటాయి. ఇదే ఔషధాన్ని పై పూత మందుగా లేపనం చేయటం వల్ల అరికాళ్ళు, అరి చేతులు పగుళ్ళు తగ్గుతాయి.

**మూలవ్యాధి :** రోజూ రాత్రి పడుకొనేటప్పుడు 25 మి.లీ. కాకరకాయరసంలో అర టీ స్పూను కరక్కాయలపొడి, 2-3 చిటికెల ఉప్పు కలిపి సేవిస్తు ఉంటే మూలవ్యాధి వల్ల ఆసన భాగంలో కలిగే నొప్పి, మంట, బాధ, పోటూ తగ్గుతాయి.

**జుట్టురాలే సమస్య :** వారానికి రెండుసార్లు 50 మి.లీ. కాకరకాయ రసంలో అర టీ స్పూను పంచదార కలిపి కరిగించి పది నిమిషాలు ఆగి తలమాడు భాగం అంతా పట్టించి కొద్దిసేపు మర్దనచేసి, పిదప గోరువెచ్చని నీటితో తలస్నానం చేస్తే చుండ్రు సమస్య తగ్గుతుంది. శిరోజాలు నల్లగా, మృదువుగా, నిగనిగ లాడుతూ సౌందర్యవంతంగా పెరుగుతాయి. జుట్టు రాలదు, పేల లాంటి సమస్యలు దరిచేరవు.


**చర్మవ్యాధులకు :** రోజూ పరగడుపున 20 మి.లీ. కాకరకాయ రసంలో 5 మి.లీ. నిమ్మరసం కలిపి సేవిస్తూ ఉంటే ఒంటి దురదలు, ఫంగస్ వ్యాధులు, సోరియాసిస్ లైకెన్ ప్లానస్, గజ్జి, తామరలాంటి వివిధ చర్మరోగాలకు చక్కటి పరిష్కారం దొరుకు తుంది. ఈ ఔషధం రక్తంలోని విషపదార్థాలను తొలగించి, రక్తాన్ని శుద్ధి చేస్తుంది. శరీరంలో అధికంగా సంచితమైన క్రొవ్వును కరిగించి, అధిక బరువు తగ్గటానికి దోహదపడు తుంది. వ్యాధినిరోధకశక్తి పెరిగేందుకు ఉపయోగపడుతుంది.

**కాళ్ళు, చేతి వ్రేళ్ళ మధ్య వచ్చే పుండ్లు తగ్గేందుకు :** రోజుకు ఒక సారి కాకరకాయ ముక్కలలో తగినంత పసుపు, ఉప్పు కలిపి మెత్తగా నూరి లేపనం చేస్తుంటే కాళ్ళు, చేతి వ్రేళ్ళ మధ్యలో వచ్చే పుండ్లు, దురదలు తగ్గిపోతాయి.

### 'అభ్యాసం' ద్వారా వచ్చే గుణాలు...

మనకు జన్మతః రాని అనేక అలవాట్లను నిరంతరం అభ్యాసం ద్వారా మనం అలవరచుకోవచ్చు. అంటే ఒక అలవాటు మన సహజలక్షణం అయ్యే వరకు నిరంతరం అభ్యసించడం ద్వారా వస్తే, దానిని అలవాటుకు 'అభ్యాసం ద్వారా అబ్బిన గుణం' అని అంటారు. ఉదాహరణకు 'అతడు నిజాయితీని సదా ఆచరించడం ద్వారా అది అతడి సహజగుణం అయ్యింది', 'నిరంతరం చదవడం అభ్యాసం చెయ్యడం వల్ల ఆమె మేధావి అయ్యింది' అని మనం అనేటప్పుడు వాళ్లు తమకు స్వతః సిద్ధంగా రాని లక్షణాలను నిరంతరం అభ్యసించడం ద్వారా తమ సహజగుణంగా చేసుకున్నారని మనం సూచిస్తాం.

విశ్వదాభిరామం  వేమన పద్యసూక్తి



## ప్రగల్భం - పరిహార్యం

తీర్పు నార్పలేని తీర్పరితన మేల?
కూర్పు విప్పలేని నేర్పు రేల?
పెట్టి పొయ్యలేని వట్టిబీరము లేల?
విశ్వదాభిరామ! వినుర వేమ!


**అర్థాలు:** తీర్పు=న్యాయనిర్ణయము; తీర్పరి=న్యాయాధిపతి; ఆర్పు= ఉపశమింపచేయు; పెట్టిపొయ్య లేని= దానం చేయలేని; బీరము= గర్వపు మాటలు.

**భావం:** తీర్పు చెప్పలేడు, తగవు మాన్పలేడు. అటువంటి వాని తీర్పరి తనం ఎందుకు? చక్కగా కూర్చలేని, కూడినదానిలోని చిక్కును విప్పలేని వానినేర్పు ఎందుకు? పెట్టడానికి పొయ్యడానికి చేతకాని వాడు బీరాలు పలకడం ఎందుకు?

**వివరణ:** తీర్పరి అనేపేరు పెట్టుకున్నవాడు ఇతరుల తగవులను పరిష్కరించాలి. లేదా అసలు తగవే లేకుండా రెండుపక్షాలవారిని కలపాలి. ఆ రెండు పనులు చేయలేనివాడికి తీర్పరి అనే గౌరవం ఉండదు. అలాగే నేర్పరి అనిపించుకునేవాడు వ్యవహారాలను చక్కగా కూర్చాలి. ఎక్కడయినా చిక్కుముడులు ఉంటే వాటిని చక్కగా విడదీయాలి. ఈ రెండూ చేయనివాడికి నేర్పరి అనే పేరు వ్యర్థం. ఆకలికి అన్నం పెట్టడమూ, దాహానికి నీరు ఇవ్వడమూ చేతకానివాడు తాను ఎంతో ఉదారుడినని గొప్పలు చెప్పుకోగూడదు. మానవుడు తనవృత్తికి తగినట్లు కర్మలు చేయాలి. చెప్పినపని తప్పక చేయాలి. అంటే చేయగలిగినదే చెప్పాలి.

- కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

# వైకుంఠపాళి 70



నిర్వహణ శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు

### అడ్డం

2)వాల్మీకి రాసిన కావ్యము(5); 6)మాట(2); 7)నేలను శుభ్రపరచునది(3); 8)పార్వతి(2); 11)నది(3); 12)వైవస్వతుని పుత్రుడు(3); 16)తండ్రి(2); 17)సంపద(3); 18)వరుణుని కుమారుడు(2); 21)విష్ణువే(7)

### నిలువు

1)తి.తి.దే. నిర్వహించే మాసపత్రిక(4); 2)తారకమంత్రం(2); 3)హస్తిభార్య. వికుంఠనుని తల్లి(4); 4)మోక్షము(2); 5)'అదిగో అల్లదిగో శ్రీవారివాసము' అను కీర్తన రచించినది(4); 9)ఉజ్జయినీ దేశపు రాజధాని(3); 10)అశోకుని వంశంలోని వాడగు బృహద్రథుని సేనాపతి(3); 13)మందపాలుడను మహర్షి భార్య(3); 14)ఈ ప్రాంతం నుండి తిరుమలకొండకు మెట్లు ప్రారంభమవుతాయి(4); 15)మంజీరము(2);19)కెరటము(2); 20)క్షీరములు(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు




# సత్య మహిమ

- డా॥ కె. రెడ్డప్ప

వేదకాలం నుండి కూడా సత్యానికున్న ప్రాధాన్యం నిరుపమానం, వర్ణనాతీతం, అనిర్వచనీయం. సర్వకాల సర్వావస్థలలో అగ్రపీఠం అధిరోహించిన ధర్మాలలో సత్యము ప్రముఖమైనది. వర్ణ, వర్గ, ప్రాంత, భాష భేదాల కతీతంగా భాసించే ధర్మం సత్యము. మానవ మనుగడ నాటికి నేటికి సత్యముపై ఆధార పడినదనుటలో అతిశయోక్తి లేదు. సర్వమతాలు, సర్వ శాస్త్రాలు సత్యాన్ని ప్రబోధిస్తున్నాయి. సంస్కృతాంధ్రసాహిత్యాలలో "సత్య" మహిమ నొక్కి వక్కాణించబడింది.

## సత్యమహిమ

సంస్కృత సాహిత్యసాగరంలో ఆదికవి వాల్మీకి రామాయణ మహాకావ్యంలో సత్యమహిమను అడుగడుగునా వివరించాడు. అయోధ్యా కాండలో జాబాలికి రాముడు సత్య మహిమనిలా తెల్పాడు.

సత్యమేవేశ్వరో లోకే సత్యం పద్మాశ్రితా సదా।
సత్యమూలాని సర్వాణి సత్యాన్నాస్తి పరం పదమ్॥

లోకానికి సత్యం ప్రభువు. లక్ష్మి సత్యాన్నే ఆశ్రయించి ఉంటుంది. సర్వమూ సత్యం మీదే ఆధారపడి ఉంది. సత్యం కంటే ఉన్నత స్థానం లేదు.

సత్యమొక్కటే భగవంతునికి చక్కని నివాసం. ధర్మం సత్యంలోనే స్థిరంగా ఉంది. జ్ఞాన విజ్ఞానాలకు విలాసాలైన వేదాలు సత్య స్వరూపాలే. మనం ఉత్కృష్ట స్థానాన్ని పొందడానికి సత్యమొక్కటే రాజమార్గం.

మహాభాగవతం ఏకాదశ స్కంధంలో శ్రీకృష్ణుడు ఉద్ధవునికి చేసిన ఉపదేశంలో.. 'అహింస, సత్యము, దొంగతనము చేయకుండుట, అసంగము, లజ్జ, అసంచయము, ఆస్తిక్యము, బ్రహ్మచర్యము, మౌనము, ధైర్యము, అభయము, శౌచము, జపము, తపము, హోమము, శ్రద్ధ, ఆతిథ్యము, భగవదర్చనము, తీర్థయాత్రలు చేయడం, పరోపకారం, సంతుష్టి, ఆచార్యసేవనము అనునవి యమ నియమాలు. వీటిలో సత్యము ద్వితీయ స్థానాన్నాక్రమించింది."

భగవద్గీతలో సత్యం సుగుణంగా గణించబడింది. శ్రీకృష్ణుడు అర్జునునికి ఇరువది యారు సుగుణాలను వివరించాడు.

"భయం లేకపోవడం, చిత్తశుద్ధి, జ్ఞానయోగనిష్ఠ, దానం, ఇంద్రియనిగ్రహం, యజ్ఞం, వేదపఠనం, తపస్సు, సరళ స్వభావం, అహింస, సత్యం, కోపం లేకపోవడం, త్యాగబుద్ధి, శాంతి, చాడీలు చెప్పకపోవడం, భూతదయ, విషయసుఖాలు వాంఛించక పోవడం, మృదుత్వం, సిగ్గు, చపలత్వం లేకపోవడం, తేజస్సు, ఓర్పు, ధైర్యం, శుచిత్వం, ద్రోహం చేయకపోవడం, దురభిమానం లేకపోవడం- ఈ ఇరవై ఆరు సుగుణాలు దేవతల సంపదలవల్ల పుట్టినవాడికి కలుగుతాయి" అని వివరించాడు.

వేదాలు సత్యానికి సముచిత స్థానాన్నిచ్చాయి. సత్యం స్వరూప స్వభావాలను ఈ విధంగా వర్ణించాయి.

"వేదసారము సత్యబోధనము. సత్యం దమాన్ని కలిగిస్తుంది. దమం దాన గుణాన్ని కలిగిస్తుంది. దానం తపస్సుకు మార్గమౌతుంది. తపస్సు అమృతతత్త్వానికి మార్గం చూపుతుంది" అని. ఆంధ్ర మహాభారతంలో నన్నయ సత్యమహిమను ప్రవచించినాడు. శకుంతల దుష్యంత మహారాజుతో సత్య మహిమనిలా బోధించింది.

"నూరు నూతులకంటె ఒక బావి, నూరు బావులకంటె ఒక యజ్ఞము, నూరు యజ్ఞాలకంటే ఒక కుమారుడు, నూర్గురు కుమారులకంటే ఒక సత్య వాక్యము శ్రేష్ఠతమములు."

"సర్వతీర్థాభిగమనంబు సర్వ వేద సమిధియు, సత్యంబుతో సరియుగావు" అని ఉద్ఘాటించాడు నన్నయ.

## సత్యము వలన కలిగే ఫలితము

సత్యము వలన ఎంత ఫలితం పొందగలమో వివరించటానికి మాటలు చాలవు. ఆచరించి, అనుభవించి తరించాల్సిందే. రామాయణంలో వాల్మీకి సత్య ఫలితాన్ని రమ్యంగా వర్ణించాడు. రాముని గుణ గణాలను ప్రస్తుతిస్తూ దశరథుడిలా అంటాడు.

"రాముడు సత్యం చేత జనుల్ని, దానం చేత దీనుల్ని, సేవచేత గురువుల్ని, ధనుస్సుతో శత్రువుల్ని వశపరచుకోగలవాడు."

వినయం, సత్యం, పరాక్రమంగల నరపతి దేశాన్ని చక్కగా పరిపాలిస్తాడట.


సత్యాన్ని, ధర్మాన్ని అంటి పెట్టుకున్న వాళ్లను మృత్యు దేవత కూడా భయపెట్టలేదని ఉద్ఘాటించబడింది.


నీతి - ఎల్లప్పుడూ సత్యమునే పలుకవలెను.

చిత్ర కథ

# తిరుప్పాణి ఆళ్వార్

కథ– డి. శ్రీనివాసదీక్షితులు
చిత్రాలు– కె. తులసీప్రసాద్




13 దారిపక్కనే ఉన్న రాయి తీసుకుని తిరుప్పాణి మీదకి విసిరాడు ముని. మొహం మీద తగిలి రక్తం ధారగా కారుతోంది. తిరుప్పాణి లేచి...
14 అయ్యా! నా అపరాధాన్ని మన్నించండి. దూరంగా పోతున్నానయ్యా! రంగా...
15 ఒక్కమాట అనకుండా లేచి వెళ్లిపోయాడు.
16 రక్తం చూడగానే మునిలో పశ్చాత్తాపం కలిగింది. మథనపడుతున్నాడు. ఆ రోజు రాత్రి స్వప్నంలో స్వామి సాక్షాత్కరించి నా భక్తున్ని నీ భుజాలపై ఎక్కించుకొని గుడికి తీసుకుని రావాలి.
17 మరుసటి రోజు ముని కావేరిలో స్నానం చేసుకొని, తిరుప్పాణిని తన భుజాల మీద ఎక్కించుకుని గుడికి వచ్చాడు లోకసారంగముని...
18 నన్ను దింపండి అయ్యా! అపచారం... అపచారం!
19 నా పుణ్యఫలం తిరుప్పాణీ!
20 తిరుప్పాణిని ఎత్తుకునే ముని గుడి చుట్టూ మూడు ప్రదక్షణాలు చేశాడు. గుడి తలుపులు తెరుచుకున్నాయి. తిరుప్పాణి.....
21 శ్రీరంగనాథా! నేరుగా నాకు దర్శనం ఇచ్చావా? ధన్యుణ్ణి రంగా!
22 తిరుప్పాణీ! నువ్వు ఆళ్వారువే! ఆళ్వారువే!
23 తిరుప్పాణి ఆనందంతో ఆశువుగా 'అమలనాదిప్పిరాన్' అనే దివ్యప్రబంధాన్ని గానం చేశాడు
24 నీకు వాహనమై ధన్యుణ్ణి అయ్యాను!
25 శ్రీరంగరంగా..
26 భక్తులందరూ ముక్తకంఠంతో అన్నారు.
27 ముని వాహనుడు తిరుప్పాణి
28 యోగివాహనుడు ఆళ్వార్

# బాలవినోదం

పిల్లలూ... మీ మేధకు పదును పెట్టండి....

నిర్వహణ: డా॥ అల్లాడి సంధ్య

## కదంబం

### ద్వాదశ ఆళ్వార్లు

| | |
|---|---|
| 01)పొయిగై ఆళ్వార్ | 07) కులశేఖరాళ్వార్ |
| 02)పూదత్తాళ్వార్ | 08) పెరియాళ్వార్ |
| 03)పేయాళ్వార్ | 09) ఆండాళ్ |
| 04)తిరుమళిశై యాళ్వార్ | 10) తొండరడిప్పొడి యాళ్వార్ |
| 05)నమ్మాళ్వార్ | 11) తిరుప్పాణాళ్వార్ |
| 06)మధురకవి ఆళ్వార్ | 12) తిరుమంగై ఆళ్వార్ |

### పిల్లలూ..జతచేయండి!!

| | |
|---|---|
| 1) ద్వారక | అ) శ్రీరాముడు |
| 2) పూరీ | ఆ) మీనాక్షి |
| 3) అయోధ్య | ఇ) విశాలాక్షి |
| 4) మదురై | ఈ) జగన్నాథుడు |
| 5) కాశీ | ఉ) శ్రీకృష్ణుడు |

జవాబులు: 1-(ఉ); 2-(ఈ); 3-(అ); 4-(ఆ); 5-(ఇ)

### మీకు తెలుసా?

1) పద్మావతీదేవి తల్లి పేరు?
2) వకుళమాత పూర్వజన్మ?
3) గోదాదేవికి విశేషపూజలు జరిగే మాసం?
4) తిరుపతి శ్రీకపిలేశ్వరాలయంలోని అమ్మవారి పేరు?
5) తిరుచానూరు అమ్మవారి ఆలయంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనే ఉత్సవం
6) తిరుమలలో శ్రీనివాసునికి భూదానం చేసినవాడు
7) తిరుమలలో శ్రీవారికి మొదట తోయ(తీర్థ)కైంకర్యం చేసినవాడు

జవాబులు:
1) ధరణీదేవి
2) యశోద
3) ధనుర్మాసం
4) కామాక్షి
5) పంచమి తీర్థం
6) వరాహస్వామి
7) తిరుమలనంబి

### కనుక్కోండి


ఈ అక్షరాలతో ఒక సూక్తి వస్తుంది...

| | | | | | |
|---|---|---|---|---|---|
| వ | చ | గ | బా | తే | తాం |
| తం | భా | వి | ది | వు | గ |

జవాబు: భాగవతం చదివితే బాగవుతాం

### చిత్రలేఖనం

ఈ క్రింది బొమ్మకు రంగులు వేద్దామా...



ఈ పక్కన ఉన్న బొమ్మను క్రింది గడులలో గీయండి...

Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.



తిరుచానూరు
శ్రీపద్మావతీ అమ్మవారి
'లక్షకుంకుమార్చన'
(29-11-2021)

SAPTHAGIRI (TELUGU) ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams printing on 25-10-2021 and posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd.No.TRP/155/2021-2023 "Licenced to post without prepayment No.PMGK/RNP/WPP-04(1)/2021-2023" posting on 5th of Every Month.

# తిరుమల శ్రీవారి ఆలయంలో 'దీపావళి'
# (04-11-2021)

